వెలుతురు

శనివారం 31.10.2026

పేజీలు : 12 వెల : రూ. 5/-

సంపుటి : 09
సంచిక : 138

తెలుగు దినపత్రిక

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD

www.velthuru.com

Follow :

ఆ 550 ఎకరాలను కొట్టేసేందుకు

కేసీఆర్ ప్రయత్నించారు

బీఆర్ఎస్ రాజ్యసభ ఎంపీ దామోదరరావుకు ప్రసాదరావు ఖరీదైన కారు

తీవ్రంగా విమర్శించిన సీఎం రేవంత్ రెడ్డి

భూములను ప్రజాప్రయోజనాలకే ఉపయోగిస్తామన్న సీఎం

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 30:

మియాపూర్‌లోని 550 ఎకరాల భూములను కొల్లగొట్టేందుకు కేసీఆర్, ఆయన బంధువులు అనేక రకాలుగా ప్రయత్నించారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. భూములను కొట్టేసేందుకు గోల్డ్‌స్టోన్ ప్రసాదరావు ప్రయత్నించారన్న ఆయన ఈ భూముల విషయంలోనే బీఆర్ఎస్ రాజ్యసభ ఎంపీ దామోదరరావుకు ప్రసాదరావు ఖరీదైన కారు బహుమతిగా ఇచ్చారని అన్నారు. కొందరు అధికారులను అడ్డంపెట్టుకుని భూములు కొట్టేయాలని బీఆర్ఎస్ నేతలు చూశారన్న సీఎం రేవంత్ రెడ్డి ఈ వివాదంలో ఆ అధికారులు కూడా అరెస్టయ్యారని తెలిపారు. మియాపూర్‌లోని 550 ఎకరాలను కాపాడేందుకు కేసీఆర్ సర్కారు ఏ ప్రయత్నం చేయలేదని అన్నారు. తాము అధికారంలోకి వచ్చాక ఈ కేసుపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు తెలిపారు. సుప్రీంకోర్టులో బలమైన వాదనలు వినిపించి రూ.50 వేల కోట్ల ఆస్తిని కాపాడుకోగలిగామని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు తీర్పు రాగానే ఈ భూములు స్వాధీనం చేసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. అవసరమైతే - మిగతా 11 లో..

హైస్పీడ్ రైళ్ల మార్గాల పనులు

వేగవంతం చేయండి

- నూతన రైలు మార్గాల మంజూరుకు అనుమతులు ఇవ్వండి
- అనంతారంలో మెగా ఫ్లైట్ మెయింటెనెన్స్ డిపో ఏర్పాటు చేయండి
- రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినతి

11

ఇంటింటికీ లెక్క..

దేశమంతా గణన

2027 జనగణనకు కేంద్రం సన్నద్ధం

ఉత్తరప్రదేశ్, పంజాబ్, గోవా, ఉత్తరాఖండ్‌కు ప్రత్యేక మినహాయింపు

డిజిటల్ విధానంలో వివరాల సేకరణ.. ఈసారి కుల గణన కూడా..

ఫిబ్రవరిలో మిగిలిన ప్రాంతాల్లో రెండో విడత.. తొలిసారిగా పూర్తిస్థాయిలో డిజిటల్ విధానం

దేశవ్యాప్తంగా 2027 జనగణన నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేపట్టింది. అయితే వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల కోసం జనాభా గణనకు ప్రత్యేక షెడ్యూల్‌ను ప్రకటించింది. ఉత్తరప్రదేశ్, పంజాబ్, గోవా, ఉత్తరాఖండ్‌లోని మంచు ప్రభావం లేని ప్రాంతాల్లో సాధారణ షెడ్యూల్‌కు ముందుగానే జనాభా గణన చేపట్టనున్నారు. ఈ నాలుగు రాష్ట్రాల్లో నవంబర్ 16 నుంచి 30 వరకు స్వీయ గణనకు అవకాశం కల్పించనుండగా, డిసెంబర్ 1, 2026 నుంచి జనవరి 4, 2027 వరకు ఇంటింటి సర్వే నిర్వహిస్తారు. జనవరి 5 నుంచి 9 వరకు పునఃపరిశీలన ప్రక్రియ చేపడతారు. ఎన్నికల నేపథ్యంలో ఆయా రాష్ట్రాల్లో జనగణన ప్రక్రియకు ఆటంకం కలగకుండా ఈ ప్రత్యేక షెడ్యూల్‌ను రూపొందించారు.

- న్యూఢిల్లీ, వెలుతురు అక్టోబర్ 30

రెండు విడతల్లో జనగణన

2027 జనగణనను రెండు ప్రధాన విడతల్లో నిర్వహిస్తున్నారు. మొదటి విడతలో భాగంగా 2026 ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు గృహాల జాబితా, గృహ గణన చేపట్టారు. ఇందులో ఇళ్ల పరిస్థితి, తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు, కుటుంబాలు వినియోగిస్తున్న ఆస్తుల వివరాలను సేకరిస్తారు. రెండో విడతలో జనాభా గణన చేపట్టి వ్యక్తుల సామాజిక, ఆర్థిక, విద్యా, వలసలు, సంతానోత్పత్తి తదితర వివరాలను నమోదు చేస్తారు. సాధారణ ప్రాంతాల్లో ఈ ప్రక్రియను 2027 ఫిబ్రవరిలో నిర్వహించనున్నారు.

కుల గణన కూడా..

ఈసారి జనగణనలో కులాల వారీగా వివరాలను కూడా సేకరించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో జనాభా - మిగతా 2 లో..

తొలిసారిగా డిజిటల్ విధానం

2027 జనగణనలో సాంకేతిక పరిజ్ఞానానికి పెద్దపీట వేస్తున్నారు. తొలిసారిగా పూర్తిస్థాయిలో డిజిటల్ విధానంలో వివరాల సేకరణ చేపట్టనున్నారు. గణకులు తమ స్మార్ట్‌ఫోన్లలోని ప్రత్యేక మొబైల్ యాప్ ద్వారా వివరాలను నమోదు చేస్తారు. ప్రజలు కూడా ఆన్‌లైన్‌లో స్వయంగా తమ కుటుంబ వివరాలను నమోదు చేసుకునే అవకాశం కల్పించారు. ఈ స్వీయ గణన ప్రక్రియలో 16 భాషల్లో వివరాలు నమోదు చేసుకునే సదుపాయం ఉంటుంది. ఆన్‌లైన్‌లో వివరాలు సమర్పించిన వారికి ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయిస్తారు. ఇంటికి సర్వేకు వచ్చే గణకులకు ఆ సంఖ్యను అందించాల్సి ఉంటుంది.

ఉత్తరాఖండ్‌లో కూలిన హెలికాప్టర్

ఆరుగురు మృతి

బద్రీనాథ్ నుంచి వస్తున్న క్రమంలో ఘటన

డెహ్రాడూన్, వెలుతురు అక్టోబర్ 30:

ఉత్తరాఖండ్‌లోని జోషిమఠ్ సమీపంలో ఒక ప్రైవేట్ హెలికాప్టర్ కూలిపోయింది. బద్రీనాథ్ నుంచి డెహ్రాడూన్ వెళ్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఆరుగురు చనిపోయినట్లు ఉత్తరాఖండ్ సివిల్ ఏవియేషన్ డెవలప్‌మెంట్ అథారిటీ (యూసీఏడీఏ) చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ప్రతీక్ జైన్ పేర్కొన్నారు. ఉత్తరాఖండ్లోని ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్లే ఈ ఘటన జరిగి ఉండవచ్చునని అధికారులు భావిస్తున్నారు.

ఉత్తరాఖండ్ విపత్తు నిర్వహణ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, శుక్రవారం మధ్యాహ్నం సుమారు 2:20 గంటల సమయంలో చమోలి జిల్లా జోషీమఠ్ పరిధిలోని 'చాయ్' గ్రామ సమీపంలోకి రాగానే హెలికాప్టర్ కమ్యూనికేషన్‌ను కోల్పోయింది. అనంతరం ట్రాకింగ్ సిస్టమ్కు సమాచారం రావడం - మిగతా 2 లో..

బంధం బెడిసికొట్టిన తర్వాత అత్యాచారం

రేప్ కేసు పెట్టలేరు

- విఫలమైన ప్రేమ బంధాన్ని అత్యాచారంగా చిత్రీకరించలేరు
- విడిపోయినంత మాత్రాన మోసం చేసినట్లు కాదు
- సమ్మతితో కూడిన బంధానికి అదే వర్తిస్తుంది
- సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు

11

ప్రేమ లేదా పరస్పర అంగీకారంతో కూడిన సంబంధాలు విఫలమైన తర్వాత, గతంలో సమ్మతితోనే జరిగిన శారీరక సంబంధాన్ని ఆ తర్వాత అత్యాచారంగా పరిగణించలేమని సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది.

హైదరాబాద్‌ను ముంచెత్తిన భారీ వర్షం

పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 30:

బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావం హైదరాబాద్ నగరంపై పడింది. శుక్రవారం మధ్యాహ్నం వరకు మామూలుగానే ఉన్నా, సాయంత్రం 5 గంటల నుంచి దట్టమైన మబ్బులు కమ్ముకొని ఉరుములు, మెరుపులతో నగరమంతటా వర్షం కురిసింది. చాలారోజుల తరువాత కురిసిన ఈ వర్షం నగరవాసులను ఇబ్బందులు పెట్టింది. గాలివానకు విద్యుత్ నిలిచిపోవడంతో పాటు రహదారులపై నీరు చేరి వాహనదారులకు నరకం చూపించింది. భాగ్య నగరంలో సాధారణంగానే సాయంత్ర వేళ ఆఫీసులు, స్కూళ్లు, కాలేజీలు వదిలే సమయం కావడంతో మామూలుగానే రోడ్లు కిక్కిరిసి ఉంటాయి. దానికి తోడు ఈదురుగాలులు, వర్షం తోడవటంతో వాహనదారుల కష్టాలు రెట్టింపయ్యాయి. ముందుగా కాప్రా పరిధిలో మొదలైన వర్షం క్షణాల్లోనే నగరమంతటా విస్తరించింది. భారీ గాలులు, ఉరుములు, మెరుపులతో చాలా ప్రాంతాల్లో నగరవాసులను భయాందోళనలకు గురి చేసింది. బహదూర్పురాలో అత్యధికంగా 8 సెం.మీ. వర్షపాతం నమోదైంది. మాదాపూర్‌లో 5.7 సెం.మీ., షేక్‌పేట్‌లో 5.5 సెం.మీ, చార్మినార్‌లో 4.7 సెం.మీ, జూబ్లీహిల్స్ 4.4 సెం.మీ, అత్తాపూర్ 4.3 సెం.మీ, సిఫ్‌నగర్‌లో 4 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

రైతును రారాజు చేయడమే మోదీ లక్ష్యం

- రైతు, శాస్త్రవేత్త, ప్రభుత్వం కలిసి పనిచేస్తే వ్యవసాయంలో అగ్రస్థానం
- పీఎం కిసాన్‌తో 9.34 కోట్ల మంది రైతులకు రూ.18,690 కోట్లు జమ
- తెలంగాణలో 30 లక్షల మందికిపైగా రైతులకు లబ్ధి : కేంద్ర మంత్రి బండి సంజయ్

2

కృష్ణ-గోదావరి బేసిన్ వివాదంపై సుప్రీం

కీలక నిర్ణయం

- మధ్యవర్తిగా జస్టిస్ రంజనా ప్రకాశ్ నియామకం
- ప్రకటించిన సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం

11

ప్రభుత్వ హాస్పిటల్స్‌లో పీపీపీ మోడ్‌లో

ఎంఆర్ఐ సేవలు

- మహబూబ్‌నగర్ జీజీహెచ్‌లో పైలట్ ప్రాజెక్ట్
- ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో మంత్రి దామోదర్ రాజనర్సింహ సమీక్ష

11

లక్ష్మీభాస్కర్ పాత్రపై ఆరా

- 540 మంది ఉద్యోగుల నియామకాల్లో అక్రమాలు?
- టెండర్ వేయకుండా పాత సంస్థకే కట్టబెట్టినట్లు ఆరోపణలు
- నిమ్స్‌లో అక్రమాలపై కొనసాగుతున్న ఏసీబీ దర్యాప్తు

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 30:

నిమ్స్ ఆస్పత్రి అక్రమాలపై ఏసీబీ దర్యాప్తు కొనసాగుతోంది. గురువారం 15 గంటలపాటు ఏసీబీ, డ్రగ్ కంట్రోల్, ఫుడ్‌సేఫ్టీ అధికారుల సోదాలు నిర్వహించారు. కిందిస్థాయి ఉద్యోగుల నియామకంలో అక్రమాలు జరిగినట్లు వచ్చిన ఆరోపణలపై ఇవాళ ఏసీబీ ఆరా తీస్తోంది. నిమ్స్‌లో స్కిల్డ్, నాన్ స్కిల్డ్ కలిపి మొత్తం 540 మంది ఉద్యోగుల నియామకాల్లో అక్రమాలు జరిగినట్లు ఏసీబీకి సమాచారమందింది. ఒక్కొక్కరి నుంచి రూ.60 వేల నుంచి రూ.5 లక్షల వరకు వసూలు చేసినట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇన్వేషెంట్ల వద్ద వసూలు చేసుకునేందుకు సిబ్బందికి ఓకే చెప్పినట్లు సమాచారం. జీతంతో పాటు నెలకు రూ.30 వేలు సంపాదించుకోవచ్చని చెప్పినట్లు ఆరోపణలున్నాయి. సెక్యూరిటీ కాంట్రాక్ట్ టెండర్ వేయకుండా పాత సంస్థకే కట్టబెట్టినట్లు ఏసీబీ గుర్తించింది. నిమ్స్ అక్రమాల్లో లక్ష్మీభాస్కర్ కీలకపాత్ర పోషించినట్లు ఏసీబీ ఆధారాలు సేకరిస్తోంది.

ఆదాయానికి మించిన ఆస్తులు వ్యవహారం కేసులో నిమ్స్ మాజీ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీభాస్కర్‌ను ఏసీబీ ఇటీవల అరెస్టు చేసింది. అనంతరం ఈ వ్యవహారంపై మరింత లోతుగా విచారించిన అధికారులు, ఆయన బినామీలుగా అనుమానిస్తున్న వ్యక్తులు, సన్నిహితుల నివాసాల్లో తనిఖీలు నిర్వహించి పలు కీలక ఆధారాలను సేకరించారు. తాజాగా

- మిగతా 2 లో..

నగరాభివృద్ధికి రూ.84,790 కోట్లతో సమగ్ర కార్యాచరణ

- హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- మూసీ పునరుజ్జీవనం, ట్రిపుల్ ఆర్, ఫ్యూచర్ సిటీతో హైదరాబాద్‌కు కొత్త రూపు
- రియల్ ఎస్టేట్ రంగం రాష్ట్ర ప్రగతిలో భాగస్వామి కావాలి
- నారెడ్కో తెలంగాణ ప్రాపర్టీ షోలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

2

విద్యుత్ ఉద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షనర్లకు డీఏ, డీఆర్ పెంపు 2

నగరాభివృద్ధికి రూ.84,790 కోట్లతో సమగ్ర కార్యాచరణ

- హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- మూసీ పునరుజ్జీవనం, ట్రిపుల్ ఆర్, ఫ్యూచర్ సిటీతో హైదరాబాద్‌కు కొత్త రూపు
- రియల్ ఎస్టేట్ రంగం రాష్ట్ర ప్రగతిలో భాగస్వామి కావాలి
- నారెడ్కో తెలంగాణ ప్రాపర్టీ షోలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 30:

హైదరాబాద్ నగరాన్ని ప్రపంచంలోని అభివృద్ధి చెందిన నగరాలకు దీటుగా తీర్చిదిద్దడంతో పాటు, తెలంగాణను దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రంగా నిలబెట్టడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. నగరాభివృద్ధి, రాష్ట్ర ఆర్థిక ప్రగతిలో రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాల పాత్ర అత్యంత కీలకమని, ఈ రంగంలో ఉన్నవారిని కేవలం వ్యాపారవేత్తలుగా కాకుండా సంపద సృష్టికర్తలుగా ప్రభుత్వం గుర్తిస్తోందని అన్నారు. హైదరాబాద్ హైటెక్స్‌లో నిర్వహించిన నారెడ్కో తెలంగాణ ప్రాపర్టీ షో కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

హైదరాబాద్‌కు దేశంలోని ఇతర నగరాలతో పోలిస్తే అనేక అనుకూలతలు ఉన్నాయని, మోస్ట్ లివబుల్ సిటీగా గుర్తింపు పొందిన ఈ నగరంలో స్థిరపడేందుకు దేశంలోని వివిధ ప్రాంతాల ప్రజలు ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. గత ప్రభుత్వాలు కల్పించిన మౌలిక సదుపాయాలను మరింత విస్తరిస్తూ ప్రస్తుత ప్రభుత్వం నగరాభివృద్ధికి పెద్దపీట వేస్తోందన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు, అంతర్జాతీయ విమానాశ్రయం, బీహెచ్‌ఈఎల్, బీడీఎల్, ఈసీఐఎల్, డీఆర్‌డీఓ వంటి ప్రభుత్వ రంగ సంస్థలు, ఐఐటీ, ఐఐఐటీ, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వంటి విద్యాసంస్థలు నగర అభివృద్ధికి బలమైన పునాదులుగా నిలిచాయని పేర్కొన్నారు.

రూ.84,790 కోట్లతో నగరాభివృద్ధికి బృహత్తర ప్రణాళిక

హైదరాబాద్ నగరంతో పాటు పరిసర ప్రాంతాల సమగ్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం సుమారు రూ. 84,790 కోట్లతో భారీ కార్యాచరణను రూపొందించిందని ఉప ముఖ్యమంత్రి వెల్లడించారు. ఇందులో ఇప్పటికే సుమారు రూ.55 వేల కోట్ల పనులకు సంబంధించి డిజైన్లు, టెండర్ల ప్రక్రియ చేపట్టడంతో పాటు పలు పనులు పురోగతిలో ఉన్నాయని వివరించారు. రానున్న రోజుల్లో నగరంలోని ప్రతి ప్రాంతంలో అభివృద్ధి పనులు, నిర్మాణ కార్యక్రమాలు కనిపిస్తాయని చెప్పారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ, హైదరాబాద్ గ్రోత్ కారిడార్, మెట్రో రైలు తదితర మౌలిక సదుపాయాల కోసం రూ.52,706 కోట్లు, హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డుకు రూ.15, 849 కోట్లు కేటాయించి పనులు ముందుకు తీసుకెళ్తున్నట్లు తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ.4 వేల కోట్లు, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ. 2,500 కోట్లు, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ.2,163 కోట్లు, హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా రహదారుల అభివృద్ధికి రూ.500 కోట్లతో పనులు చేపడుతున్నట్లు వివరించారు.

మూసీ పునరుజ్జీవనంతో నగరానికి కొత్త ఆభరణం

మూసీ నదిని మురికి కూపం నుంచి స్వచ్ఛమైన జలాలతో ప్రవహించే నదిగా మార్చి హైదరాబాద్‌కు గొప్ప ఆస్తిగా తీర్చిదిద్దాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పమని భట్టి విక్రమార్క తెలిపారు. ప్రపంచంలోని అభివృద్ధి చెందిన నగరాలు తమ మధ్యలో ప్రవహించే నదులను శుద్ధి చేసి పర్యాటక, ఆర్థిక కేంద్రాలుగా అభివృద్ధి చేసుకున్నాయని గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో మూసీ పునరుజ్జీవన కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. మూసీ పునరుజ్జీవనంలో భాగంగా తొలి దశలో సుమారు రూ.7,500 కోట్ల పనులను ప్రారంభించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని చెప్పారు. మూసీలోకి మురుగునీరు చేరకుండా నగరంలోని 21 ప్రధాన నాలాల వద్ద ఒకేసారి మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణానికి అనుమతులు ఇచ్చి, టెండర్ల ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. భవిష్యత్తులో ఎస్టీపీల సంఖ్యను 38కు పెంచే ఆలోచన ఉందన్నారు. శుద్ధి చేసిన నీటిని పారిశ్రామిక అవసరాలు, ఉద్యానవనాల నిర్వహణకు వినియోగించేలా ప్రణాళిక రూపొందిస్తున్నామని వెల్లడించారు. మూసీ నది భవిష్యత్తులో హైదరాబాద్‌కు అతిపెద్ద ఆభరణంగా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు.

భారత్ ఫ్యూచర్ సిటీతో అభివృద్ధికి నూతన దిశ

సుమారు 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మించేందుకు ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసిందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ఇందులో 15 వేల ఎకరాలను పచ్చదనం, విశాలమైన బహిరంగ ప్రదేశాల కోసం కేటాయించడం విశేషమన్నారు. మొత్తం భూభాగంలో 50 శాతం గ్రీన్ స్పేస్‌గా ఉంచుతూ నగర నిర్మాణం చేపట్టడం దేశంలోనే ప్రత్యేకతగా నిలుస్తుందని చెప్పారు. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌లకు తోడుగా భారత్ ఫ్యూచర్ సిటీ మరో కీలక అభివృద్ధి కేంద్రంగా రూపుదిద్దుకోనుందని పేర్కొన్నారు. ట్రిపుల్ ఆర్, మూసీ పునరుజ్జీవనం, ఫ్యూచర్ సిటీ వంటి ప్రాజెక్టులు హైదరాబాద్ భవిష్యత్తును మార్చనున్నాయని తెలిపారు. నగరాభివృద్ధికి అవసరమైన నీటి వనరుల విషయంలోనూ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, కృష్ణా, గోదావరి జలాలను నగరానికి తీసుకువచ్చే ప్రణాళికలు హైదరాబాద్ విస్తరణకు దోహదపడ్డాయని గుర్తుచేశారు.

కాలుష్య నియంత్రణకు హిల్ట్ పాలసీ

హైదరాబాద్‌ను స్వచ్ఛమైన, పర్యావరణహిత నగరంగా తీర్చిదిద్దేందుకు హిల్ట్ పాలసీని తీసుకొచ్చినట్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని పరిశ్రమలను దశలవారీగా బయటకు తరలించడం ద్వారా నగరంలో కాలుష్యాన్ని తగ్గించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ప్రజా రవాణాలో డీజిల్ బస్సుల స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టడంతో పాటు, ఆటోలను కూడా ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చేందుకు సబ్సిడీతో కూడిన సహకారం అందిస్తున్నట్లు చెప్పారు. పర్యావరణ పరిరక్షణ, ఆధునిక రవాణా వ్యవస్థల సమన్వయంతో హైదరాబాద్‌ను మరింత నివాసయోగ్యమైన నగరంగా అభివృద్ధి చేస్తామన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా రోడ్ల అభివృద్ధికి రూ.93 వేల కోట్లు

హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో రవాణా సదుపాయాలను మెరుగుపరిచేందుకు సుమారు రూ.93 వేల కోట్లతో రహదారుల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించినట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. నాలుగు వరుసల రహదారులు, ఫ్లైఓవర్లు, ఇతర మౌలిక సదుపాయాల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. నగరాభివృద్ధితో పాటు గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య అనుసంధానాన్ని బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు.

సంక్షేమం, అభివృద్ధి రెండింటికీ సమ ప్రాధాన్యం

రాష్ట్ర ప్రభుత్వం ఒకవైపు భారీ మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు వెచ్చిస్తూనే మరోవైపు ప్రజా సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని భట్టి విక్రమార్క వివరించారు. రాష్ట్రంలో 8 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నామని తెలిపారు. 1.06 కోట్ల కుటుంబాలకు సన్నబియ్యం పంపిణీ, అర్హులైన కుటుంబాలకు రూ.10 లక్షల వరకు రాజీవ్ ఆరోగ్యశ్రీ వైద్య సేవలు, 53 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 41 లక్షల కుటుంబాలకు చేయూత పథకం ద్వారా ప్రయోజనాలు అందిస్తున్నామని చెప్పారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 27 లక్షల మంది విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్నామని, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణాలను చేపడుతున్నామని తెలిపారు. వ్యవసాయ రంగానికి ప్రోత్సాహం అందించేందుకు రైతు భరోసా కింద రైతుల ఖాతాల్లోకి నేరుగా నిధులు బదిలీ చేస్తున్నామని పేర్కొన్నారు. సంక్షేమ పథకాల ద్వారా ప్రజల కొనుగోలు శక్తి పెరిగి, అది తిరిగి వ్యాపార, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి దోహదపడుతుందని వివరించారు.

విద్యుత్ ఉద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షనర్లకు డీఏ, డీఆర్ పెంపు

- విద్యుత్తు సంస్థల సీఎండీలను ఆదేశించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- 19.272 నుంచి 21.815 శాతానికి పెంపు.. జూలై 1 నుంచి వర్తింపు
- 71,360 మందికి ప్రయోజనం.. నెలకు రూ.14.63 కోట్ల అదనపు భారం

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 30 :

రాష్ట్ర విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షనర్లకు ప్రభుత్వం శుభవార్త అందించింది. వారికి చెల్లించే కరువు భత్యం (డీఏ), కరువు ఉపశమనం (డీఆర్) పెంపునకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విద్యుత్ సంస్థల సీఎండీలను ఆదేశించారు. ప్రస్తుతం 19.272 శాతంగా ఉన్న డీఏ, డీఆర్‌ను 2.543 శాతం పాయింట్లు పెంచి 21.815 శాతానికి సవరించనున్నారు. ఈ పెంపు 2026 జూలై 1వ తేదీ నుంచి వర్తించనుంది. కార్మిక శాఖ పరిధిలోని లేబర్ బ్యూరో ప్రకటించే అఖిల భారత ధరల సూచీ ఆధారంగా డీఏ, డీఆర్‌ను సవరిస్తారు. ధరల సూచీలో వచ్చే మార్పులకు అనుగుణంగా ప్రతి ఆరు నెలలకు ఒకసారి జనవరి, జూలై నెలల్లో ఈ సవరణ చేపడుతున్నారు. తాజాగా చేపట్టిన ప్రతిపాదిత పెంపునకు ఆమోదం లభించి అమల్లోకి వస్తే రాష్ట్రంలోని నాలుగు విద్యుత్ సంస్థల పరిధిలో 71,360 మంది ఉద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షనర్లకు ప్రయోజనం చేకూరనుంది. ఇందుకోసం విద్యుత్ సంస్థలపై నెలకు సుమారు రూ.14.63 కోట్ల అదనపు ఆర్థిక భారం పడనుంది.

సంస్థల వారీగా లబ్ధిదారులు ఇలా..

టీజీ ట్రాన్స్‌కో పరిధిలో 3,081 మంది ఉద్యోగులు, 3,644 మంది ఆర్టిజన్లు, 2,469 మంది పెన్షనర్లు కలిపి మొత్తం 9,194 మందికి ప్రయోజనం కలగనుంది. టీజీ జెన్‌కోలో 7,197 మంది ఉద్యోగులు, 3,544 మంది ఆర్టిజన్లు, 3,426 మంది పెన్షనర్లు కలిపి 14,167 మంది లబ్ధి పొందనున్నారు. టీజీ ఎస్పీడీసీఎల్‌లో 11,719 మంది ఉద్యోగులు, 8,493 మంది ఆర్టిజన్లు, 8,269 మంది పెన్షనర్లు కలిపి 28,481 మందికి, టీజీ ఎన్పీడీసీఎల్‌లో 9,936 మంది ఉద్యోగులు, 3,435 మంది ఆర్టిజన్లు, 6,147 మంది పెన్షనర్లు కలిపి 19,518 మందికి ప్రయోజనం చేకూరనుంది. ఉద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షనర్ల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని, విద్యుత్ సంస్థల సిబ్బంది ప్రయోజనాలను పరిరక్షించడంలో భాగంగానే ఈ డీఏ, డీఆర్ పెంచాలని ఆదేశాలు ఇచ్చినట్టు డిప్యూటీ సీఎం తెలిపారు.

ఇంటింటికీ లెక్క..

(మొదటిపేజీ తరువాయి)

లెక్కలతోపాటు వివిధ సామాజిక వర్గాల జనాభా వివరాలు కూడా అందుబాటులోకి రానున్నాయి. ప్రభుత్వ సంక్షేమ పథకాల రూపకల్పన, సామాజిక అభివృద్ధి కార్యక్రమాల ప్రణాళికకు ఈ గణాంకాలు ఉపయోగపడనున్నాయి.

రూ.11,718 కోట్ల వ్యయం.. 30 లక్షల మంది సిబ్బంది

దేశవ్యాప్తంగా చేపట్టనున్న ఈ భారీ కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వం రూ.11,718.24 కోట్ల నిధులను కేటాయించింది. సుమారు 30 లక్షల మంది గణకులు, పర్యవేక్షకులు, ఇతర సిబ్బంది ఈ ప్రక్రియలో పాల్గొననున్నారు. 36 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని పట్టణాలు, గ్రామాల్లో జనగణన నిర్వహించనున్నారు. 2011 తర్వాత జరుగుతున్న ఈ జనగణన దేశ జనాభా స్వరూపం, సామాజిక, ఆర్థిక పరిస్థితులపై తాజా గణాంకాలను అందించనుంది.

ఉత్తరాఖండ్‌లో కూలిన హెలికాప్టర్

(మొదటిపేజీ తరువాయి)

ఆగిపోయింది. జేపీ పవర్ హౌస్ సమీపంలో ఉన్న ఒక కొండను బలంగా ఢీకొట్టి ఉండవచ్చునని అధికారులు భావిస్తున్నారు. ప్రమాదానికి గురైన హెలికాప్టర్ బద్రీనాథ్ ఆలయ దర్శనం ముగించుకుని తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగిందా? అనేది ఇంకా నిర్ధరణ కావాల్సి ఉందన్నారు. హెలికాప్టర్‌తో సంబంధాలు తెగిపోయిన తరువాత, ఘటన జరిగిన ప్రాంతంలో పొగలు పైకి లెచినట్లు అధికారులు గుర్తించారు.

అంతకుముందు, హెలికాప్టర్ ప్రమాదం గురించి సమాచారం అందుకున్న స్థానిక యంత్రాంగం వెంటనే రెస్క్యూ ఆపరేషన్ చేపట్టింది. స్థానిక పోలీసులు, ఎస్డీఆర్ఎఫ్, ఆర్మీ, ఐటీబీపీ సిబ్బందిని ఘటనా స్థలానికి పంపినట్లు అధికారులు పేర్కొన్నారు. హెలికాప్టర్ను రంగంలోకి దించి గాలింపు చర్యలు చేపట్టింది. విస్తృత గాలింపు అనంతరం, ఒక కొండపైన హెలికాప్టర్ శకలాలు లభ్యమయ్యాయి. మరోవైపు, ప్రమాదానికి గురైన హెలికాప్టర్ 'ట్రాన్స్ భారత్ ఏవియేషన్' అనే ప్రైవేట్ సంస్థకు చెందినదిగా జిల్లా యంత్రాంగం గుర్తించింది. ఘటన అనంతరం ముందస్తు జాగ్రత్తగా ట్రాన్స్ భారత్ ఏవియేషన్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన అన్ని హెలికాప్టర్లను అధికారులు నిలిపివేశారు.

రైతును రారాజు చేయడమే మోదీ లక్ష్యం

- రైతు, శాస్త్రవేత్త, ప్రభుత్వం కలిసి పనిచేస్తే వ్యవసాయంలో అగ్రస్థానం
- పీఎం కిసాన్‌తో 9.34 కోట్ల మంది రైతులకు రూ.18,690 కోట్లు జమ
- తెలంగాణలో 30 లక్షల మందికిపైగా రైతులకు లబ్ధి : కేంద్ర మంత్రి బండి సంజయ్

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 30:

దేశానికి జై జవాన్, జై కిసాన్ రెండు కళ్లు అని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. రైతును రారాజుగా చేయడమే ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యమని పేర్కొన్నారు. శుక్రవారం హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ పరిశోధన కేంద్రంలో నిర్వహించిన పీఎం కిసాన్ సమ్మాన్ నిధి విడుదల కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. రైతుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. 2014తో పోలిస్తే వ్యవసాయ బడ్జెట్‌ను ఐదు రెట్లు పెంచినట్లు బండి సంజయ్ తెలిపారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా ఇప్పటివరకు 23 విడతల్లో రూ.4.47 లక్షల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు. తాజాగా దేశవ్యాప్తంగా 9.34 కోట్ల మంది రైతుల ఖాతాల్లో మరో రూ.18,690 కోట్లు జమ చేస్తున్నామని వెల్లడించారు. తెలంగాణలో 30 లక్షల మందికిపైగా రైతులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారని తెలిపారు.

ఎరువుల సబ్సిడీతో భారీగా ఆదా

రైతుల అభివృద్ధి కోసం కేంద్రం ఎరువుల సబ్సిడీకి రూ.12 లక్షల కోట్లు ఖర్చు చేస్తోందని బండి సంజయ్ చెప్పారు. కేంద్రం అందిస్తున్న సబ్సిడీ కారణంగా రైతులకు ఎకరాకు సుమారు రూ.18 వేల వరకు ఆదా అవుతోందన్నారు. తెలంగాణలో దాదాపు 40 లక్షల మందికి కిసాన్ క్రెడిట్ కార్డులు అందించామని, రూ.50 వేల కోట్ల మేర రుణాలు అందించినట్లు తెలిపారు. రాష్ట్రంలో 1.10 కోట్ల సాయిల్ హెల్త్ కార్డులు పంపిణీ చేశామని పేర్కొన్నారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా అందుతున్న సొమ్మును 92 శాతం మంది రైతులు వ్యవసాయ అవసరాలకే వినియోగిస్తున్నారని, దీని వల్ల 85 శాతం మంది రైతుల ఆదాయం పెరిగిందని బండి సంజయ్ తెలిపారు. రైతు ఏడాది సంపాదన ఒక ఐటీ ఉద్యోగి నెల జీతం కంటే తక్కువగా ఉంటోందని, రైతుల ఆదాయం పెంచేందుకు మరింత కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.

వరి ఎగుమతుల్లో భారత్ అగ్రస్థానం

కాంగ్రెస్ పాలనలో దేశంలో తిండి గింజలకు కొరత ఏర్పడి ఇతర దేశాల నుంచి బియ్యం దిగుమతి చేసుకునే పరిస్థితి ఉండేదని బండి సంజయ్ విమర్శించారు. ప్రధాని మోదీ నిరంతర కృషి, వ్యవసాయ శాస్త్రవేత్తల పరిశోధనల ఫలితంగా ప్రస్తుతం వరి ఎగుమతుల్లో భారత్ ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలిచిందన్నారు. రైతులకు మోదీ తల్లిలాంటి వారైతే.. ఐకార్, ఐఐఆర్ఆర్ వంటి సంస్థల వ్యవసాయ శాస్త్రవేత్తలు తండ్రి వంటి వారని వ్యాఖ్యానించారు. హైదరాబాద్ అంటే కేవలం ఐటీ మాత్రమే కాదని, ఐకార్-ఐఐఆర్ఆర్ వంటి వ్యవసాయ పరిశోధనా సంస్థలతో కూడా నగరానికి ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. శాస్త్రవేత్తలు కొత్త వంగడాలను అభివృద్ధి చేసి రైతులకు అండగా నిలవాలని కోరారు.

11 లక్షల ఎకరాల్లో సాగు నిలిచింది

ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా కరువు పరిస్థితులు ఏర్పడ్డాయని బండి సంజయ్ అన్నారు. తెలంగాణలో సుమారు 11 లక్షల ఎకరాల్లో పంటలు సాగు కాలేదని, ఈ సీజన్‌లో దాదాపు రూ.20 వేల కోట్ల మేర పంట నష్టం జరిగినట్లు అంచనా ఉందన్నారు. రాష్ట్రంలో మరిన్ని మండలాలను కరువు జాబితాలో చేర్చాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

వికసిత్ భారత్-2047 లక్ష్యాన్ని చేరుకోవాలంటే రైతులను అభివృద్ధి ప్రక్రియలో భాగస్వాములను చేయాలన్నదే మోదీ సంకల్పమని చెప్పారు. రైతు ముఖంలో కనిపించే చిరునవ్వే శాస్త్రవేత్త విజయానికి నిజమైన గుర్తింపు అన్నారు.

రైతు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, ప్రభుత్వం సమన్వయంతో పనిచేస్తేనే భారత వ్యవసాయాన్ని ప్రపంచంలోనే అగ్రస్థానానికి తీసుకెళ్లగలమని బండి సంజయ్ పేర్కొన్నారు. అందరూ కలిసికట్టుగా పనిచేసి రైతును రారాజుగా చేద్దామని పిలుపునిచ్చారు.

లక్ష్మీభాస్కర్ పాత్రపై ఆరా...

(మొదటిపేజీ తరువాయి)

నిమ్స్‌లో వివిధ విభాగాలకు సంబంధించిన రికార్డులను పరిశీలిస్తున్నారు. గతంలో జరిగిన టెండర్లు, కాంట్రాక్టుల నిర్వహణపై అధికారులు దృష్టి సారించినట్లు తెలుస్తోంది. పలు విభాగాలకు సంబంధించిన టెండర్ల ఆహ్వానం నుంచి కాంట్రాక్టుల కేటాయింపుల వరకు నిబంధనల అమలు, బిడ్‌ల పరిశీలన, ఆయా సంస్థల సాంకేతిక, ఆర్థిక అర్హతలకు సంబంధించిన పత్రాలను అవినీతి నిరోధక శాఖ స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఈ వ్యవహారాల్లో డాక్టర్ లక్ష్మీ భాస్కర్‌తో పాటు గతంలో కీలక బాధ్యతలు నిర్వహించిన ఇతర అధికారుల పాత్ర పైనా ఆరా తీస్తున్నారు. మరోవైపు మందుల కొనుగోళ్లు, సరఫరా, నాణ్యతా ప్రమాణాలపైనా ఏసీబీ దృష్టి సారించినట్లు తెలుస్తోంది. నిమ్స్‌కు వివిధ మెడికల్ కంపెనీల నుంచి రేట్ కాంట్రాక్టుల ప్రకారం డీలర్లు మందులు సరఫరా చేస్తుంటారు.

మందుల నాణ్యతపై అనుమానాలు

గతంలో కొనుగోలు చేసిన కొన్ని మందుల నాణ్యతపై పలు అనుమానాలు రావడంతో నెల రోజుల క్రితం కొన్ని ఔషధాల శాంపిల్స్ సేకరించి ల్యాబ్కు పంపినట్లు సమాచారం. మందుల సరఫరాలో కమీషన్లు తీసుకుని నాణ్యత ప్రమాణాలు లేని ఔషధాలను సరఫరా చేశారా ? లేక కొనుగోళ్ల ప్రక్రియలో నిబంధనలు ఉల్లంఘించారా? అన్న కోణాల్లోనూ అధికారులు పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

టెండర్లు, కాంట్రాక్టులు, మందుల కొనుగోళ్లకు సంబంధించిన రికార్డులు, ఇతర ఆధారాలను విశ్లేషించిన తర్వాతే ఈ వ్యవహారంలో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. తక్కువ ఖర్చుతో కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తూ ఎంతో మంది పేదలకు అండగా నిలుస్తున్న నిమ్స్‌లో అవినీతి ఆరోపణలు రావడంపై పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆసుపత్రిలో అంతర్గత విభేదాలు, వైద్యుల మధ్య రాజకీయాలు, సంస్థ ప్రతిష్ఠపై ప్రభావం చూపుతాయన్న ఆందోళనలూ వ్యక్తమవుతున్నాయి. ఏసీబీ దర్యాప్తులో ఎలాంటి అంశాలు వెలుగులోకి వస్తాయన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

బియ్యం ధరల దోపిడీపై ఉక్కుపాదం

- అక్రమ నిల్వలు, బ్లాక్‌మార్కెటింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు
- బీపీటీ బియ్యం కిలో రూ.66కు మించకుండా నియంత్రణ చర్యలు
- ఐదు శాఖల సమన్వయంతో ముమ్మర దాడులు.. ఇప్పటికే 12 కేసులు
- ధరలు స్థిరపడే వరకు రాష్ట్రవ్యాప్తంగా కొనసాగనున్న తనిఖీలు
- సరిపడా బియ్యం నిల్వలు ఉన్నాయి.. ప్రజలు ఆందోళన చెందొద్దు
- మిల్లర్లు, వ్యాపారులకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర హెచ్చరిక

హైదరాబాద్, వెలుతురు అక్టోబరు 30:

బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేసినా, బ్లాక్‌మార్కెట్‌కు తరలించినా, అధిక ధరలకు విక్రయించి ప్రజలపై భారం మోపినా కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు.

వినియోగదారుల అవసరాలను ఆసరాగా చేసుకుని అడ్డగోలుగా లాభాలు సంపాదించాలనుకునే వారిని ప్రభుత్వం ఉపేక్షించబోదని స్పష్టం చేశారు. పెరుగుతున్న బియ్యం ధరలను అదుపులోకి తీసుకొచ్చి ప్రజలకు ఉపశమనం కల్పించేందుకు రాష్ట్రవ్యాప్తంగా తనిఖీలను ముమ్మరం చేసినట్లు తెలిపారు. బియ్యం ధరల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి బేగంపేట కుందన్ బాగ్ లోని తన క్యాంపు కార్యాలయంలో పౌర సరఫరాల శాఖాధికారులతో శుక్రవారం సమీక్షించారు.

టోకు, చిల్లర వ్యాపారులు, రైస్‌మిల్లర్లతో పౌర సరఫరాల శాఖ అధికారులు జరిపిన చర్చల వివరాలను తెలుసుకున్నారు. అక్రమాల నిరోధానికి చేపట్టిన ప్రత్యేక చర్యలు, తనిఖీల పురోగతిని పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర మంత్రికి వివరించారు. శాఖ డైరెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్, ఇతర ఉన్నతాధికారులు చర్చల్లో పాల్గొన్నారు. సాధారణంగా ప్రజలు ఎక్కువగా వినియోగించే బీపీటీ బియ్యం ధర కిలో రూ.66కు మించకుండా నియంత్రణ చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు.

ఆర్ఎన్ఆర్ బియ్యం విషయంలో నాణ్యత, ఉత్పత్తి వ్యయాల్లో ఉన్న వ్యత్యాసాలను పరిగణనలోకి తీసుకుని ధరపై సమీక్షించనున్నట్లు పేర్కొన్నారు. "వినియోగదారులపై భారం మోపుతూ అధిక లాభాలు సంపాదించడాన్ని ప్రభుత్వం సహించదు. మార్కెట్‌లో ధరలు స్థిరపడే వరకు తనిఖీలు, అక్రమాల నిరోధక చర్యలు కొనసాగుతాయి" అని ఉత్తమ్ స్పష్టం చేశారు.

అక్రమ నిల్వలు, అధిక ధరలకు విక్రయాలు తదితర అవకతవకల ఆరోపణలపై ఇప్పటికే బియ్యం వ్యాపారులపై 12 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఐదు శాఖల సమన్వయంతో దాడులు నిర్వహిస్తున్నామని చెప్పారు. పౌర సరఫరాలు, పోలీసు, జీఎస్టీ, తూనికలు-కొలతల శాఖలతోపాటు సంబంధిత ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాలు ఈ చర్యల్లో పాల్గొంటున్నాయని వివరించారు.

హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో టోకు, చిల్లర బియ్యం మార్కెట్లపై ప్రత్యేక దృష్టి సారించినట్లు మంత్రి తెలిపారు.

బేగంబజార్, నాంపల్లి, మహరాజ్‌గంజ్ సహా ప్రధాన టోకు వ్యాపార కేంద్రాల్లో విస్తృత తనిఖీలు చేపట్టినట్లు పేర్కొన్నారు. అక్రమాలను గుర్తించడం, అధిక ధరలను అరికట్టడం, వినియోగదారులకు ఊరట కల్పించడం లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా ఈ చర్యలు కొనసాగుతాయని చెప్పారు.

రాష్ట్రంలో ప్రజల అవసరాలకు సరిపడా బియ్యం నిల్వలు ఉన్నాయని మంత్రి భరోసా ఇచ్చారు. కొరత వస్తుందనే ఆందోళనతో అవసరానికి మించి బియ్యం కొనుగోలు చేసి నిల్వ చేసుకోవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

రేషన్ దుకాణాల ద్వారా ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న సన్నబియ్యాన్ని లబ్ధిదారులు వినియోగించుకోవాలని కోరారు. తెలంగాణ రైతులు పండించిన ధాన్యాన్ని రాష్ట్రంలోని మిల్లుల్లోనే బియ్యంగా మార్చి ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అందిస్తున్నామని వివరించారు.

నిబంధనలకు అనుగుణంగా వ్యాపారం చేసే వ్యాపారులు, మిల్లర్లతో ప్రభుత్వం చర్చలు కొనసాగిస్తుందని ఉత్తమ్ తెలిపారు. అదే సమయంలో అక్రమ వ్యాపార పద్ధతులతో ప్రజలపై భారం మోపే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు.

మేడిగడ్డ నీళ్లు ఎత్తండి.. రైతులను ఆదుకోండి

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 30 : మేడిగడ్డ వద్ద నీరు అందుబాటులో ఉన్నా రైతులకు సాగునీరు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, డాక్టర్ కె. సంజయ్ ఆరోపించారు. ఇది ప్రకృతి తెచ్చిన కరవు కాదని.. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల వచ్చిన కరవని విమర్శించారు. తెలంగాణ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో వారు ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కేటీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మేడిగడ్డను సందర్శించిన విషయాన్ని గుర్తుచేస్తూ.. అక్కడ లభ్యమవుతున్న నీటిని ఎత్తిపోసి రైతులకు అందించాలని కౌశిక్‌రెడ్డి డిమాండ్ చేశారు. నీటిని వినియోగించకుండా గోదావరిలోకి వదిలేస్తున్నారని ఆరోపించారు. ఎండిపోయిన ప్రతి ఎకరాకు రూ.50 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని కోరారు. రైతుల సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం ఇతర కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తోందని విమర్శించారు. నీళ్లు లేని రాష్ట్రంలో గ్లోబల్ సమ్మిట్ ఎందుకని డాక్టర్ కె. సంజయ్ ప్రశ్నించారు. ప్రజలకు తాగునీరు, రైతులకు సాగునీరు అందించలేని ప్రభుత్వం పెట్టుబడుల సదస్సులు నిర్వహించడం వల్ల ప్రయోజనం ఏమిటన్నారు. గ్లోబల్ సమ్మిట్‌కు బదులు 'నీళ్ల సమ్మిట్' నిర్వహించి నీటి సమస్యకు పరిష్కారం చూపాలని సూచించారు. రాష్ట్రం నుంచి పరిశ్రమలు ఇతర రాష్ట్రాలకు తరలిపోతున్నాయని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో విద్యుత్, సాగునీరు, పరిశ్రమల రంగాలకు ప్రాధాన్యత లభించిందని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ చిరుమళ్ల రాకేష్‌కుమార్ పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- కేంద్రీకృత కొనుగోళ్ల విధానాన్ని ప్రక్షాళన చేయాలి
- వేలిముద్రల ఆధారిత హాజరుకు అవసరమైన పరికరాలు, సాంకేతిక సిబ్బందిని ప్రభుత్వం కల్పించాలి

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 30 : తెలంగాణ రాష్ట్రంలోని సంక్షేమ వసతి గృహాలు, గురుకులాల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు, వాటి నిర్వహణలో సంక్షేమ అధికారులు ఎదుర్కొంటున్న ఆచరణాత్మక ఇబ్బందులను తక్షణమే పరిష్కరించాలని భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సంబంధిత గురుకులాల కార్యదర్శులు, సంక్షేమ శాఖల కమిషనర్లకు వినతిపత్రాలు సమర్పించింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు శెనుగరపు రజినీకాంత్ మాట్లాడుతూ.. కేంద్రీకృత కొనుగోళ్ల విధానం ద్వారా హాస్టళ్లకు సరఫరా చేస్తున్న నిత్యావసర సరుకులు నాణ్యత లేకుండా ఉంటున్నాయని, అవసరాల మేరకు వస్తువులు అందడం లేదని అన్నారు. చింతపండు, ఉల్లిపాయలు, వెల్లుల్లి, అల్లం వంటి వంట సామగ్రి అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. సరఫరా కాని అత్యవసర వస్తువులను స్థానికంగా కొనుగోలు చేసుకునేందుకు హాస్టల్ అధికారులకు అనుమతి ఇవ్వాలని కోరారు. కూరగాయలు, పండ్లు, చికెన్ తదితర వస్తువులను నేరుగా వసతి గృహాలకే సరఫరా చేసే విధానం తీసుకురావాలని, అర్ధరాత్రి వేళల్లో కాకుండా నిర్ణీత పని వేళల్లోనే సరుకులు అందించాలని డిమాండ్ చేశారు. కేంద్రీకృత వంటశాలల విధానంలో పాఠశాలలకు సెలవులు వచ్చినప్పుడు, అనారోగ్యంతో హాస్టళ్లలో ఉండే విద్యార్థులకు, పండుగలు, ఇతర సెలవు దినాల్లో భోజనం ఎలా అందిస్తారనే అంశంపై ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలని అన్నారు. రాత్రి భోజనానికి కేటాయిస్తున్న మొత్తాన్ని ప్రస్తుత మార్కెట్ ధరలకు అనుగుణంగా పెంచాలని, ఆహార పదార్థాల పరిమాణం, ధరలు, మెనూతో కూడిన అధికారిక ధరల పట్టికను విడుదల చేయాలని కోరారు. అదేవిధంగా, ముఖ గుర్తింపు ఆధారిత హాజరు విధానం అమలుకు ప్రతి హాస్టల్‌కు అవసరమైన స్మార్ట్‌ఫోన్లు లేదా చేతిలో పట్టుకునే కంప్యూటర్లు, అంతర్జాల సదుపాయాలు కల్పించాలని అన్నారు. సాంకేతిక పరిజ్ఞానంపై పూర్తిస్థాయి ప్రాయోగిక శిక్షణ ఇవ్వకుండా సిబ్బందిపై అదనపు పని భారం మోపడం సరికాదని పేర్కొన్నారు. ప్రతి హాస్టల్‌కు ఒక సాంకేతిక సహాయకుడిని నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు. హాస్టల్ సంక్షేమ అధికారుల సమస్యలు, విద్యార్థుల అవసరాలను పరిగణనలోకి తీసుకొని ప్రభుత్వం తక్షణమే పరిష్కార చర్యలు చేపట్టాలని రజినీకాంత్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామెర కిరణ్, సహాయ కార్యదర్శి మమత తదితరులు పాల్గొన్నారు.

వ్యభిచార గృహంపై టాస్క్‌ఫోర్స్ దాడి

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 30 : గోల్కొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో నిర్వహిస్తున్న వ్యభిచార గృహంపై కమిషనర్ టాస్క్‌ఫోర్స్ (గోల్కొండ జోన్) బృందం, స్థానిక పోలీసులతో కలిసి దాడి చేసింది. ఈ ఘటనలో ప్రధాన నిర్వాహకురాలు ఫర్హా బేగం (32), సహ నిర్వాహకురాలు ఫర్హీన్ (25), విటుడు ఫయాజ్ ఆలం (32)ను అరెస్టు చేయగా, అక్కడ ఉన్న ఓ బాధితురాలిని సురక్షితంగా రక్షించారు. పోలీసుల వివరాల ప్రకారం.. మహిళలకు అధిక మొత్తంలో డబ్బులు ఇస్తామంటూ ఆశ చూపి తీసుకొచ్చిన నిర్వాహకురాళ్లు గోల్కొండ ప్రాంతంలో వారికి వసతి కల్పించి, విటులను ఏర్పాటు చేస్తూ వ్యభిచారం నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో విటుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు గుర్తించారు. విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి నాలుగు సెల్‌ఫోన్లు, ఉపయోగించిన, ఉపయోగించని కండోమ్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై గోల్కొండ పోలీస్‌స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 406/2026తో బీఎన్ఎస్ 143(2), 144(2), పిటా చట్టంలోని 3, 4, 5 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎం. మహేశ్ పర్యవేక్షణలో ఈ దాడి నిర్వహించారు.

నాచారంలో శ్రీనివాస కల్యాణం

హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 30 : నాచారంలో శ్రీనివాస ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 31న శ్రీనివాస కల్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహిం చనున్నట్లు ట్రస్ట్ చైర్మన్ నందికొండ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ ఆధ్యాత్మిక వేడుకకు సుమారు 15 వేల మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. మహో త్సవాన్ని విజయ వంతంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేపడుతున్నట్లు వెల్లడించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని నందికొండ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తుల రాకపోకలకు ఇబ్బందులు తలెత్త కుండా చర్యలు తీసుకుంటున్నా మని, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తు న్నామని చెప్పారు. కల్యాణ మహోత్సవం అనంతరం భక్తులందరికీ మహా అన్నప్రసాద వితరణ చేపట్టను న్నట్లు వెల్లడిం చారు. శ్రీనివాస కల్యాణ మహోత్స వాన్ని పురస్కరిం చుకుని మూడు రోజులపాటు సాయంత్రం వేళల్లో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమా లను నిర్వహించను న్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించాలని కోరారు. భక్తులం దరూ సంప్రదాయ దుస్తులు ధరించి వేడుకలకు హాజరై ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ఏర్పాట్లపై ట్రస్ట్ ప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.

గుట్టలబేగంపేటలో ప్రభుత్వ భూమిని కాపాడిన హైడ్రా

రెవెన్యూ అధికారుల వినతి మేరకు హైడ్రా చర్యలు

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 30: రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం, గుట్టలబేగంపేట విలేజ్ సర్వే నంబరు 63లో ప్రభుత్వ భూమిని హైడ్రా కాపాడింది. ఈ సర్వే నంబరులో మొత్తం 78 ఎకరాలుండగా.. ఇందులో కొంత భూమి ఇప్పటికే కబ్జాలై.. నివాసాలు వచ్చాయి. ఈ భూమి తమ పూర్వీకులదని కొంతమంది అమ్ముకుంటూ వస్తున్నారు. అలాగే మరి కొంతమంది ప్రహరీలు నిర్మించుకుని భూమిని కాపాడుతున్నారు. ఈ వివాదం హైకోర్టుకు వెళ్లింది. హైకోర్టు స్టే ఇచ్చింది. ఈ స్టేటస్ కో ఉత్తర్వులను పట్టించుకోకుండా.. అక్కడ ప్లాట్ల అమ్మకాలు కొత్తగా నిర్మాణాలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో రెవెన్యూ అధికారులు హైడ్రాను ఆశ్రయించారు. కోర్టు ఉత్తర్వుల ప్రకారం అక్కడ యథాస్థితి కొనసాగేలా చర్యలు తీసుకోవాలని హైడ్రాను రెవెన్యూ కోరింది. ఈ మేరకు శుక్రవారం గుట్టల బేగంపేటలోని సర్వే నంబరు 63లో హైడ్రా ఫెన్సింగ్ వేసింది. 500ల మీటర్లకు పైగా ఫెన్సింగ్ వేసి ఆక్రమణలకు ఆస్కారం లేకుండా చర్యలు తీసుకుంది. రెవెన్యూ అధికారుల సమక్షంలో హైడ్రా ఈ చర్యలు తీసుకుంది.

హమ్మయ్య వర్షం పడింది..!

సున్నం చెరువుకు చేరిన వర్షం నీరు



హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 30: హమ్మయ్య వర్షం పడింది. సున్నం చెరువుకు వర్షం నీరు వచ్చి చేరుతోంది. 10 నుంచి 15 అడుగుల మేర పూడికను మొత్తం తొలగించి.. దుర్గంధాన్ని పారదోలి చెరువును హైడ్రా పునరుద్ధరించిన విషయం విధితమే. చుట్టూ పాత్‌వే, పిల్లల ప్లే ఏరియాలు, అన్ని వయసులవారు సేదదీరేలా గజబోలు నిర్మించి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దింది హైడ్రా. వర్షాకాలం చెరువు నిండి జలకళ సంతరించుకుంటుందని అందరూ భావించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు లేక నీటి జాడ కరువైన సమయంలో శుక్రవారం కురిసిన వర్షం ఆ చెరువుకు నీరందించింది. వర్షం నీరు చెరువుకు చేరేలా ఇన్‌లెట్లు.. తీర్చిదిద్దడంతో ఆ పరిసరాల్లో కురిసిన వం- ్షం చెరువుకు చేరింది. ఇన్‌లెట్లలోంచి నీరు చెరువులోకి చేరుతుండడంతో అక్కడి స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. వర్షం పడుతున్నా.. బయటకు వచ్చి చెరువులోకి నీరు చేరుతున్న వైనాన్ని వీడియోలు తీశారు. ఆ వీడియోలను హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారికి, ఇతర అధికారులకు పంపించి ఆనందం వ్యక్తం చేశారు.

త్వరలో ముఖ్యమంత్రి శ్రీ రేవంత్‌రెడ్డి గారు ఈ చెరువును ప్రారంభించనున్న నేపథ్యంలో చెరువులోకి వర్షం నీరు రావడాన్ని శుభపరిణామంగా అక్కడి స్థానికులు భావించారు. 7 సెంటీమీటర్ల వర్షం కురువడంతో వర్షం నీరు ఇన్‌లెట్ల ద్వారా పెద్దమొత్తంలో చెరువులోకి చేరుతుండడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. సున్నం చెరువులో పూడిక తొలగడంతో భూగర్భంలోకి నీరు ఇంకే అవకాశం ఎక్కువ ఉంది. చెరువులో నీరుంటే భూగర్భ జలాలు కూడా పెరిగే అవకాశం ఉంది. ఇటీవల అక్రమ బోర్లను హైడ్రా తొలగించడంతో.. చెరువులో నీరు కొద్ది కాలం నిలిచే అవకాశం ఉందంటూ పలువురు స్థానికులు పేర్కొన్నారు.

చదువుకు.. చేస్తున్న ఉద్యోగానికి పొంతనేది?

- యువతలో నైపుణ్యాలను పెంపొందించే విద్య అవసరం
- భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా విద్యావిధానంలో మార్పులు రావాలి
- 10టీవీ నిర్వహించిన 'రేపటి రూపురేఖలు' కార్యక్రమంలో మధుయాష్కీ గౌడ్

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 30 : యువత చదువుకున్న విద్యకు, వారు చేస్తున్న ఉద్యోగాలకు పొంతన లేకుండా పోతోందని, సరైన ఉపాధి అవకాశాలు లభించక పలువురు యువకులు తాత్కాలిక పనులపై ఆధారపడాల్సి వస్తోందని అఖిల భారత వృత్తి నిపుణుల కాంగ్రెస్ అధ్యక్షుడు, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. యువతకు ఉద్యోగాలు కల్పించడంతోపాటు, పరిశ్రమలు, మారుతున్న కాలానికి అనుగుణంగా అవసరమైన నైపుణ్యాలను నేర్పించే విద్యావిధానం అవసరమని స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్‌లోని దసపల్లా హోటల్‌లో 10టీవీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'రేపటి రూపురేఖలు -- నైపుణ్యానికి, లక్ష్యానికి వారధి' అనే అంశంతో రూపొందించిన ప్రత్యేక పుస్తకావిష్కరణ కార్యక్రమానికి మధుయాష్కీ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కోదండరాం, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ ఘంటా చక్రపాణితో కలిసి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చైనా దేశం వందేళ్ల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని విద్యావిధానాన్ని రూపొందిస్తోందని, అక్కడి యువతకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతోపాటు ఉత్పత్తి రంగాలకు అవసరమైన నైపుణ్యాల్లో శిక్షణ ఇస్తోందని పేర్కొన్నారు. ఎలక్ట్రానిక్ పరికరాలు, సూక్ష్మ విద్యుత్ చిప్‌ల నుంచి దేవతామూర్తుల విగ్రహాల వరకు అనేక వస్తువులను మనం చైనా నుంచి దిగుమతి చేసుకుంటున్నామని గుర్తుచేశారు. దేశంలో విస్తారంగా ఉన్న యువ మానవ వనరులను సద్వినియోగం చేసుకోలేకపోవడం, వారికి తగిన నైపుణ్యాలు అందించకపోవడమే ఇందుకు కారణమని అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం యువతలో నైపుణ్యాలను పెంపొందించేందుకు, భవిష్యత్తు అవస రాలకు అనుగుణంగా విద్యావిధానంలో మార్పులు తీసుకొస్తోందని మధుయాష్కీ తెలిపారు. నైపుణ్య విశ్వవిద్యాలయం ఏర్పాటు, సమీకృత పాఠశాలలు, తెలంగాణ ప్రభుత్వ పాఠశాలల ఏర్పాటుతో విద్యారంగంలో కొత్త దిశగా అడుగులు వేస్తోందని వివరించారు. తాను పదేళ్లపాటు నిజామాబాద్ ఎంపీగా పనిచేసిన సమయంలో తెలంగాణ విశ్వవిద్యాలయం, వైద్య కళాశాల ఏర్పాటుకు కృషి చేసిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. దేశ జనాభా పెరుగుతున్న పుటికీ అందుకు అనుగుణంగా విద్యాసంస్థలు, ఉపాధి అవకాశాలు పెరగడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులకు కేవలం పట్టాలు అందించడం కాకుండా, వాటి ఆధారంగా ఉపాధి పొందేలా ఆచరణాత్మక విద్య, వృత్తి నైపుణ్యాలు అందించాల్సిన అవసరం ఉంద న్నారు. అనంతరం వివిధ విద్యాసంస్థల యాజమాన్యా లకు 10టీవీ రూపొందించిన ప్రత్యేక పుస్తక ప్రతులను అందజేశారు. కార్యక్రమంలో 10టీవీ ముఖ్య నిర్వహణ అధికారి సత్యప్రసాద్, వార్తా విభాగ సంపాదకుడు కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ఊటూరు, వేగురుపల్లి రోడ్డు సమస్యను త్వరలో పరిష్కరిస్తా

-ఎమ్మెల్యే కవ్వంపల్లి

కరీంనగర్,వెలుతురు అక్టోబర్ 30 : కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం ఊటూరు?వేగురుపల్లి రోడ్డు సమస్యను అధికారులతో మాట్లాడి త్వరలోనే పరిష్కరిస్తామని మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ హామీ ఇచ్చారు. శుక్రవారం మానకొండూర్ మండలంలోని ఊటూరు గ్రామాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు వీధుల్లో పర్యటించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులతో మాట్లాడి ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఆరా తీశారు. స్థానికులు ఊటూరు, వేగు రుపల్లి రహదారి సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి రోడ్డు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే ట్రాన్స్‌కోకు సంబంధించిన సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. మొర్రి శంకరయ్య కుటుంబానికి పరామర్శఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మొర్రి శంకరయ్య కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పరామర్శించారు. ఊటూరు గ్రామ పర్యటనలో భాగంగా శంకరయ్య నివాసానికి వెళ్లిన ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. శంకరయ్య మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ వెలిశెట్టి కళ్యాణి కిశోర్, ఉప సర్పంచ్ తిరుపతిరెడ్డి, వార్డు సభ్యులు చంద్రమౌళి, స్వామి, మార్కెట్ కమిటీ చైర్మన్ రేవెల్లి రాజలింగం, వైస్ చైర్మన్ రేమిడి శ్రీనివాస్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ రామిడి తిరుమల్ రెడ్డి, పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు బొంగోని సునిల్, నాయకులు పల్లెర్ల లక్ష్మారెడ్డి, గుడాల మహేందర్, రామగిరి లక్ష్మణ్, వంతడ్పుల అనిల్, జెన్నయ్య, శ్రీనాథ్, మత్తయ్య, వెంకట్, పాల్గొన్నారు.

సత్యసాయి జిల్లా కలెక్టర్ గ్రామీణ పర్యటన

కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

సి.కె. పల్లి, వెలుతురు అక్టోబర్ 30 : శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ శుక్రవారం రోజున సి.కె. పల్లి మండలం, అమిదాల కుంట, ఓబుళం పల్లి గ్రామ పంచాయతీ పరిధిలో విస్తృతంగా పర్యటిం చారు. ఈ పర్యటనలో భాగంగా గ్రామంలో జరుగు తున్న పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను మరియు ప్రజా సమస్యలను ప్రత్యక్షంగా పరిశీ లించారు. అమిదాల కుంట గ్రామంలో నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ గారు తనిఖీ చేశారు. లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి సకాలంలో పింఛన్ అందుతుందో లేదో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన ఇద్దరు వయోవృద్ధులకు స్వయంగా వృద్ధాప్య పింఛన్లను అందజేశారు. గ్రామంలో త్రాగునీటి ఎద్దడి సమస్యలు ఏమైనా ఉన్నాయా అని గ్రామస్థులను ఆరా తీశారు. శ్రీ సత్యసాయి త్రాగునీటి పథకం ద్వారా ఉచితంగా సరఫరా అవుతున్న నీరు గ్రామంలోని అన్ని గృహాలకు చేరుతోందా లేదా కొన్ని వీధులకే పరిమితమైందా అనే అంశంపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించి, తాగునీటి సరఫరా తీరుపై వివరాలు సేకరించారు. ఉద్యానవన శాఖ ద్వారా రైతులకు అందిస్తున్న పథకాలు, సహాయం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఉలవల విత్తనాల పంపిణీ ప్రక్రియ ఎంతవరకు వచ్చిందనే అంశంపై అధికారులతో సమీక్షించి, ప్రణాళికాబద్ధంగా విత్తనాలు అందించాలని ఆదేశించారు. ప్రస్తుత వ్యవసాయ సీజన్‌లో రైతులు సాగు చేస్తున్న వివిధ రకాల పంటల వివరాలను కలెక్టర్ రైతులతో మాట్లాడి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తాము ప్రస్తుతం వేరుశనగ పంటను ప్రధానంగా సాగు చేస్తున్నామని రైతులు కలెక్టర్ గారికి వివరించారు. ఈ పర్యటనలో జిల్లా, మండల స్థాయి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంలో

ప్రతిభ చాటిన కడప జిల్లా రైతులు

కడప, వెలుతురు అక్టోబర్ 30 : సహజ వ్యవసాయ పద్ధతుల్లో పంటలు సాగుచేస్తూ నాణ్యమైన దిగుబడులు సాధిస్తున్న వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన ఇద్దరు రైతులకు ప్రతిష్ఠాత్మక "కిసాన్ మహారాజ్" అవార్డులు – 2026 లభించాయి. బద్వేలు మండలం అబుసాహెబ్ పేటకు చెందిన గోగుల రాధాకృష్ణ, చెన్నూరు మండలం బాలసింగాయ పల్లికి చెందిన దండిబోయిన బాలాజీ ఈ పురస్కారాలకు ఎంపికయ్యారు. హైదరాబాద్‌లోని శిల్పకళావేదికలో విష్ టీవీ ఆధ్వర్యంలో నిర్వహించిన "కిసాన్ మహారాజ్" అవార్డుల ప్రదానోత్సవంలో వీరికి పురస్కారాలు అందజేశారు. సహజ వ్యవసాయ విధానాలను అనుసరిస్తూ వరి, కరివేపాకు, పసుపు పంటలను విజయవంతంగా సాగుచేయడంతో పాటు సమర్థవంతమైన ఉత్పత్తులు సాధించి నందుకు వీరికి ఈ గుర్తింపు లభించింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి స్పందిస్తూ. సహజ వ్యవసాయ విధానాల ద్వారా పంటల సాగులో ప్రతిభ కనబరిచి జిల్లాకు గుర్తింపు తీసుకువచ్చిన రైతుల కృషి అభినందనీయం అన్నారు. అంతేకాకుండా జిల్లా వ్యవసాయ శాఖ, ఏపీసీఎన్ఎఫ్ జిల్లా అధికారుల సేవలను ప్రశంశిస్తూ. భవిష్యత్తులో సహజ పద్ధతుల ద్వారా వ్యవసాయ, ఉద్యాన రంగాల్లో జిల్లా రైతులు గణనీయమైన అభివృద్ధిని సాధించాలని ఆకాంక్షించారు.

బ్లూస్టార్ ఆపరేషన్‌కు బలైన ఇందిరా ప్రియదర్శిని

అక్టోబర్ 31.. ఇందిరా గాంధీ వర్ధంతి

భారత దేశానికి మూడవ ప్రధాని, దేశపు మొట్టమొదటి, ఏకైక మహిళా ప్రధాన మంత్రి, 1966 నుండి 1977 వరకు వరుసగా 3 పర్యాయాలు, 1980లో 4వ పర్యాయం ప్రధానమంత్రిగా పని చేసిన శ్రీమతి ఇందిరాగాంధీ అక్టోబరు 31, 1984 న్యూఢిల్లీ లోని సఫ్దార్‌జంగ్ రోడ్డు లోని తన నివాసంలో 09:20 కు ఆమె తమ అంగరక్షకులయిన సత్వంత్‌సింగ్, బియాంత్ సింగ్ లచే హత్య గావింప బడ్డారు. ఈ హత్య అమృత్‌సర్ లోని స్వర్ణ దేవాలయంలో భారత సైన్యం జూన్ 1984 న జరిపిన ఆపరేషన్ బ్లూస్టార్‌కు ప్రతీకారంగా జరిగింది. ఈ దారుణ సంఘటన పూర్వాపరాలు పాఠకులకు తెలిపే ప్రయత్నం ఇది. 1984 అక్టోబర్ 30 మధ్యాహ్నం ఇందిరా గాంధీ చేసిన చివరి ప్రసంగాన్ని ఎప్పటి లాగే ఆమె సమాచార సలహాదారు హెచ్‌వై శారదాప్రసాద్ తయారు చేశారు. ఆరోజు ఆమె ముందుగా తయారు చేసుకున్న ప్రసంగ పాఠం కాకుండా సొంతంగా మాట్లాడారు.

ఆమె మాట్లాడే తీరులోనూ మార్పు కనిపించింది. ఇందిర ప్రసంగం ఇలా సాగింది: "నేనీ రోజు ఇక్కడున్నాను. రేపు బహుశా ఇక్కడ ఉండక పోవచ్చు. నేను ఉంటానా, ఉండనా అన్న దానిపై నాకేమీ బాధ లేదు. నేను సుదీర్ఘ కాలమే జీవించాను. నేను ప్రజాసేవలో నా జీవితాన్ని గడిపినందుకు గర్వపడుతున్నా. నేను నా చివరి శ్వాస వరకూ సేవ చేస్తూనే ఉంటాను. నేను చనిపోతే నా ఒక్కో రక్తం బొట్టూ దేశాన్ని పటిష్టం చేయడానికి తోడ్పడుతుంది." ఆ రాత్రి ఢిల్లీకి చేరుకునే సరికి ఇందిర బాగా అలసి పోయారు. ఆ రోజు రాత్రి ఆమె చాలా తక్కువ సేపు నిద్రపోయారు. ముందు గదిలో పడుకున్న సోనియా ఉదయం 4 గంటల సమయంలో ఆస్థమా మందు వేసుకోవడం కోసం బాత్రూంకు వెళ్లినప్పుడు ఇందిర మెలకువతోనే ఉన్నారు. ఆమె కూడా తన వెనుకే బాత్రూం వరకూ వచ్చారనీ, మందు వెదకడంలో తనకు సహాయం చేశారనీ సోనియా గాంధీ తన పుస్తకం 'రాజీవ్'లో రాశారు. మళ్లీ ఇబ్బంది కలిగితే తనను పిలవమనీ, తాను మెలకువ తోనే ఉంటానని ఇందిర తనకు చెప్పారని సోనియా రాశారు.

తక్కువ అల్పాహారం తీసుకుని, ఉదయం ఏడున్నరకల్లా ఇందిర తయారయ్యారు. ఆ రోజు ఆమె నల్లటి అంచున్న కాషాయ రంగు చీర కట్టుకున్నారు. మొదటి అపాయింట్‌మెంట్ పీటర్ ఉస్తీనోవ్‌తో. ఆయన ఇందిరా గాంధీపై ఒక డాక్యుమెంటరీ తీస్తున్నారు. ఒక రోజు ముందు జరిగిన ఒడిశా పర్యటనలో కూడా ఉస్తీనోవ్ ఆమెను చిత్రీకరించారు. మధ్యాహ్నం ఆమె బ్రిటన్ మాజీ ప్రధానమంత్రి జేమ్స్ కాలెఘన్‌నూ, మిజోరం నాయకుడొకరినీ కలవాల్సి ఉంది. ఆ రాత్రి ఆమె బ్రిటన్ రాకుమారి యాన్‌కు విందు ఇవ్వాల్సి ఉంది. అల్పాహారం తర్వాత మేకప్ మ్యాన్ ఆమె ముఖంపై పౌడర్, బ్లషర్ అద్దుతుండగా డాక్టర్ కేపీ మాథుర్ అక్కడికి చేరుకున్నారు. ఆమెను చూడడానికి ఆయన రోజూ వచ్చే సమయం అదే. ఆమె డాక్టర్ మాథుర్‌ను లోపలికి పిలిచి అక్కడే మాట్లాడారు. తొమ్మిది గంటల 10 నిమిషాలకు ఆమె బయటికి వచ్చినప్పుడు ఎండ తీవ్రంగా ఉంది. ఆమెపై ఎండ పడకుండా ఉండేందుకు ఓ సైనికుడు నారాయణ్ సింగ్ నల్లరంగులో ఉన్న గొడుగును పట్టుకొని ఆమె పక్కన నడుస్తున్నారు. ఆమెకు కాస్త వెనకాల ఆర్కే ధావన్, ఇందిరా గాంధీ వ్యక్తిగత సహాయకులు నాథు రామ్ ఇంకొంచం వెనుక ఉన్నారు. అందరి కన్నా వెనుక ఆమె ప్రైవేట్ సెక్యూరిటీ ఆఫీసర్ సబ్ ఇన్స్పెక్టర్ రామేశ్వర్ దయాళ్ ఉన్నారు. ఇందిర అక్బర్ రోడ్ వైపు నుంచి వికెట్‌గేట్ వైపు వెళుతున్నప్పుడు ఆమె ధావన్‌తో మాట్లాడు తున్నారు. ఆరోజున కార్యక్రమాల గురించి ధావన్ ఆమెకు వివరిస్తున్నారు. ఇంతలో అక్కడ డ్యూటీలో ఉన్న ఓ సెక్యూరిటీ గార్డు బియాంత్ సింగ్ రివాల్వర్ తీసి ఇందిరా గాంధీపై కాల్పులు జరిపాడు. బుల్లెట్ ఆమె కడుపులో దిగింది. పాయింట్ బ్లాంక్ రేంజిలో మరో రెండు రౌండ్ల కాల్పులు జరిపాడు. దీంతో ఆమె భుజం, గుండె, వీపుపై తీవ్ర గాయాలయ్యాయి. అక్కడి నుంచి ఐదడుగుల దూరంలో సత్వంత్ సింగ్ తన థామ్సన్ ఆటో కార్బైన్ గన్ పట్టుకొని అక్కడే నిలబడి, ఇందిరా గాంధీ కింద పడుతున్నప్పుడు దిగ్భ్రాంతి చెంది కదలలేక పోయాడు. బియాంత్ సింగ్ అతనిని కాల్పులు జరపమని గట్టిగా అరిచాడు. సత్వంత్ సింగ్ వెంటనే తన థామ్సన్ ఆటో కార్బైన్‌లో ఉన్న మొత్తం 25 బుల్లెట్లను ఆమె శరీరంలోకి దించాడు. అప్పుడు అందరికన్నా వెనకాల నడుస్తూ వచ్చిన రామేశ్వర్ దయాళ్ ముందుకు పరిగెత్తే సమయాన పెట్టాడు. కానీ ఆయన ఇందిరా గాంధీ దగ్గరకు చేరుకోక ముందే తొడ, కాళ్లపై సత్వంత్ జరిపిన కాల్పులతో కిందపడి పోయాడు. అప్పుడే బియాంత్ సింగ్, సత్వంత్ సింగ్ తమ ఆయుధాలను కింద పడేసి "మేమేం చేయాలను కున్నామో చేసేశాం. ఇప్పుడు మీరు ఏం చేయాలను కుంటున్నారో చేసుకోండి." అన్నారు. దగ్గరలో ఉన్న ఓ రూమ్ నుంచి ఐటిబీపీ దళాలు పరిగెత్తుకొచ్చి సత్వంత్ సింగ్‌ను అదుపులోకి తీసు కున్నాయి. ఎప్పుడూ అక్కడ ఓ అంబులెన్స్ ఉండేది. కానీ, ఆ రోజు డ్రైవర్ ఎందుకో రాలేదు. అప్పుడే ఇందిరా గాంధీ రాజకీయ సలహాదారు మఖన్ లాల్ ఫోతేదార్ కారు తీయండని అరిచాడు. ఇందిరమ్మను ఆర్కే ధావన్, భద్రతా అధికారి దినేష్ ఇద్దరూ అక్కడి నుంచి లేపి తెల్లటి అంబాసిడర్ కారు వెనుక సీటులో పడుకో బెట్టారు. ముందు సీట్లో ధావన్, ఫోతేదార్, డ్రైవర్ ముగ్గురూ కూర్చున్నారు. సోనియా గాంధీ అరుస్తూ పరిగెత్తుకుని వచ్చారు. రక్తసిక్తమైన ఇందిర తలను సోనియా గాంధీ తన ఒడిలో పెట్టుకున్నారు. కారును వేగంగా ఎయిమ్స్ వైపు కు తీసుకెళ్లారు. సోనియా గాంధీ గౌన్ ఇందిరా గాంధీ రక్తంతో తడిసి పోయింది. కారు తొమ్మిది గంటల 32 నిమిషాలకు ఎయిమ్స్‌కు చేరింది.

ఎమర్జెన్సీ వార్డు గేటు తెరిచి ఇందిరా గాంధీని కారు నుంచి కిందకి దింపేందుకే మూడు నిమిషాల సమయం పట్టింది. అప్పుడు అక్కడ ఒక్క స్ట్రెచర్ కూడా అందుబాటులో లేదు. ఎలాగోలా ఒక స్ట్రెచర్‌ను ఏర్పాటు చేశారు. ఇందిరా గాంధీని కారు నుంచి బయటకు తీసుకు వస్తున్నప్పుడు అక్కడున్న డాక్టర్లు కంగారు పడుతూ, వెంటనే ఎయిమ్స్ సీనియర్ కార్డియాలజిస్టుకు ఫోన్ చేసి సమాచారం అందించారు. కొద్ది నిమిషాల్లోనే డాక్టర్ గులేరియా, డాక్టర్ ఎంఎం కపూర్, డాక్టర్ ఎస్ బలరాం అక్కడ ప్రత్యక్షమయ్యారు. ఎలక్ట్రో కార్డియోగ్రామ్‌లో ఇందిరా గాంధీ గుండె ఎక్కడో పని చేస్తున్నట్లుగా చూపిస్తోంది కానీ పల్స్‌రేట్ మాత్రం చూపించడం లేదు. ఒక డాక్టరు ఆమె ఊపిరి తిత్తులకు ఆక్సిజన్ చేరాలని, ఆమె మెదడు పని చేయాలని ఆమె నోటి ద్వారా శ్వాస నాళంలోకి ఒక ట్యూబు వేశాడు. ఇందిరా గాంధీ శరీరంలోకి 80 బాటిళ్ల రక్తాన్ని ఎక్కించారు. "ఆమెను చూసిన వెంటనే ఆమె ఇక లేరని అనుకున్నాను. దాన్ని నిర్ధారించేందుకు ఈసీజీ స్కానింగ్ చేశాం. అప్పుడే అక్కడున్న ఆరోగ్యశాఖ మంత్రి శంకరానంద్‌ను ఇప్పుడేం చేద్దాం అని అడిగా. ఆమె మరణించారని ప్రకటించాలా? అని అడిగితే ఆయన వద్దన్నారు. ఆ తర్వాత ఆమెను ఆపరేషన్ థియేటర్‌లో తీసుకెళ్లాం" అని డాక్టర్ గులేరియా పేర్కొన్నారు. డాక్టర్లు ఆమె శరీరాన్ని హార్ట్ అండ్ లంగ్ మెషిన్‌పై పెట్టారు. ఈ మెషిన్ వల్లే ఆమె రక్త ఉష్ణోగ్రత 37 డిగ్రీల నుండి 31 డిగ్రీలకు పడిపోయింది.

ఆమె చనిపోయారని తెలిసినా ఎయిమ్స్ ఎనిమిదో అంతస్తుపై ఉన్న ఆపరేషన్ థియేటర్‌లో ఆమెను తీసుకెళ్లారు. కాల్పులతో ఆమె కాలేయంలో కుడి భాగం ఛిద్రమైందని నిర్ధారించారు. ఆమె పెద్ద ప్రేగులో దాదాపు 12 రంధ్రాలయ్యాయి. చిన్న ప్రేగు కూడా దాదాపు దెబ్బతింది. ఓ ఊపిరితిత్తి లోకి బుల్లెట్ దూసుకెళ్లింది. బుల్లెట్లతో ఆమె వెన్నెముక కూడా దెబ్బతింది. కేవలం ఆమె గుండె మాత్రమే సురక్షితంగా ఉంది. ఇందిర మరణిం చారని కాల్పులు జరిపిన నాలుగు గంటల తర్వాత ప్రకటించారు. దాదాపు రెండు గంటల 23 నిమిషా లకు ఇందిరా గాంధీ ఇక లేరని ప్రకటించారు.

ఇందిరా గాంధీపై ఇలాంటి దాడి జరగొచ్చనే విషయంపై ఇంటెలిజెన్స్ ఏజెన్సీలు ముందే ఆందోళన వ్యక్తం చేశాయని ఇందిరా గాంధీ జీవిత చరిత్ర రాసిన ఇందర్ మల్హోత్రా పేర్కొన్నారు. సిక్కు భద్రతా సిబ్బందిని మొత్తం ఆమె ఇంటి నుంచి తీసేయాలని ఇంటిలిజెన్స్ ఏజెన్సీలు సిఫారసు కూడా చేశాయి. కానీ దీనికి సంబంధించిన ఫైలు ఇందిరా గాంధీ వద్దకు వెళ్లినప్పుడు ఆమె ఆగ్రహించి "అరింట్ వి సెక్యులర్? (మేము లౌకిక నాయకులం కామా?) అని ప్రశ్నించారు. ఆ తర్వాత ఒకేసారి ఇద్దరు సిక్కు భద్రతా సిబ్బందిని ఆమె వద్ద డ్యూటీలో ఉంచ కూడదని నిర్ణయించారు. సందర్భం కలిసొచ్చి బియాంత్, సత్వంత్ ఇద్దరూ ఒకేచోట ఉండి ఆపరేషన్ బ్లూ స్టార్ కి ఇందిరా గాంధీపై ప్రతీకారం తీర్చుకున్నారు.

-రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్
ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్
9440595494

సదా సజీవాలు..
గీతాంజలి పాత్రలు

అక్టోబర్ 31..

గీతాంజలి వర్ధంతి

గీతాంజలి (1947 – అక్టోబరు 31, 2019) 1960వ దశకంలో పేరొందిన తెలుగు సినిమా నటి. గీతాంజలి దక్షిణ భారత భాషలన్నింటితో పాటు హిందీ సినిమాలలో కూడా నటించింది. గీతాంజలి 1947లో కాకినాడలో శ్రీరామమూర్తి, శ్యామసుందరి దంపతుల కు జన్మించింది. నలుగురు అమ్మాయిలు ఒక అబ్బాయి ఉన్న కుటుంబంలో గీతాంజలి రెండవ అమ్మాయి. పుట్టింది ఆంధ్రప్రదేశ్ లోని కాకినాడలోనైనా, పెరిగింది, నటిగా ఎదిగింది చెన్నై మహానగరం లోనే. పువ్వు పూయగానే వికసిస్తుందంటారు. అలా నటి గీతాంజలి బాల్యంలోనే నటిగా అడుగులు వేసింది. తన మూడో ఏట నుంచే నాట్యంలో శిక్షణ పొందిన గీతాంజలి అసలు పేరు మణి. కాకినాడలోని సెయింట్ జోసెఫ్ కాన్వెంటులో కొన్నేళ్లు చదివింది. మూడేళ్ల ప్రాయం నుండే గీతాంజలి తన అక్క స్వర్ణతో పాటు కాకినాడలోని గంధర్వ నాట్య మండలిలో లక్ష్మారెడ్డి, శ్రీనివాసన్ ల వద్ద నాట్యం నేర్చు కోవటం ప్రారంభించింది. నాలుగేళ్ల నుండే అక్కతో పాటు సభల్లో నాట్య ప్రదర్శనలు ఇవ్వటం ప్రారంభిం చింది. విశ్వ విఖ్యాత నటుడు నందమూరి తారక రామారావు దర్శకత్వంలో ఆయనే కథా నాయకుడిగా నటించిన సీతారామ కళ్యాణం సినిమా ద్వారా వెండి తెరకు పరిచయమైన గీతాంజలి ఆ సినిమాలో సీతగా నటించి మెప్పించింది. తొలి చిత్రంలో గీతాంజలి నటనకు ప్రేక్షకులు బ్రహ్మ రథం పట్టారు. ఆమె ఎన్టీఆర్‌కు పోటీగా నటించి మెప్పించింది. ఎన్టీఆర్‌ను తన సినీ గురువుగా గీతాంజలి చెప్పు కునేది. సీతారాముల కళ్యాణం సినిమాలో కథా నాయికగా తనను ఎంపిక చేసి సీత పాత్ర ద్వారా తెలుగు ప్రేక్షకులకు పరిచయం చేశారని అనేది. ఆ పాత్ర వల్లే తనకంటూ తెలుగులో ఓ ప్రత్యేకత వచ్చిందని ప్రతి ఇంటర్వ్యూలోనూ గీతాంజలి తలచుకునేది. అన్ని భాషల్లోనూ 500కు పైగా చిత్రాల్లో నటించింది. కలవారి కోడలు, డాక్టర్ చక్రవర్తి, లేత మనసులు, బొబ్బిలి యుద్ధం, ఇల్లాలు, దేవత, గూఢచారి116, కాలం మారింది, శ్రీ శ్రీ మర్యాద రామన్న, నిర్దోషి, మాయాజాలం, గ్రీకువీరుడు తదితర చిత్రాల్లో నటించింది. ఆమె అసలు పేరు మణి. పారస్ మణి అనే హిందీ చిత్రంలో పని చేస్తుండగా ఆ చిత్ర నిర్మాతలు లక్ష్మీకాంత్ – ప్యారేలాల్ సినిమా టైటిల్లోనూ మణి ఉంది కాబట్టి ఈమెకు గీతాంజలి అని నామకరణం చేశారు. ఆ పేరు సినీరంగంలో అలానే స్థిరపడి పోయింది. సహజ నటుడు రామకృష్ణతో వివాహం తర్వాత సినిమాలకు కొంత విరామం ఇచ్చింది. క్యారక్టర్ ఆర్టిస్ట్‌గా మారిన ఆమె పెళ్లైన కొత్తలో, మాయా జాలం, భాయ్, గ్రీకు వీరుడు తదితర చిత్రాల్లో నటించింది. గీతాంజలి చివరి చిత్రం తమన్నా కథానాయికగా రూపొందుతున్న దటీజ్ మహాలక్ష్మి. రాజకీయాల్లోకి వచ్చిన గీతాంజలి 2009 ఆంధ్ర ప్రదేశ్ శాసనసభ ఎన్నికల సమయంలో తెలుగుదేశం పార్టీలో చేరింది. ఆమె కెరీర్ లో ఎన్నో హిట్ సినిమాలు ఉన్నాయి. ఎన్టీఆర్, ఏఎన్నార్ లాంటి స్టార్ హీరోలతో కలిసి పని చేసింది. నటిగా మంచి స్థాయిలో ఉన్న సమయంలోనే తన సహనటుడు రామకృష్ణని వివాహం చేసుకొని సినిమాలకు దూర మయ్యారు. నటుడు రామకృష్ణ ఎన్నో సూపర్ హిట్ చిత్రాలలో నటించారు. అప్పట్లో ఆయనతో సినిమాలు చేయాలని దర్శక నిర్మాతలు ఎదురు చూసేవారు. గీతాంజలి పలు ఇంటర్వ్యూ లలో తమ వివాహ నేపథ్యం గురించి చెపుతుండేది. రామకృష్ణ ఆమె అంటే ఇష్టపడ్డారట. ఆ విషయాన్ని ఆమెకి చెప్పినప్పుడు ఏడాది వరకు ఒప్పుకోలేదట. ఆ సమయంలో తన బాధ్యతలు మొత్తం తన తండ్రే చూసుకునే వారని గీతాంజలి చెప్పింది. దీంతో రామకృష్ణ తన తండ్రిని కలిసి మాట్లాడారని.. రామకృష్ణగారి గుణగణాలు నచ్చడంతో అబ్బాయి మంచి అందగాడు. డీసెంట్ బిహేవియర్– అని చెప్పి తనను పెళ్లికి ఒప్పించినట్లు గీతాంజలి వెల్లడించింది. ఇద్దరం సినిమా రంగానికి చెందిన వారం కాబట్టి చాలా మంది మాది ప్రేమ వివాహం అనుకున్నారు. కానీ మాది పెద్దలు కుదిర్చిన వివాహమని క్లారిటీ ఇచ్చింది గీతాంజలి. మంచిరోజు, పెళ్లిరోజు, తోటలోపిల్లా కోటలోరాణి, రాజయోగం, రణభేరి వంటి చిత్రాల్లో రామకృష్ణ, గీతాంజలి కలిసి నటించినట్లు వివరించేది. గీతాంజలి ఫూల్స్ (2003); పచ్చ తోరణం (1994); కాలం మారింది (1972); నిర్దోషి (1970); ఆదర్శ కుటుంబం (1969); మంచి మిత్రులు (1969); నిండు హృదయాలు (1969); దో కలియా (హిందీ) (1968); రణభేరి (1968); గూఢచారి 116 (1967); పూల రంగడు (1967); ప్రాణ మిత్రులు (1967); శ్రీకృష్ణావ తారం (1967); శ్రీ శ్రీ శ్రీ మర్యాద రామన్న (1967) లేత మనసులు (1966); దేవత (1965) – హేమ; తోడూనీడా (1965); ఇల్లాలు (1965); బభ్రు వాహన (1964); బొబ్బిలి యుద్ధం (1964); డాక్టర్ చక్రవర్తి (1964); మురళీ కృష్ణ (1964); సీతారామ కళ్యాణం (1961) – సీతతదితర చిత్రాలలో విభిన్న పాత్రలు పోషించింది.

-రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్
ఇండిపెండెంట్ జర్నలిస్ట్, 9440595494

నేడు కాకపోయినా
రేపైనా..!

నడిచే వారికే దెబ్బలు
తగులుతాయి
పడి లేచి ముందడుగు వేసిన
వారే..
రేపు తమదైన ఘన చరిత్ర
సృష్టించి..
రాబోయే తరానికి ఆదర్శంగా
నిలుస్తారు !

లోతుగా వేర్లు దిగిన చెట్టు..
తుపాను గాలికి నిలబడుతుంది
పైపైన వేర్లు విస్తరించిన చెట్టు..
చిన్న గాలికే పడిపోతుంది !

బియ్యంలో దూరిన రాళ్లను..
జీవితంలో ఎదురయ్యే
కష్టాలను..
ఏరి పడేయాల్సిందే ఎవరైనా..
లేదంటే మూతి పళ్ళు
రాలుతాయి !

మనిషి కూడా అంతే కదా
లోతైన ఆలోచన ఉన్న వారు..
కష్టాలకు తట్టుకొని
నిలబడతారు
ఆలోచన పలుచనైన వారు...
చిన్న కష్టానికి కుంగి పోతారు !

వేపు ఆకును చక్కర రసంలో..
ప్రేమతో ఎంత కాలం
నానబెట్టినా..
దాని రుచి తియ్యగా మారునా..
దురాలోచనలు చేసే
నరకాసురులు..
మంచి వారితో ఎంత కాలం
ఉన్నా..
వారి చెడు చేష్టలను
మార్చుకొనునా !

డబ్బు, అవకాశాలు,
స్నేహితులు..
నేడు దూరమైనా రేపు
దగ్గరౌతారు
కాని గడిచిన నిన్నటి రోజు
తిరిగిరాని
కాలానికి మర్యాదనిస్తూ కదం
తొక్కు..
గమ్యాన్ని నేడు కాకపోయినా..
రేపైనా ముద్దాడి విజేతగా
నిలబడు !

- మధుపాళీ
9949700037

ఉక్కుమనిషి సర్దార్ వల్లబాయ్ పటేల్

అక్టోబర్ 31.. పటేల్ జయంతి

సర్దార్ వల్లభభాయ్ పటేల్ పేరు వినగానే - దేశ స్వాతంత్ర్యం అనంతరం స్వదేశీ సంస్థానాల విలీనం అంశం ఎవరికైనా గురుకొస్తుంది. 1948 సెప్టెంబర్ 18న హైదరాబాద్ నిజాం పైకి భారత సైన్యంతో దాడి చేయించి, రజాకార్లను పారద్రోలి, ఆ సంస్థానాన్ని ఇండియన్ యూనియన్‌లో విలీనం చేసిన పటేల్ ఘనత అందరికీ స్ఫురణకు వస్తుంది. నిజాం నిరంకుశ పాలన నుండి తెలంగాణకు విముక్తి కలిగించి, మీర్ ఉస్మాన్ ఆలీఖాన్‌ను లొంగ దీసుకున్న మహా సాహసి మన 'సర్దార్'. 'ఉక్కుమనిషి'గా దేశ ప్రజ లంతా కీర్తించిన ఆయన 1875 అక్టోబర్ 31న గుజరాత్ లోని నడియాలో పటేల్ జవేరి భాయ్, లాడ్ దంపతులకు నాలుగవ సంతానంగా జన్మించాడు. ఇంట్లో అన్నలు తనపై అధికారం చెలాయించిన క్రమంలో ఆయన తరుచూ ఎదురు తిరిగేవాడు. ఆ మనస్తత్వ ప్రభావమే పెద్దయ్యా క ఆయనలో స్పష్టంగా కనిపించింది. బాల్యంలో ఆకతాయిగా తిరుగుతూ చదువుపై అంతగా ధ్యాస పెట్టని పటేల్ ఏళ్ల వయసులో మాత్రం ఆంగ్లభాషపై మమ కారం పెంచుకున్నాడు. నాలు గేళ్లు కష్టించి మెట్రిక్యులేషన్ పూర్తి చేశాక, జిల్లా ప్లీడర్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి న్యాయవాద వృత్తిని చేపట్టారు. లండన్ వెళ్లి 'బారిస్టర్' చదవనిదే తనకు గౌరవం దక్కదని భావించి, మూడేళ్ళు శ్రమించి తగిన ధనాన్ని సంపా దించారు.

సోదరుడు విఠల్ భాయ్ పటేల్ కోరికపై తాను సంపాదించిన డబ్బుతో అతడిని బారిస్టర్ చదివించారు. అన్న తిరిగి వచ్చాక, మళ్లీ సంపాదించిన డబ్బుతో లండన్ వెళ్లి బారిస్టర్ పూర్తి చేశారు. తాను చదివిన విద్యా సంస్థలో ఉత్తమ విద్యార్థిగా 57 పౌనుల బహుమానాన్ని పొందారు. స్వదేశం వచ్చాక సూటు, బూటు, హ్యాటు ధరించి అహమ్మదాబాద్ లో గొప్ప క్రిమినల్ లాయర్‌గా పేరు గాంచారు. ఒకరోజు స్నేహితులతో కలిసి క్లబ్లో పేకాడుతున్న సమయంలో గాంధీజీ అక్కడికి వచ్చి, జాతీయ పాఠశాలను నెలకొల్పేందుకు సహకరించాలని కోరారు. అపుడు గాంధీజీ వైపు పటేల్ కన్నెత్తైనా చూడ లేదు. అయితే, అదే ఏడాది గాంధీజీ అధ్యక్షత వహించిన 'గుజరాత్ కాంగ్రెస్ సభకు పటేల్ కార్యదర్శిత్వం వహించాల్సి వచ్చింది. అపుడు మహాత్ముని ప్రభావంతో పటేల్ జీవితం దేశానికి అంకితమైంది. 1918లో కైరా జిల్లాలో కరవు కారణంగా పన్ను మినహా యింపుఇవ్వాలని రైతులు చేసిన విజ్ఞప్తిని బ్రిటిష్ ప్రభుత్వం పట్టించుకోలేదు. కైరా సత్యాగ్రహాన్ని పటేల్ విజయ వంతంగా పూర్తి చేయగా, తనకు సరైన అనుచ రుడు, కార్యదీక్షాపరుడు లభించాడని గాంధీ ప్రశంసించారు. ఆ తర్వాత అహమ్మదాబాద్ మున్సిపల్ చైర్మన్ గా 1928లో బార్డోలీ సత్యాగ్రహ సారథిగా, 1931లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా, 1912లో క్విట్ ఇండియా ఉద్యమంలో పటేల్ చురుకైన పాత్ర నిర్వహించారు. దేశ విభజన సమయంలో, భారత రాజ్యాంగ నిర్మాణంలో సంస్థానాల విలీనంలో పటేల్ నాయకత్వ పటిమ ఉప యోగపడింది.

గాంధీజీ సహచరుడిగా, జైలులో ఆయనకు సంరక్షకు నిగా వ్యవహరించిన పటేల్ వాస్తవ దృక్పథంతో ఆలో చిస్తూ, అరుదైన వ్యక్తిత్వంతో దేశానికి సేవలందించారు. ఒకసారి కోర్టులో వాదిస్తున్న సమయంలో ఆయనకు టెలిగ్రాం రాగా, దానిని చదువుకుని కొద్దిసేపు కళ్లు మూసుకొని, ఏమీ కానట్లు తన వాదనను కొనసాగిం చారు. ఆ తర్వాత అందరికీ తెలిసింది– ఆయన భార్య మరణించినట్లు టెలిగ్రాంలో వర్తమానం ఉందని. దేశ విభజన వేళ– 'కుళ్లిన అవ యవాన్ని ఖండించి, మిగిలిన శరీరాన్ని కాపాడడమే మన కర్తవ్యం. దేశ విభజ నకు ఒప్పుకోకుంటే స్వాతంత్ర్యం వచ్చే అవకాశమే ఉండదు. మొత్తాన్ని కోల్పో వడం కంటే కొంత వదులుకోవడానికే నేను ఇష్టపడతాను' అని ఆయన చెప్పేవారు. బార్డోలి సత్యాగ్రహం సందర్భంగా– 'తక్కువ మాట్లాడండి, ఎక్కువ సాధించండి, విప్లవం.. అని కేకలు వేయకండి, అలా కేకలు వేసే నాయకులకు కొదవ లేదు. క్రమశిక్షణా శీలురైన అనుచరులు లేనిదే పోరాటం విజయవంతం కాదు. మంచి సైనికులుగా తయారుకండి' అని పటేల్ పిలుపునిచ్చారు కాగా, జాతీయోద్యమ సమయాన పటేల్ నెహ్రూతో విభేదించారు. 1938 నాటి కాంగ్రెస్ సదస్సులో నెహ్రూ ప్రవచించిన సోషలి జాన్ని పటేల్ వ్యతిరేకించారు. సంస్థానాల విలీనంలో నెహ్రూ శాంతి కాముకతను కాదని, సైనిక చర్యలు చేపట్టి సర్దార్ విజయం సాధించారు. పాకిస్తాన్ కు 55 కోట్ల రూపా యలు ఇవ్వరాదని నెహ్రూతో వాదించారు. తొలి రాష్ట్రపతి ఎన్నికలలో నెహ్రూ రాజగోపాలా చారిని సమర్థించగా, పటేల్ రాజేంద్ర ప్రసాద్ ను ప్రతిపాదించి సఫలీకృతు లైనారు. భారత రాజ్యాంగం డ్రాఫ్టింగ్ కమిటీ అధ్యక్షునిగా అంబేద్కర్‌ను నియమించడం లో పటేల్ కీలక పాత్ర పోషించారు. 1950లో కాంగ్రెస్ అధ్యక్షునిగా నెహ్రూ కృపలానీని సమర్థించగా, పటేల్ పురుషోత్తమ్ దాస్ టాండన్ ను గెలిపించారు. కేంద్ర హోం మంత్రిగా, ఉప ప్రధానిగా 1947 నుండి 1950 డిసెంబర్ 15న మరణించే వరకు పదవిలో ఉన్నారు. పటేల్ సేవలకు గుర్తింపుగా 1991లో 'భారతరత్న' పురస్కారం ప్రకటించింది.

-రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్

ఐక్యతకు ప్రతీక భారత్.. విభేదాలకు బలికావద్దు!

భాషలు వేరు.. యాసలు వేరు.. మతాలు వేరు.. సంప్రదాయాలు వేరు.. అయినా మనమంతా భారతీయులమే! ఇదే ప్రపంచంలో భారతదేశానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చిన భిన్నత్వంలో ఏకత్వం. స్వాతంత్ర్యం కోసం కలిసికట్టుగా పోరాడిన జాతి.. నేడు కులం, మతం, ప్రాంతం, భాష పేరుతో పరస్పరం దూరమైతే దేశ ప్రగతి ఎలా సాధ్యం? విభిన్న అభిప్రాయాలు సహజమే.. అవి విద్వేషాలుగా మారడమే ప్రమాదకరం. ఈ వాస్తవాన్ని గుర్తుచేసే సందర్భమే అక్టోబర్ 31న నిర్వహించే జాతీయ ఐక్యత దినోత్సవం. సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని నిర్వహించే ఈ వేడుక కేవలం ప్రతిజ్ఞలకో, పరుగులకో పరిమితం కాకూడదు. దేశాన్ని ఏకం చేసిన మహనీయుడి స్ఫూర్తిని మన జీవితాల్లో ఆచరించే సంకల్పంగా మారాలి.

సంస్థానాలను ఏకం చేసిన ఉక్కుమనిషి

1875 అక్టోబర్ 31న జన్మించిన సర్దార్ వల్లభభాయ్ పటేల్ స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. స్వాతంత్ర్యానంతరం వందలాది సంస్థానాలను భారత సమాఖ్యలో విలీనం చేయడంలో ఆయన చూపిన దృఢ సంకల్పం, రాజకీయ చతురత దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచాయి. భారతదేశ తొలి ఉపప్రధానిగా, హోంమంత్రిగా ఆయన దేశ సమైక్యతకు పునాదులు బలోపేతం చేశారు. అందుకే ఆయనను 'భారత ఉక్కు మనిషి'గా గౌరవిస్తున్నాం. ఆయన జయంతిని జాతీయ ఐక్యత దినోత్సవంగా నిర్వహించడం వెనుక ఉన్న ఉద్దేశం కూడా దేశ సార్వభౌమత్వం, సమగ్రత, భద్రతను కాపాడుకోవాలనే సంకల్పాన్ని పునరుద్ధరించుకోవడమే. నాడు సంస్థానాలను ఏకం చేసిన పటేల్‌ను స్మరించుకుంటున్న మనం.. నేడు ప్రజల మధ్య పెరుగుతున్న అగాధాలను తగ్గించేందుకు ఏం చేస్తున్నాం? దేశాన్ని భౌగోళికంగా ఏకం చేయడం ఎంత ముఖ్యమో.. ప్రజల హృదయాలను ప్రేమ, పరస్పర గౌరవంతో అనుసంధానించడం కూడా అంతే ముఖ్యం.

రాజ్యాంగం చెప్పిన ఐక్యతా మార్గం

భారత రాజ్యాంగం పౌరులకు హక్కులను కల్పించడమే కాకుండా బాధ్యతలను కూడా గుర్తుచేస్తోంది. రాజ్యాంగంలోని 51ఏ అధికరణం ప్రకారం దేశ సార్వభౌమత్వం, ఐక్యత, సమగ్రతను కాపాడటం ప్రతి పౌరుడి ప్రాథమిక విధుల్లో ఒకటి. మత, భాష, ప్రాంతీయ భేదాలకు అతీతంగా సామరస్యాన్ని, సౌభ్రాతృత్వాన్ని పెంపొందించడం కూడా పౌరుల బాధ్యతే. ఈ రాజ్యాంగ స్ఫూర్తి పుస్తకాలకే పరిమితం కాకూడదు. ఇతరుల విశ్వాసాలను గౌరవించడం, మహిళల గౌరవాన్ని కాపాడటం, వివక్షకు దూరంగా ఉండటం, హింసను తిరస్కరించడం నిత్యజీవితంలో కనిపించాలి. దేశభక్తి అంటే జాతీయ జెండాకు వందనం చేయడం మాత్రమే కాదు.. ఆ జెండా కింద జీవిస్తున్న ప్రతి భారతీయుడి గౌరవాన్ని గుర్తించడం కూడా! హక్కుల కోసం గొంతెత్తినప్పుడు బాధ్యతలను మరచిపోకూడదు. బాధ్యతలను నిర్వర్తించినప్పుడే హక్కులకు నిజమైన విలువ లభిస్తుంది.

రాజకీయాలకు అతీతంగా ప్రజల ఐక్యత

ప్రజాస్వామ్యంలో భిన్నమైన రాజకీయ అభిప్రాయాలు ఉండటం సహజం. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించడం, ప్రజా సమస్యలపై విమర్శించడం పౌరుల హక్కు. అయితే రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల మధ్య ద్వేషాన్ని పెంచడం, కులమతాల పేరుతో సమాజాన్ని చీల్చడం, నిర్ధారణ లేని సమాచారంతో ఉద్రిక్తతలు సృష్టించడం దేశ ప్రయోజనాలకు విరుద్ధం. రాజకీయ నాయకులు తమ మాటల్లో సంయమనం పాటించాలి. ప్రభుత్వాలు చట్టాన్ని నిష్పాక్షికంగా అమలు చేస్తూ ప్రతి పౌరుడికి సమాన రక్షణ కల్పించాలి. నేరానికి పాల్పడిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి తప్ప.. అతని కులం, మతం లేదా ప్రాంతం ఆధారంగా ప్రజలను నిందించకూడదు. భిన్నాభిప్రాయాలను శత్రుత్వంగా కాకుండా ప్రజాస్వామ్య సహజ లక్షణంగా చూడాలి. మనిషిని మనిషిగా గౌరవించే సంస్కృతి బలపడినప్పుడే సామాజిక ఐక్యతకు గట్టి పునాది పడుతుంది. నేటి యువత చేతుల్లోనే రేపటి భారతదేశం రూపుదిద్దుకోనుంది. సామాజిక మాధ్యమాల్లో వచ్చే ప్రతి సమాచారాన్ని నిజమని నమ్మడం, నిర్ధారణ లేని వార్తలను ఇతరులకు పంపడం, భిన్నాభిప్రాయాలున్న వారిపై ద్వేషపూరిత వ్యాఖ్యలు చేయడం సమాజంలో చీలికలకు కారణమవుతాయి. యువత సమాచారాన్ని పరిశీలించి నిజానిజాలు తెలుసుకోవాలి. తప్పుడు ప్రచారాన్ని తిరస్కరించాలి. కులమతాలకు అతీతంగా స్నేహభావాన్ని పెంపొందించుకోవాలి. పాఠశాలలు, కళాశాలల్లో స్వాతంత్ర్య సమరయోధుల చరిత్రతోపాటు రాజ్యాంగ విలువలు, పౌర బాధ్యతలు, సామాజిక సామరస్యంపై అవగాహన కల్పించాలి. భిన్న భాషలు, సంప్రదాయాల పట్ల గౌరవం పెంచాలి. ఐక్యత అంటే అందరూ ఒకేలా ఉండటం కాదు.. భిన్నంగా ఉన్నా దేశ ప్రయోజనాల కోసం కలిసికట్టుగా నిలవడం.

-శ్రీశైలం దూడం
ఫ్రీలాన్స్ జర్నలిస్టు
9133947176

యువత ఉజ్వల భవిష్యత్తు కోసం కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థికి మద్దతు నివ్వాలి

శంకర్ పల్లి, వెలుతురు అక్టోబర్ 30 :
హైదరాబాద్ – రంగారెడ్డి – మహబూబ్ నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో శంకర్ పల్లి మండల కాంగ్రెస్ పార్టీ శ్రేణులు చురుకైన పాత్ర పోషించాలని నాయకులు పిలుపునిచ్చారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, పి.ఏ.సి.ఎస్ సొసైటీ చైర్మన్ బొల్లారం వెంకట్ రెడ్డి, శంకర్ పల్లి మోకిల పి.ఏ.సి.ఎస్ చైర్మన్ గౌండ్ర సత్యం, మరియు శంకర్ పల్లి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మడపతి చంద్రమౌళి సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, చదువుకున్న యువత ఉజ్వల భవిష్యత్తు కోసం పట్టభద్రుల ఓటు నమోదు కార్యక్రమాన్ని మండలంలో ఉద్యమంలా చేపట్టాలని పార్టీ నాయకులకు, ప్రజాప్రతినిధులకు, అనుబంధ సంఘాల అధ్యక్షులకు, మరియు కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. శంకర్ పల్లి మండలంలోని ప్రతి గ్రామంలో ఉన్న పట్టభద్రులను గుర్తించి, వారిని ఓటర్లుగా నమోదు చేయించడంలో ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. 2023 నాటికి డిగ్రీ పూర్తి చేసిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవడానికి అర్హులని, ఇందుకు నవంబర్ 6 చివరి తేదీ అని వారు గుర్తుచేశారు. యువత అభివృద్ధి, సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గౌరవ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, మంత్రివర్యులు శ్రీధర్ బాబు, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పారిజాత నరసింహ రెడ్డి గారి ఆశీస్సులతో.. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి గారిని భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని, ఇందుకు పట్టభద్రులంతా కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా నిలవాలని శంకర్ పల్లి మండల కాంగ్రెస్ నాయకత్వం పిలుపునిచ్చింది.

కాలనీ ప్రజలకు అవగాహన..

పారిశుద్ధ్య పనులకు రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రాధాన్యం..

కూకట్ పల్లి అక్టోబర్ 30 వెలుతురు:
వివేకానంద నగర్ డివిజన్‌లోని కాలనీలో రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రజలకు పలు అంశాలపై అవగాహన కల్పించే కార్యక్రమం నిర్వహించారు. వాటర్ బోర్డు అధికారులు నాగరాజు, సతీష్ అందించిన వాల్ పోస్టర్లను కాలనీలోని పలు ప్రాంతాల్లో అతికించారు. ఎల్ నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాల నేపథ్యంలో నీటి ప్రాముఖ్యత, నీటి పొదుపు పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం చేపట్టారు. అదేవిధంగా డ్రైనేజీ శుభ్రం చేసిన అనంతరం పేరుకుపోయిన మట్టి కుప్పలను పూర్తిగా తొలగించి కాలనీ పరిసరాలను పరిశుభ్రంగా చేయించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు జనంపల్లి పురంధర్ రెడ్డి, కార్యదర్శి రాంచందర్ రావు, శ్రీధర్, లక్ష్మీనారాయణ, నాని తదితరులు పాల్గొన్నారు. కాలనీలో ఏ సమస్య తలెత్తినా వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు అసోసియేషన్ శాయాశక్తుల కృషి చేస్తుందని పురేందర్ రెడ్డి ఈ సందర్భంగా కాలనీ ప్రజలకు హామీ ఇచ్చారు.

మంచాల మండలంలో పార్ట్--2 పాఠ్యపుస్తకాల పంపిణీ

మంచాల వెలుతురు అక్టోబర్ 30:
మంచాల మండల కేంద్రంలో విద్యావనరుల కేంద్రం ఎంఆర్ సి లో ప్రభుత్వ పాఠశాలలకు పా ర్ట్--2 పాఠ్యపుస్త కా ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమాన్ని మంచాల మండల విద్యాధికారి రామ్‌దాస్ ప్రారంభించి పాఠశాలల ఉపాధ్యాయులకు పాఠ్యపుస్తకాలను అందజే శారు ఈ సందర్భంగా అయన విద్యార్థులకు అందించే పౌష్టికాహార కార్యక్రమంలో భాగంగా రాగి జావను కూడా పంపిణీ చేశారు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు వారి ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన పౌష్టికాహారాన్ని అందించడం ప్రభుత్వపాఠశాలల అభివృద్ధిలో కీలకమని మంచాల మండల విద్యాధికారి రామ్ దాస్ అన్నారు ఈ కార్యక్రమంలో జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల జాపాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు భీమ్లా నాయక్ సీఆర్పీలు గిరీష్ జగదీ శ్ అజ్మత్ ఖాన్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు

రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- అధికారుల తీరుపై అసంతృప్తి.. డబ్బులు వసూలు చేసే చర్యలకు సహకరించవద్దని సూచన..

కూకట్ పల్లి అక్టోబర్ 30 వెలుతురు:
బాలాజీనగర్ డివిజన్‌లో చేపడుతున్న రోడ్డు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం బాలాజీనగర్ డివిజన్‌లోని వసుంధర ఆసుపత్రి వెనుక ప్రాంతంలో ఆయన రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి నుంచి హబీబ్‌నగర్‌కు వెళ్లే రహదారి నిర్మాణానికి నిధులు మంజూరైనప్పటికీ పనులు నత్తనడకన సాగుతుండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పనుల్లో వేగం పెంచి నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అలాగే మంజూరైన రోడ్ల పనుల పేరుతో కొంతమంది మట్టి పోసి నాయకుల వద్ద డబ్బులు వసూలు చేస్తున్నారన్న విషయం తన దృష్టికి వచ్చిందని తెలిపారు. ఇలాంటి అక్రమ వసూళ్లకు అధికారులు ఎట్టి పరిస్థితుల్లోనూ సహకరించవద్దని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా పనులు చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పగుడాల బాబూరావు, మేడ్చల్ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు మహ్మద్ గౌసుద్దీన్, డివిజన్ అధ్యక్షుడు ప్రభాకర్ గౌడ్, జనరల్ సెక్రటరీ వెంకటేష్ చౌదరి, మూసాపేట డివిజన్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, ఆనందరావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నూతన వ్యాపార సంస్థలు యువతకు ఉపాధి అవకాశాలు

- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్..
- కూకట్ పల్లిలో 'వాస్ట్టీ బేక్ హౌస్' ప్రారంభోత్సవానికి హాజరైన మంత్రి..

కూకట్ పల్లి, అక్టోబర్ 30 వెలుతురు:
కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని జేఎన్‌టీయూ మెట్రో స్టేషన్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన వాస్ట్టీ బేక్ హౌస్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి, గిరిజన సంక్షేమ శాఖల మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై బేక్ హౌస్‌ను ప్రారంభించారు. తన మేనకోడలు ఏర్పాటు చేసిన నూతన వ్యాపార సంస్థ ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రి నిర్వాహకులకు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. వాస్ట్టీ బేక్ హౌస్ వినియోగదారుల ఆదరణ పొందుతూ వ్యాపార రంగంలో మంచి గుర్తింపు సాధించి దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. నూతన వ్యాపార సంస్థల స్థాపనతో స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, యువత ఉద్యోగాలకే పరిమితం కాకుండా వ్యాపార రంగంలోనూ రాణించేందుకు ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి నియోజకవర్గ సీనియర్ నాయకులు సాధు ప్రతాప్ రెడ్డి, ఏ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పట్లోళ్ల నాగిరెడ్డి, కూకట్‌పల్లి పట్టణ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి, నియోజకవర్గ కంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి బి. సంజీవరావు, క్రిస్టియన్ ఫైనాన్స్ కమిటీ చైర్మన్ మేకల మైఖేల్, కూకట్ పల్లి డివిజన్ సీనియర్ నాయకుడు కొండల్ రెడ్డి, ఏఎంసీ పనింద్ర కుమార్, ఉమ్మడి కేపీహెచ్‌బీ డివిజన్ మాజీ అధ్యక్షుడు తమ్మినేని ప్రవీణ్ కుమార్, బాలాజీనగర్ డివిజన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కళ్యాణ్ బాబు తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.

బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఎడిన పంట పొలాల పరిశీలన

- కరెంట్ కోతలను నివారించాలి మంచాల మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలి
- బిఅర్ఎస్ పార్టీ మంచాల మండల అధ్యక్షుడు చీరాల రమేష్

మంచాల వెలుతురు అక్టోబర్ 30:
మంచాల మండలం బిఅర్ఎస్ పార్టీ మంచాల మండలం అధ్యక్షుడు చీరాల రమేష్ఆధ్వర్యంలో మంచాల జపాల ఆరుట్ల గ్రామాలలో నీళ్ళ లేక ఎండిపోయిన పంటలను పరిశీలించిన బిఆర్ఎస్ పార్టీ బృందం రైతులు మాట్లాడుతూ వర్షలులేక ఆందోళన చెందుతున్న క్రమంలోకనీసం బోరు బావులతో తినడానికి సరిపడ పంటపండించు కుందా మంటే లో ఓల్టేజ్ కరెంట్ సమస్యతో బోర్ మోటార్లు కాలిపోవడం మాకు పెద్ద ఇబ్బంది కలుగుతుందని రైతులు తమ బాధను బి అర్ఎస్ పార్టీ బృందానికి తమ సమస్యల గోడును ఆవేదనతో చెప్పుకున్నారు ఈ సందర్భంగా బిఅర్ఎస్ పార్టీ మండలం అధ్యక్షుడు చీరాల రమేష్ ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ మాజీ చై ర్మన్ ఏర్పుల చంద్రయ్య మంచాల వ్యవసాయ సహకార సంఘం మాజీ చైర్మన్ మొద్దు సికిందర్ రెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వ్యవసాయానికి విద్యుత్ సరఫరాసమయాన్ని తగ్గించడమే కాకుండా వ్యవసాయానికి సక్రమంగా విద్యుత్ రాక అప్పుడప్పుడు విద్యుత్ కు అంతరాయం కలగడం వల్ల రైతులు నాన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు అని తె లంగాణ రాష్ట్ర ప్రభుత్వంపై మండిపడ్డారు గత బిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వ హయాంలో రైతులకు వ్యవసాయానికి విద్యుత్ నిరంతరం ఎలాంటి అంతరాయం లేకుండా సరపరా చేసాం రైతులకు సరైన సమయానికి రైతు బంధు డబ్బులు రైతుల బ్యాంకు ఖాతాలో వేసి రైతులను అన్ని విధా లుగా ఆదుకున్న ప్రభుత్వం బిఆర్ఎస్ ప్రభుత్వం అనిఅన్నారు ఇప్పటికైనా తెలంగాణ రాష్ట్ర ప్ర భుత్వం వెంటనే స్పందించి రైతుల వ్యవసాయానికి 24 గంటలు విద్యుత్ ఎలాంటిఅంతరాయం లేకుండా సరఫరాచేయాలి మరియు మంచాల మండలాన్ని కరువుప్రాంతంగా గుర్తించి ప్రకటన చేయాలనీ ఎండిన పంటలకు వెంటనే నష్ట పరిహారం అందించాలని లేదంటే బిఅర్ఎస్ పార్టీ ముందుండి రైతులపక్షాన రైతులతో కలిసి ప్రభుత్వంపైన పెద్దఎత్తున ఉద్యమిస్తాం అని హెచ్చ రించారు ఈ కార్యక్రమంలో మంచాల మండలం మాజీ ఎంపీపీ మంకు ఇందిర మాజీ వైస్ మం చాల సహకార సంఘం మాజీ వైస్ చైర్మన్ దండేటికార్ రవి మాజీ డైరెక్టర్ జంబుల కిషన్ రెడ్డి పటేల్ చెరువుతండా మాజీ సర్పంచ్ రాజునాయక్ ఆరుట్ల గ్రామసర్పంచ్ మానిపాటి శోభకుమార్ జాపాల గ్రామసర్పంచ్ మంచాల రవి బిఅర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు చిందం రఘుప తి మొగ్రి ఐలయ్య ఆరుట్ల గ్రామపంచాయతీ వార్డుసభ్యులు మాడుగుల బాలమణి పున్నం రా ము నాయకులు జీఎంపీస్ చెర్మన్ చిందం జంగయ్య బకున చందు ఆకారం కృష్ణ లచ్చిరాంఅవు ల శ్రీను గుంతండ్ల మల్లేష్ బర్మల వెంకటేష్ కాటి కృష్ణ అశ్వాల బాలరాజ్ మెగావత్ గణేష్ నో ముల మధు తదితరులు పాల్గొన్నారు

బియ్యం ధరలు పెంచితే చర్యలు తప్పవు : కలెక్టర్

ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైస్ మిల్లర్లు బియ్యాన్ని ఎక్కువ ధరకు అమ్మితే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. శు క్రవారం ఆయన నల్గొండ జిల్లా వేములపల్లి మండలంలోని దాక్షాయిని పారాబాయిల్డ్ రైస్ మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేశారు. మిల్లులో బియ్యం మర ఆడించడం, ప్యాకింగ్, ట్రాన్స్‌పోర్ట్ తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారని, అందువల్ల బియ్యాన్ని ఎక్కువ ధరలకు అమ్మకుండా ధరను తగ్గించి విక్రయించాలని కోరారు. అలాగే నాణ్యమైన బియ్యం మార్కెట్‌లో ఉండేలా చూడాలని, బియ్యం హోల్‌సేల్, రిటైల్ అమ్మకందారులకు కూడా ఈ విషయాన్ని తెలియజేయాలని ఆయన కోరారు. జిల్లా కలెక్టర్ బియ్యం బస్తాల బరువు, ఖాళీ బస్తాలు, లేబుళ్లు, ప్యాకింగ్, ధరలను పరిశీలించారు. ఆయన వెంట రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, మిర్యాలగూడ ఆర్డీవో రమణారెడ్డి, డీఎస్ఓ వెంకటేష్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ రాంపతి నాయక్ తదితరులు ఉన్నారు.

'స్వచ్ఛత మన బాధ్యత..

జిల్లా కలెక్టర్, ఎస్పీ

వ్యక్తిగత స్వచ్ఛతతో పాటు పరిసరాల స్వచ్ఛత కూడా మన సామాజిక బాధ్యత అని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం భువనగిరి పట్టణంలోని చెరువు కట్ట పైన శ్రమదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భువనగిరి పట్టణంలోని చెరువు కట్టపైన పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టి, చెత్తాచెదారాన్ని తొలగిస్తూ పరిసరాల పరిశుభ్రతకు తమ వంతు కృషి చేశారు. ప్రజలకు పరిశుభ్రత, వ్యక్తిగత బాధ్యత, సామాజిక సేవ యొక్క ప్రాధాన్యతను తెలియజేశారు. పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ నిర్వహిస్తున్న సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా కేవలం పోలీసు సేవలకే పరిమితం కాకుండా, సమాజహితం, ప్రజా సంక్షే మం, సామాజిక బాధ్యత వంటి అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమాల ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ లక్ష్మీనారాయణ, డిఎస్పీలు రవీందర్, శ్రీనివాస్ నాయుడు, సురేష్, సీఐలు హను మంత్ నాయక్, సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, చంద్ర బాబు,ఆర్ఐ శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, రూరల్ ఎస్ఎ చ్ఓ అనిల్, మున్సిపల్ చైర్మన్ తంగళ్లపల్లి శ్రీవాణి, గ్రంథాలయ చైర్మన్ అవైస్ చిస్థి పాల్గొన్నారు.

విద్యుత్ అక్రమ కనెక్షన్లు తీసివేసి విద్యుత్ను ఆదా చేయండి

సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్

కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) అక్టోబర్ 30:
గాజులరామారంలోని ప్రభుత్వ భూములలో వెలిసిన అనేక అక్రమ బస్తీలలో ఉన్నటువంటి గృహాలకు ఎటువంటి విద్యుత్ కనెక్షన్ లేకుండా కేవలం వైర్ల ద్వారా విద్యుత్ పొందుతూ విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నారని అలాంటి కనెక్షన్లను గుర్తించి తొలగించి విద్యుత్ హోదా చేయాల్సిందిగా నేడు సిపిఐ కుత్బుల్లాపూర్ మండల సమితి ఆధ్వర్యంలో గాజులరామారం సబ్ ఇంజనీర్ సునైనా కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాజులరామారంలోని ప్రభుత్వ భూములు కబ్జాదారులు కబ్జాలు చేసి అనేక వందల ఇండ్లను నిర్మించి కొన్నింటికి ఎలాంటి విద్యుత్ మీటర్లు లేకుండా నీటికి విద్యుత్తును పొందుతున్నారని ఇప్పటికే ఎల్ నినో ప్రభావంతో నీరు లేకపోవడం వల్ల విద్యుత్తు తగినంతగా ఉత్పత్తి లేకపోవడం వల్ల విద్యుత్తును కూడా ఆదా చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కోరుతున్న సందర్భంలో ఇక్కడి విద్యుత్ అధికారులు మరియు సిబ్బంది విద్యుత్ చౌర్యాన్ని అడ్డుకొని విద్యుత్తును ఆదా చేయాల్సిన బాధ్యత ఉందని కావున భారత కమ్యూనిస్టు పార్టీ ఇచ్చిన ఫిర్యాదుకు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ మండల కార్యదర్శి కే స్వామి సహాయ కార్యదర్శి హరినాథ్ రావు కోశాధికారి సదానంద యువజన సంఘం అధ్యక్షుడు ప్రవీణ్ సిపిఐ నాయకులు నర్సింహులు శ్రీనివాస్ విట్టల్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలపై బీజేపీ పోరాటం కొనసాగుతుంది

రైతుల సమస్యలపై బీజేపీ పోరాటం కొనసాగుతుంది ఎమ్మెల్యే పాయల్ శంకర్

బేల వెలుతురు అక్టోబర్ 30:
బేల మండల కేంద్రంలో ఈరోజు నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావంతో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రైతుల సమస్యల పరిష్కారం కోసం బీజేపీ నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు. రైతులకు అండగా నిలిచి, వారి సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.మరోవైపు కేంద్ర ప్రభుత్వ నిధులతోనే రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని, కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. నీతినిజాయితీతో ప్రజాసేవ చేసే కార్యకర్తలకు బీజేపీ ఎప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని, సభ్యత్వ నమోదు కార్యక్రమంలో మన పార్టీ అత్యధిక సభ్యత్వాన్ని సాధించిందని పేర్కొన్నారు.ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని, గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల ఫలితాల కంటే మెరుగైన ఫలితాలు సాధించే దిశగా పార్టీ శ్రేణులందరూ సమన్వయంతో పనిచేయాలని కోరారు. అలాగే ఈవీఎంలు, ఎస్ఐఆం తదితర ఎన్నికల సంబంధిత అంశాలపై ప్రజల్లో చర్చలు జరిపి, వాటిపై అవగాహన కల్పించాలని పార్టీ కార్యకర్తలకు సూచించారు.ఈ సమావే శంలో బీజేపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పీఎం కిసాన్ నిధుల విడుదల.. మోదీ చిత్రపటానికి పాలాభిషేకం

గుండాల: అక్టోబర్ 30:(వెలుతురు)
:పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం 24వ విడత నిధులను ప్రధాని నరేంద్ర మోదీ విడుదల చేసిన సందర్భంగా గుండాల మండల కేంద్రంలో బీజేపీ నాయకులు సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. బీజేపీ జిల్లా కోశాధికారి గుజ్జ సోమనర్సయ్య ముఖ్య అతిథిగా పాల్గొనగా, మండల అధ్యక్షుడు పింగళి విజయభాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 9.34 కోట్ల మంది రైతుల ఖాతాల్లో రూ.18,680 కోట్లను డీబీటీ ద్వారా జమ చేస్తున్నట్లు తెలిపారు. రైతుల సంక్షేమమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు బుక్క చంద్రశేఖర్, వెంపటి సురేష్, ప్రధాన కార్యదర్శులు కప్పరి నాగిరెడ్డి, ఆవుల సాయితేజ, పోచం సోమయ్య, గౌరు శ్రీనివాస్, బండి యాదగిరి, సింగారం సోమరాజు, బంగారోజు సోమన్న, సంగీత, నర్సింగోజు పరమేశ్వరి, బాలరాజు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రాయితీపై పెసర విత్తనాల పంపిణీ

మునుగోడు,అక్టోబర్ 30,(వెలుతురు):
యాసంగి సీజన్‌లో రైతులను ఆరుతడి పంటల సాగు వైపు ప్రోత్సహించేందుకు వ్యవసాయ శాఖ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా శుక్రవారం పులిపలుపుల రైతు వేదికలో రైతులకు రాయితీపై పెసర విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మునుగోడు వ్యవసాయ సహాయ సంచాలకులు బి. వేణుగోపాల్ మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో వరి సాగుకు బదులుగా పెసర, మినుములు, శనగలు, కందులు, వేరుశనగ వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలని సూచించారు. రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని కోరారు. ఆరుతడి పంటల సాగుతో నీటి వినియోగాన్ని తగ్గించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ఎం. నరసింహగౌడ్,రైతులు గోల్డ్ లింగయ్య, శ్రీరాములు, ఖమ్మంపాటి రవి, సింగం వెంకన్న, కర్నాటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవాలి

నల్గొండలోని భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు నమోదు ప్రక్రియను ఆన్‌లైన్‌లో ప్రారంభించారు. జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి ఆధ్వర్యంలో అర్హులైన పట్టభద్రుల ఓటు నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నల్గొండ రెండో పట్టణ అధ్యక్షుడు మిర్యాల వెంకటేశం మాట్లాడుతూ పట్టణంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో అర్హులైన పట్టభద్రులను గుర్తించి, వారి వద్దకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు నేరుగా వెళ్లి అవసరమైన విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు సేకరించాలని సూచించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు నమోదు ప్రక్రియను ఆన్‌లైన్‌లో పూర్తి చేయించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకులు భవనం మధుసూదన్ రెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి యానాల కరుణాకర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు దాసరి వెంకన్న, జిల్లా కౌన్సిల్ సభ్యులు పులకరం బిక్షం, ఓబీసీ జిల్లా నాయకులు చిట్టిమల్ల సత్యనారాయణ, బీపంగి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటాం

- యాదగిరిగుట్ట పిఎసిఎస్ చైర్మన్ చీర శ్రీశైలం
- జంగంపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

యాదగిరిగుట్ట , అక్టోబర్ 30 వెలుతురు
రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని యాదగిరిగుట్ట పిఎసిఎస్ చైర్మన్ చీర శ్రీశైలం అన్నారు. శుక్రవారం యాదగిరిగుట్ట మండలం జంగంపల్లి గ్రామంలో పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దళారులకు ధాన్యం విక్రయించకుండా పిఎసిఎస్, ఐకెపి మహిళ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలోనే ధాన్యాన్ని విక్రయించాలని అన్నారు. రైతులకు గిట్టుబాటు ధర అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. రైతులు తమ ధాన్యాన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలలోనే విక్రయించి లాభాలు పొందాలని సూచించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు ఉన్నా వాటిని తక్షణమే పరిష్కరిస్తామని అన్నారు. రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని తెలిపారు. రైతులకు ఎప్పుడు ఏ సమస్య వచ్చినా పరిష్కరిస్తామని అన్నారు. రైతుల శ్రేయస్సు కోసం తమ పిఎసిఎస్ నిరంతరం కృషి చేస్తుందని అన్నారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక ప్రజా ప్రతినిధులు రైతులతో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద కొబ్బరికాయలు కొట్టి పూజలు చేసి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జంగంపల్లి సర్పంచ్ పారునంది కృష్ణ , కాల్నే భాస్కర్ , గాసిరాం నాయక్, తుమ్మల నాగరాజు, జంగంపల్లి ఉపసర్పంచ్ గుండ్ల బాలకృష్ణారెడ్డి , శివరాత్రి ఎల్లేష్ , గుంటి నరేష్, మాటూరి రాజయ్య, గుండ్ల మల్లారెడ్డి, అందె శ్రీకాంత్ , బిచ్యా నాయక్ , బొజ్జ శ్రీనివాస్, నువ్వుల రమేష్ , సీఈవో ఆంజనేయులు స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

.ఎస్ఐ శోభన్‌బాబు.

మునుగోడు, అక్టోబర్ 30 (వెలుతురు):
విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని మునుగోడు ఎస్ఐ శోభన్‌బాబు సూచించారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం, పోలీస్ ఫ్లాగ్ డే--2026 సందర్భంగా శుక్రవారం మునుగోడు మండల విద్యా వనరుల కేంద్రంలో మండల స్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆన్‌లైన్ మోసాలు, వ్యక్తిగత సమాచార దుర్వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు పంపే లింకులను తెరవడం, అనుమానాస్పద సందేశాలకు స్పందించడం చేయవద్దని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును అంధకారంలోకి నెడుతుందని, విద్యార్థులు వాటికి దూరంగా ఉంటూ చదువుపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో నిర్వహించిన పోటీల్లో సైబర్ నేరాల నివారణలో పౌరులు, పోలీసుల పాత్ర, మాదకద్రవ్యాల నిర్మూలనలో పోలీసుల బాధ్యత తదితర అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎస్ఐ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో తల్లమల్ల మల్లేశం, ప్రధానోపాధ్యాయుడు కే. బాలప్రసాద్, కుడతాల రత్నయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐసిడిఎస్ సూపర్వైజర్ మధురమ్మ ఉద్యోగ విరమణ

మోత్కూర్, అక్టోబర్ 30,వెలుతురు న్యూస్ :
మోత్కూర్ ఐసిడిఎస్ ప్రాజెక్టులో అడ్డగూడూరు మండలానికి చెందిన సూపర్వైజర్ అందం మధురమ్మ శుక్రవారం నాడు ఉద్యోగ విరమణ చేశారు. మధురమ్మ ఐ సి డి ఎస్ లో మొదట అంగన్వాడీ పంతులమ్మగా 21 సంవత్సరాలు పని చేసి తరువాత సూపర్వైజర్ గా 13 సంవత్సరములు పనిచేసి శుక్రవారం నాడు ఉద్యోగ విరమణ చేశారు. కార్యక్రమంలో మోత్కూర్ సిడిపిఓ నాజి మాట్లాడుతూ మధురమ్మ తన విధి నిర్వహణలో ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు సక్రమంగా చేరే విధంగా పనిచేశారని అన్నారు. మధురమ్మ తుంగతుర్తి, మునుగోడు, మోత్కూరు ప్రాజెక్టులలో పని చేశారని,విధి నిర్వహణలో బెస్ట్ సూపర్వైజర్ గా అవార్డు తీసుకున్నారని అన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు షమీం, జ్యోతి, వాణి,యాకూబ్ పాషా,సురేష్ అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు

అర్నాబ్ తుఫాన్ బాధితులకు అండగా మోత్కూర్ విద్యుత్ సిబ్బంది

మోత్కూర్, అక్టోబర్ 30, వెలుతురు న్యూస్ :
ఆంధ్రప్రదేశ్‌లో ఆర్నాబ్ తుఫాన్ కారణంగా దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థను పునరుద్ధరించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఆదేశాల మేరకు మోత్కూర్ విద్యుత్ సిబ్బంది పశ్చిమగోదావరి జిల్లా భీమవరం డివిజన్ కు బయలుదేరారు. తుఫాన్ ప్రభావంతో విద్యుత్ స్తంభాలు విరిగిపోవడం, విద్యుత్ తీగలు తెగిపోవడంతో సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో విద్యుత్ వ్యవస్థను పునరుద్ధరించేందుకు యాదాద్రి సర్కిల్‌లోని మోత్కూర్ సబ్ డివిజన్‌కు చెందిన ఏడుగురు కాంట్రాక్టర్లు, 50 మంది విద్యుత్ సిబ్బంది శుక్రవారం ఉదయం ఏపీకి బయలుదేరారు. విద్యుత్ మరమ్మతు పనులకు అవసరమైన డ్రిల్లింగ్ యంత్రాలు, విద్యుత్ స్తంభాలు నాటేందుకు ఉపయోగించే వాహనాలు, ఇతర పరికరాలను రెండు లారీల్లో తరలించగా, మరో రెండు వాహనాల్లో సిబ్బంది బయలుదేరారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ ఏడీ బాలు నాయక్, ఏఈ ప్రభాకర్ రెడ్డి కొబ్బరికాయలు కొట్టి, జెండా ఊపి వాహనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, భువనగిరి డివిజన్ నుండి బయలుదేరిన విద్యుత్ సిబ్బంది ఒక డి. ఇ ఇద్దరు ఎ. ఇ లు ఒక ఎస్.ఇ ల పర్యవేక్షణలో పనిచేస్తారని, తుఫాన్ కారణంగా దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థను సాధ్యమైనంత త్వరగా పునరుద్ధరించి, బాధిత ప్రాంతాల ప్రజలకు విద్యుత్ సరఫరా అందించేందుకు సిబ్బంది సేవలందించనున్నట్లు తెలిపారు. ఈ సహాయక చర్యల్లో కాంట్రాక్టర్లు జాన్ రెడ్డి, వెంకట్ రెడ్డి, రాజు, ఉమేష్, యాదయ్య, మధు, జానయ్యతో పాటు ఏఈలు సుబ్రహ్మణ్యం, నగేష్, వంశీ సబ్ ఇంజినీర్ పాల్గొననున్నారు.

లాయర్స్ యూనియన్ రామన్నపేట కోర్ట్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా గడ్డం నరసింహ

మోత్కూర్, అక్టోబర్ 30, వెలుతురు న్యూస్ :

రామన్నపేట AILU లాయర్స్ యూనియన్ కోర్ట్ కమిటీ ప్రధాన కార్యదర్శి గా గడ్డం నరసింహను ఎన్నుకున్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు మామిడి వెంకట్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కమిటీ గౌరవ అధ్యక్షులుగా పాల్వంచ జగతయ్య, అధ్యక్షలుగా యాదాసు యాదయ్య,ప్రధాన కార్యదర్శి గా గడ్డం నరసింహ, ఉపాధ్యక్షులుగా అంకెం నరేష్, సభ్యులుగా తాటిపాముల కిరణ్, జితేంధర్ ,బాలరాజు లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గడ్డం నరసింహ మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన కమిటీ సభ్యులకు, రాష్ట్ర ఉపాధ్యక్షులు మామిడి వెంకట్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఎల్‌నినో ప్రభావాన్ని సమిష్టిగా ఎదుర్కొందాం

రూ. 85 లక్షలు తాగునీటి అవసరాలకు కేటాయింపు

చౌటుప్పల్, వెలుతురు అక్టోబర్ 30:
చౌటుప్పల్ పురపాలక సంఘం కౌన్సిల్ సాధారణ సమావేశం గౌరవ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ గారి అధ్యక్షతన కౌన్సిల్ హాల్‌లో నిర్వహించబడింది. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకటేశ్వర నాయక్, వైస్ చైర్మన్ గోషిక వినయ్ కుమార్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు మరియు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు. రానున్న ఎల్‌నినో ప్రభావాల నేపథ్యంలో పట్టణంలో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టేందుకు కౌన్సిల్ రూ. 85 లక్షలు కేటాయించేందుకు ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగా కొత్త బోర్లు, మోటార్లు, పైప్‌లైన్ల ఏర్పాటు, ప్రైవేటు బోర్ల లీజు మరియు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా పనులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టనున్నారు. అలాగే వివిధ వార్డులలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టుల నిర్మాణం, ఊర చెరువు పూడికతీత తదితర అభివృద్ధి పనులకు రూ. 1.06 కోట్లకు పైగా, మున్సిపల్ కార్యాలయ సాధారణ పరిపాలన, నిర్వహణ మరియు ఇతర అవసరాలకు రూ. 28.27 లక్షల నిధులకు కలిపి మొత్తం రూ. 2.28 కోట్లకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. గౌరవ శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గారి ఆదేశాల మేరకు ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం, రాబోయే వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టడం, చౌటుప్పల్ పట్టణాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యంగా కౌన్సిల్ ఈ నిర్ణయాలు తీసుకుంది.

హాజరైన ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు:

శ్రీ కోసనం రాకేష్ రెడ్డి, శ్రీమతి పాలేపల్లి లక్ష్మి, శ్రీమతి పల్లె లావణ్య, శ్రీ ఉడుతల యాదయ్య, శ్రీ కొయ్యడ శేఖర్, శ్రీమతి ఆరె శైలజ, శ్రీమతి కాసర్ల మంజుల, శ్రీ బట్టి గాలయ్య, శ్రీమతి దేవి రమ్య, శ్రీ పాక చిరంజీవి, శ్రీమతి బత్తుల వాణి, శ్రీమతి ఉడుగు జ్యోతి, శ్రీమతి గడ్డం ఇందిర, శ్రీమతి బత్తుల జయమ్మ, శ్రీమతి చింతల ఉమామహేశ్వరి, శ్రీ బుడ్డ సురేష్, శ్రీ పిల్లలమర్రి మధుసూదన్, శ్రీ హనుమ మహమ్మద్ మరియు కో-ఆప్షన్ సభ్యులు శ్రీ పస్తం గంగారాములు, శ్రీమతి సందగట్ల విజయ, శ్రీమతి షేక్ సబీనా. హాజరైన వివిధ శాఖల అధికారులు: డాక్టర్ డి. చంద్రశేఖర్ (RMO, హెల్త్), ఎం. గోవర్ధన్ (FSO, ఫారెస్ట్), బి. నవీన్ (AEE, =ఉదీ), జి. శ్రీలక్ష్మి (AEE, ×&CADD), ఇ. గురువారావు (MEO, ఎడ్యుకేషన్), లక్ష్మీనారాయణ (EE, మిషన్ భగీరథ) తదితరులు పాల్గొన్నారు.

నీటి వృథాను అరికట్టాలి.. ప్రతి ఇంటికి ఇంకుడు గుంత తప్పనిసరి

గ్రామంలోని ప్రతి వార్డులో పర్యటిస్తూ అవగాహన కల్పించిన సర్పంచ్ గుడెపు కుమార్

గుండాల: అక్టోబర్ 30 (వెలుతురు):
యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం మరిపడిగ గ్రామంలో నీటి సంరక్షణపై గ్రామ సర్పంచ్ గుడెపు కుమార్ ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ప్రతి వార్డులో ఇంటింటికీ తిరుగుతూ ప్రజలకు నీటి ప్రాముఖ్యతను వివరిస్తూ, నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు.ప్రస్తుత పరిస్థితుల్లో భూగర్భ జలాల సంరక్షణ ఎంతో అవసరమని, వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించేందుకు ప్రతి ఇంటి వద్ద తప్పనిసరిగా ఇంకుడు గుంత నిర్మించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇంకుడు గుంతల నిర్మాణం ద్వారా వర్షపు నీరు భూమిలోకి ఇంకి భూగర్భ జలమట్టం పెరిగేందుకు దోహదపడుతుందని వివరించారు. అలాగే గ్రామంలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల్లో భాగంగా లబ్ధిదారుల ఇళ్లకు ముగ్గులు పోసి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ప్రభుత్వం కల్పిస్తున్న గృహ నిర్మాణ పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకొని త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. గ్రామాభివృద్ధితో పాటు నీటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని, ప్రతి ఇంటికి ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకొని నీటి వనరులను కాపాడుకోవాలని సర్పంచ్ గుడెపు కుమార్ కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు తేరాల కృష్ణ. కారోబార్ బూడిద రాములు. ఫీల్డ్ అసిస్టెంట్ సోనీ. గ్రామ శాఖ అధ్యక్షుడు కొండబోయిన నరసింహ. మాజీ చేనేత సహకార సంఘం చైర్మన్ దుడక ఉప్పలయ్య. నాయకులు తాళ్లపల్లి లక్ష్మీనారాయణ. మాజీ వార్డు సభ్యులు కొండబోయిన సోమయ్య. గ్రామపంచాయతీ సిబ్బంది జట్టంగి కొమురయ్య గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

ఉపాధి హామీ కూలీలకు పని కల్పించండి

ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉన్నందున ఉపాధి హామీ పథకంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించాలని కలెక్టర్ భవేష్ మిశ్రా అన్నారు. శుక్రవారం లోకేశ్వరం మండలంలోని అర్లి - గొడిసెరా గ్రామ సమీపంలో గల ప్రభుత్వ భూములను పరిశీలించారు. ఆ గ్రామ సమీపంలో గల ప్రభుత్వ భూమిని స్వాధ్యాయ పరివారం వారు ఆక్రమించుకున్నట్లు కలెక్టర్ దృష్టికి రావడంతో ఆయన అక్కడికి వెళ్లి పరిశీలించారు. అందులో మొక్కలు నాటి సంరక్షించేందుకు సిద్ధంగా ఉన్నట్లు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో 12 ఎకరాల భూమిని వారికి కేటాయించేందుకు అవకాశాలను పరిశీలించాలని తహసీల్దార్ సూర్యారావును ఆదేశించారు. అలాగే ఉపాధి హామీ పథకంలో నీటి కుంటలు, ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలని స్థానిక సర్పంచ్‌కు సూచించారు. అలాగే స్వాధ్యాయ పరివారానికి కేటాయిస్తున్న భూమి ద్వారా ప్రభుత్వానికి వచ్చే ఆదాయాన్ని పరిశీలించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సూర్యారావు, ఎంపీఈఓ సాల్మన్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ ఘర్ నిర్మాణానికి శంకుస్థాపన

జగిత్యాల పట్టణంలోని తీన్ ఖని వద్ద రూ.75 లక్షల వ్యయంతో చేపట్టనున్న ఉర్దూ ఘర్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ సమీండ్ల వాణి శుక్రవారం శంకుస్థాపన చేశారు. అనంతరం షాదీ ముబారక్ పథకం కింద 63 మంది ముస్లిం లబ్ధిదారులకు రూ.63 లక్షల విలువైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కులమతాలకు అతీతంగా జగిత్యాల నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. పట్టణంలో రూ.235 కోట్లతో 400 పడకల ఆసుపత్రి, రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులను ప్రారంభించినట్లు చెప్పారు. అలాగే అర్బన్ హౌసింగ్ కాలనీలో మసీదు నిర్మాణం కోసం స్థలంతో పాటు నిధులు మంజూరు చేశామని తెలిపారు. చారిత్రక జగిత్యాల ఖిల్లా అభివృద్ధికి రూ.40 లక్షలు మంజూరయ్యాయని, త్వరలోనే భూమిపూజ చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ జీనత్ పర్వీన్ మున్నా, ఎస్ఈ రహమాన్, ఈఈ లక్ష్మణ్ రావు, డిఈ మిలింద్, ఎమ్మార్వో రామ్మోహన్, స్థానిక కౌన్సిలర్లు, కాంగ్రెస్, ఎంఐఎం నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలతో ఘనంగా కాంగ్రెస్ నేత ఉజ్వల్‌రెడ్డి జన్మదిన వేడుకలు

- ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ
- అన్నదానం, రక్తదాన శిబిరం నిర్వహణ

జహీరాబాద్ వెలుతురు అక్టోబరు 30:
కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు సిద్ధం ఉజ్వల్‌రెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని జహీరాబాద్ పట్టణంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా వేడుకలు నిర్వహించారు. జన్మదిన వేడుకలను కేవలం సంబరాలకే పరిమితం చేయకుండా ప్రజలకు ఉపయోగపడే సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టి ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ప్రజల కోసం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే స్థానిక వాసవీ కళ్యాణ మండపంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయగా, యువకులు, కాంగ్రెస్ కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని, పేదలకు సేవ చేయడం, ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. తమ నాయకుడి జన్మదినాన్ని

సేవా కార్యక్రమాల ద్వారా జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్, వైస్ చైర్మన్ శిరీష సురేందర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, సీనియర్ నాయకులు పి.శ్రీకాంత్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు నాగిరెడ్డి, కౌన్సిలర్లు జమిలాలోద్దిన్, శ్రీధర్‌రెడ్డి, మహమ్మద్ జాఫర్, జావిద్, అరుణ్‌కుమార్, అక్కాని, అక్రమ్, జహంగీర్, నిజాం, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి హర్షవర్ధన్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు జగదీశ్వర్‌రెడ్డి, రవీందర్ చౌహాన్, జిల్లా ఉపాధ్యక్షుడు నరేష్ బబ్లూ, ఎస్టీ సెల్ పార్లమెంట్ కోఆర్డినేటర్ రాజు నాయక్, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, మండలాల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సునీల్, సుభాష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే సీనియర్ కాంగ్రెస్ నాయకులు అక్తర్ గోరి, అశ్విన్ పాటిల్, ఇమామ్ పటేల్, మల్లికార్జున్, వెంకట్‌రెడ్డి, బర్కత్, సంతోష్‌రెడ్డి, జగదీశ్, రాములు, పాండు యాదవ్, పవన్ యాదవ్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

ధర్మసాగర్ గ్రామ పంచాయితీ పాలకవర్గం భేష్

ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్

కొడిపల్లి వెలుతురు అక్టోబర్ 30:
కొడిపల్లి మండల పరిధిలోని ధర్మసాగర్ గ్రామపంచాయతీని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలకు కావలసిన నీటి వసతులు గాని, మురికి కాలువల మెయింటెనెన్స్ కానీ గ్రామ సర్పంచ్ శివానంద్ రెడ్డి సమక్షంలో ఉప సర్పంచ్, గ్రామ వార్డు మెంబర్లు అందరూ కూడా సమిష్టిగా పనిచేస్తూ ధర్మసాగర్ గ్రామాన్ని ఆదర్శంగా ఉంచుతున్నారని వారిని కొనియాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎలినినో ప్రభావంతో భూగర్భ జలాలు అడుగంటకుండా ప్రతి ఇంటిలో ఇంకుడు గుంత నిర్మాణం ఏర్పాటు చేయాలని వారికి సూచించారు. అదేవిధంగా ఇందిరమ్మ

ఇండ్లు వచ్చినవారు త్వరగా పూర్తిచేయాలని, రానివారి లిస్టును తయారు చేయాలని వారిని ఎంపీడీవో కార్యాలయంలో ఆన్లైన్లో అప్లోడ్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శివానంద్ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీ ఓ రామారావు, మిషన్ భగీరథ ఏఈ, ఉప సర్పంచ్, వార్డు మెంబర్లు, పంచాయతీ కార్యదర్శి మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఎల్‌నినో ప్రభావంతో రైతులకు కష్టాలు

- విద్యుత్, ఎరువుల కొరతతో అన్నదాతల అవస్థలు
- రైతుల విశ్వాసాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే
- బీఆర్ఎస్ నాయకుడు సయ్యద్ అత్తర్

జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 30:
ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలోని రైతులు దిక్కుతోచని పరిస్థితులను ఎదుర్కొంటున్నారని, రైతుల్లో విశ్వాసాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని కోహీర్ మండల బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సయ్యద్ అత్తర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సాగు ప్రారంభం నుంచి అనేక సమస్యలతో సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బోర్‌వెల్ల ద్వారా పంటలకు నీరందించేందుకు అవసరమైన సమయంలో త్రీ-ఫేజ్ విద్యుత్ సరఫరా అవుతుందో లేదోనని రైతులు ప్రతిరోజూ ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ఉదయం నిద్రలేవగానే విద్యుత్ సరఫరా పరిస్థితిని తెలుసుకోవడంతోనే రైతుల దినచర్య ప్రారంభమవుతోందన్నారు. విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోతే నీటిపారుదల వాయిదా వేయాల్సి వస్తోందని, ఫలితంగా పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఒక్కరోజు నీరు అందకపోయినా పంట ఎదుగుదలపై ప్రభావం పడి దిగుబడులు తగ్గే పరిస్థితి ఏర్పడుతోందన్నారు. మరోవైపు ఎరువుల కోసం రైతులు ఒక డీలర్ నుంచి మరో డీలర్ వద్దకు గంటల తరబడి తిరుగుతున్నారని, చివరకు ఎరువుల నిల్వలు లేవని లేదా పరిమితంగా

మాత్రమే అందుబాటులో ఉన్నాయని సమాధానం ఎదురవుతోందని అన్నారు. ఎరువుల కొరత, సరఫరాలో జాప్యం కారణంగా సాగు పనులు ఆలస్యమవుతున్నాయని, తప్పనిసరి పరిస్థితుల్లో రైతులు బహిరంగ మార్కెట్లో అధిక ధరలకు ఎరువులు కొనుగోలు చేయాల్సి వస్తోందని తెలిపారు. దీంతో ఇప్పటికే పెట్టుబడుల భారంతో ఇబ్బందులు పడుతున్న రైతులకు ఆర్థిక భారం మరింత పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్, ఎరువుల సమస్యలు నిరంతరం ఎదురవుతుండటంతో వ్యవసాయ వ్యవస్థపై రైతుల్లో నమ్మకం సన్నగిల్లుతోందని సయ్యద్ అత్తర్ అన్నారు. సాగుకు అవసరమైన ప్రాథమిక వనరులు సరైన సమయంలో అందుబాటులో ఉంటాయనే భరోసా రైతులకు లేకుండా పోతోందని పేర్కొన్నారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో విత్తనాలు వేయడాన్ని వాయిదా వేయాలంటూ ముఖ్యమంత్రి ఇటీవల చేసిన సూచన రైతుల్లో మరింత ఆందోళనకు కారణమైందని అన్నారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులకు స్పష్టమైన మార్గదర్శకాలు అందించడంతో పాటు, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, నిరంతర విద్యుత్ సరఫరా అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సయ్యద్ అత్తర్ డిమాండ్ చేశారు. రైతులకు భరోసా కల్పించి వారి పెట్టుబడులు, పంటలను కాపాడాలని ఆయన కోరారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం

గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై బాలికలకు అవగాహన కల్పించిన న్యాయమూర్తులు

జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 30:
సురక్ష బచపన్ అభియాన్‌లో భాగంగా విద్యార్థులకు వివిధ చట్టాలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక సదస్సులు నిర్వహించారు. జహీరాబాద్‌లోని శ్రీ చైతన్య ఉన్నత పాఠశాలలో సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ జి. కవితాదేవి, బీటీఆర్ పాఠశాలలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బ్లెస్సి విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుపై శ్రద్ధ వహిస్తూ క్రమశిక్షణతో మెలగాలని, పెద్దలను, తోటివారిని గౌరవించాలని సూచించారు. చదువుతోపాటు సాధారణ చట్టాలపై కూడా అవగాహన పెంపొందించుకోవాలని తెలిపారు. ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని, దాని సాధనకు ఉపాధ్యాయుల సహకారం తీసుకుంటూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ మధ్య తేడాలను వివరించి, లైంగిక వేధింపుల పట్ల

అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బాలికలు, మహిళల పట్ల ఎవరైనా అసభ్యంగా లేదా దురుసుగా ప్రవర్తిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని తెలిపారు. విద్యార్థులు ఎలాంటి వ్యసనాలకు బానిసలు కాకుండా తమ భవిష్యత్తుపై దృష్టి సారించాలని హితవు పలికారు. ఈ సదస్సుల్లో బాల్య వివాహాల నిరోధక చట్టం, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన చట్టం, పిల్లలపై లైంగిక నేరాల నుంచి రక్షణ కల్పించే పోక్సో (పోక్సో) చట్టం తదితర అంశాలపై విస్తృతంగా వివరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, లీగల్ సర్వీసెస్ సిబ్బంది, పారాలీగల్ వాలంటీర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసు అడ్డం పెట్టుకుని రూ.5 లక్షల వసూళ్లకు యత్నం!

- అక్రమ వసూళ్లను ప్రశ్నిస్తే తప్పుడు కేసులతో వేధింపులా?
- బాధితుడి నుంచి డబ్బుల డిమాండ్‌పై గ్రామస్తుల ఆరోపణలు
- డీఎస్పీని ఆశ్రయించిన సజ్జాపూర్ గ్రామస్తులు

జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 30:
అట్రాసిటీ చట్టాన్ని అడ్డం పెట్టుకుని బెదిరింపులు, బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడుతున్నారంటూ సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం సజ్జాపూర్ గ్రామానికి చెందిన పలువురు గ్రామస్తులు తీవ్ర ఆరోపణలు చేశారు. ఇటీవల ఓ ప్రజాప్రతినిధుల పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని, వాటిని ప్రశ్నించిన వారిపై అట్రాసిటీ కేసులు నమోదు చేయిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ ఉపసర్పంచ్ మైసయ్య చిన్నచిన్న పనులు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు జారీ వంటి విషయాల్లోనూ ప్రజల నుంచి వేలాది రూపాయల వసూలు చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంపై గ్రామస్తుల ఫిర్యాదు మేరకు ప్రసాద్ రెడ్డి అనే వ్యక్తి ఉపసర్పంచ్‌ను నిలదీయడంతో వివాదం మొదలైనట్లు తెలిపారు. తన అక్రమ వసూళ్లను ప్రశ్నించారనే కక్షతోనే ప్రసాద్ రెడ్డిపై కోహీర్ పోలీస్ స్టేషన్‌లో అట్రాసిటీ కేసు పెట్టించారని ఆరోపించారు. ఇదిలా ఉండగా, కేసును వెనక్కి

తీసుకునే పేరుతో కోహీర్ మున్సిపాలిటీ రెండో వార్డు కౌన్సిలర్ సంపత్ బాధితుడు ప్రసాద్ రెడ్డికి వాట్సాప్ కాల్ చేసి ఏకంగా రూ.5 లక్షలు డిమాండ్ చేసినట్లు గ్రామస్తులు ఆరోపించడం ఈ వ్యవహారంలో మరింత కలకలం రేపుతోంది. అట్రాసిటీ కేసును పరిష్కరించుకునేందుకు ఇంత భారీ మొత్తంలో డబ్బులు అడగడం వెనుక అసలు ఉద్దేశం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. అట్రాసిటీ వంటి సున్నితమైన చట్టాలను నిజమైన బాధితుల రక్షణకు ఉపయోగించాల్సింది పోయి, వ్యక్తిగత కక్షలు తీర్చుకోవడానికి లేదా డబ్బులు వసూలు చేయడానికి ఉపయోగిస్తున్నారనే ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయని గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం సజ్జాపూర్ గ్రామస్తులంతా ఏకతాటిపైకి వచ్చి జహీరాబాద్ డీఎస్పీని కలిసి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఉపసర్పంచ్ మైసయ్య, కౌన్సిలర్ సంపత్ పాత్రపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి, అక్రమ వసూళ్లు, బెదిరింపులకు పాల్పడినట్లు తేలితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ప్రసాద్ రెడ్డిపై నమోదైన కేసు వెనుక ఉన్న వాస్తవాలను విచారించి, చట్టప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

- CPS రద్దు, పాత పెన్షన్ అమలు చేయాలి
- EHS, PRC, DA బకాయిలు, బదిలీలు, పదోన్నతుల సమస్యలను పరిష్కరించాలి
- TTU జిల్లా అధ్యక్షుడు పి. ప్రసాద్

జహీరాబాద్ వెలుతురు, అక్టోబర్ 30:
ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని తెలంగాణ టీచర్స్ యూనియన్ (టిటియు) సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పి. ప్రసాద్ విమర్శించారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకుండా జాప్యం చేస్తోందని ఆయన ఆరోపించారు. జహీరాబాద్ పట్టణంలోని నంబర్ 3 పాఠశాలలో గురువారం నిర్వహించిన జహీరాబాద్ డివిజన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా తెలంగాణ టీచర్స్ యూనియన్ సంగారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల నూతన కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల కార్యక్రమానికి పరిశీలకులుగా జిల్లా సహాధ్యక్షుడు బట్టు నర్సింహారాజు, జిల్లా కార్యదర్శి ఎం. కోటేశ్వర్, జిల్లా ఉపాధ్యక్షుడు టి. గౌతమ్ కుమార్ హాజరయ్యారు. జిల్లా అధ్యక్షుడు పి. ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. శెట్టి రవికుమార్ తదితరుల సమక్షంలో ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు.

జహీరాబాద్ మండల నూతన కమిటీ అధ్యక్షుడిగా ఎస్. అశోక్ (జెడ్పీహెచ్ఎస్ హుగ్గెల్లి), ఉపాధ్యక్షురాలిగా జె. మేరీ (ఎంపీయూపీఎస్ నంబర్ 3), ప్రధాన కార్యదర్శిగా బి. జనార్దన్ (ఎంపీపీఎస్ మల్కేపల్లి), కోశాధికారిగా టి. గౌతమ్ కుమార్ (ఎంపీయూపీఎస్ బుర్దిపాడ్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదేవిధంగా మొగుడంపల్లి మండల కమిటీ అధ్యక్షురాలిగా కె. సురేఖ (ఎంపీపీఎస్ జంగర్ బౌలి తాండ), ఉపాధ్యక్షుడిగా డి. ధనరాజ్ (ఎంపీపీఎస్ మొగుడంపల్లి), ప్రధాన కార్యదర్శిగా ఎం. సుభాష్ (ఎంపీయూపీఎస్ జెరంగ్ నగర్), కోశాధికారిగా ఎం. సాయి (ఎంపీపీఎస్ తొట్టి తాండ), సహాయ కార్యదర్శిగా యేస్సయ్య (ఎంపీపీఎస్ మన్నాపూర్) ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు పి. ప్రసాద్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు హెల్త్ కార్డుల ద్వారా వైద్య సేవలు పొందడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఎంపిక చేసిన ఆస్పత్రుల్లో కూడా కార్డులు పనిచేయకపోవడంతో వైద్య చికిత్సల కోసం ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పటికే సమర్పించిన వైద్య రీయింబర్స్‌మెంట్ బిల్లులు కూడా పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. పాత విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఆర్జిత, డీఏ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను సైతం ఆలస్యం చేయకుండా చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. శెట్టి రవికుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం యూనియన్ నిరంతరం కృషి చేస్తోందని అన్నారు. సంఘం నిజాయితీగా, నిబద్ధతతో పనిచేయడమే దాని బలమని నిరూపించామని పేర్కొన్నారు. జహీరాబాద్ డివిజన్ పరిధిలో యూనియన్‌ను మరింత బలోపేతం చేసి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా కృషి చేస్తామని తెలిపారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయుల సంక్షేమం, హక్కుల పరిరక్షణతో పాటు విద్యారంగ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మొగులయ్య, జిల్లా సహాధ్యక్షుడు బట్టు నర్సింహారాజు, జహీరాబాద్ నాయకులు అశోక్ కుమార్, గౌతమ్ కుమార్, జనార్దన్, సురేఖ, మేరీ, ధనరాజ్, రాజు, సాయి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

చౌటుప్పల్ వెలుతురు అక్టోబర్ 30:
చౌటుప్పల్ మండలంలోని మల్కాపురం, ఎనగంటి తండా, అల్లాపురం, పీపల్ పహాడ్, దేవలమ్మ నాగారం, దామెర ఐకెపి సెంటర్లు మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య గారు ప్రారంభించడం జరిగింది

ఇట్టి ప్రారంభోత్సవ కార్యక్రమంలో గ్రామాల చైర్మన్ మస్తాన్ బాబు గారు , మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి గారు సంబంధిత గ్రామాల సర్పంచ్ లు ఉప సర్పంచ్ లు మార్కెటింగ్ డైరెక్టర్లు గ్రామాల డైరెక్టర్లు మరియు మండల సమాఖ్య అధ్యక్షురాలు అలివేలు కోఆర్డినేటర్ సుమలత, ఏపీఎం యాదయ్య సీసీలు నరసింహ కల్పన గ్రామాల పాలకవర్గం సభ్యులు, మహిళా సంఘ సభ్యులు మరియు రైతులు పాల్గొనడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ గారు మాట్లాడుతూ ధాన్యాన్ని ఎప్పటికప్పుడు కొనుగోలు చేసి తరలించాలని, రైతులకు సకాలంలో అమౌంట్ వచ్చే విధంగా చూడాలని అదేవిధంగా రైతులకు వర్షం వచ్చే టైంలో పట్టాలను అందించాలని తెలియజేశారు రైతులందరూ ధాన్యాన్ని ఎండబెట్టి తూర్పాల పట్టి శుభ్రం చేయాలని 17% తేమ శాతం ఉండే విధంగా చూసుకోవాలని తెలియజేయడం జరిగింది ఏమైనా ఇబ్బందులు ఉంటే వెంటనే సంబంధిత అధికారులు స్పందించి పరిష్కరించాలని నా వద్దకు వచ్చిన నేను కూడా మీకు ఎప్పుడు అందుబాటులో ఉంటానని తెలియజేయడం జరిగింది.

నవంబర్ 29న నిర్వహించనున్న సబ్ ఇన్‌స్పెక్టర్ ప్రిలిమ్స్ పరీక్షలను వాయిదా వేయాలి

బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్

హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 30:
ఒకే రోజు రెండు కీలక పరీక్షలు నిర్వహించడం వల్ల అభ్యర్థులకు తీవ్ర నష్టం జరిగే అవకాశం ఉందని నవంబర్ 29న బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించే ఆల్ ఇండియా బార్ ఎగ్జామినేషన్‌తో పాటు అదే రోజు సబ్ ఇన్‌స్పెక్టర్ పరీక్షను నిర్వహించేందుకు నిర్ణయించడం పట్ల నిరుద్యోగ అభ్యర్థులు నష్టపోయే ప్రమాదం ఉందని ఈ రెండు పరీక్షలకు అర్హత కలిగిన అనేకమంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని.ఒకే రోజు రెండు పరీక్షలు ఉండటంతో అభ్యర్థులు ఏదో ఒక పరీక్షకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతోందనీ కావున ప్రభుత్వం,సంబంధిత పరీక్షల నిర్వహణ అధికారులు నిరుద్యోగ అభ్యర్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని నవంబర్ 29న నిర్వహించనున్న సబ్ ఇన్‌స్పెక్టర్ పరీక్షను వాయిదా వేసి,మరో తేదీని ప్రకటించాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ ఆధ్వర్యంలో ఈరోజు పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు కార్యాలయంలో విజ్ఞప్తిచేశారు.జి.రవి కిరణ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు

కాంట్రాక్టు అధ్యాపకులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలి

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు
- 12 యూనివర్సిటీల్లో పని చేస్తున్న 1,200 మంది అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

బషీర్ బాగ్ : అక్టోబర్ 30 (వెలుతురు)
రాష్ట్రంలో విద్యా వ్యవస్థ బలోపేతం కావాలంటే ఉన్నత విద్యారంగాన్ని మరింత మెరుగుపరచాల్సిన అవసరం ఉందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు అన్నారు. యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులర్ చేస్తామని హామీలిచ్చి ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయని విమర్శించారు. ఉన్నత విద్యను అభ్యసించిన అధ్యాపకులు చాలీచాలని వేతనాలతో, ఉద్యోగ భద్రత లేకుండా పనిచేస్తూ విద్యార్థులకు బోధనలు అందిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ కాంట్రాక్ట్ తెలంగాణ స్టేట్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పరశురామ్ అధ్యక్షతన నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంతో కలిసి రామచందర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలోని 12 యూనివర్సిటీల్లో పనిచేస్తున్న 1,200 మంది కాంట్రాక్టు అధ్యాపకులను వెంటనే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. రెగ్యులరైజేషన్ ప్రక్రియలో ఏవైనా సాంకేతిక సమస్యలు ఉంటే కేంద్ర ప్రభుత్వం తరఫున అవసరమైన సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని హామీ ఇచ్చారు. ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయకపోవడంతో సమస్య మరింత తీవ్రమైందన్నారు. గత 15 ఏళ్లుగా కాంట్రాక్టు అధ్యాపకులతోనే బోధన కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. వారిని రెగ్యులర్ చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. రెగ్యులరైజేషన్ పూర్తయ్యే వరకు ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు ఏడో వేతన సవరణ సంఘం (పీఆర్సీ) ప్రకారం పే స్కేల్ అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ.. యూనివర్సిటీల వైస్‌ఛాన్స్‌లర్లు ముఖ్యమంత్రిని తప్పుదోవ పట్టిస్తూ కాంట్రాక్టు అధ్యాపకుల రెగ్యులరైజేషన్‌కు అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం భర్తీ చేయనున్న పోస్టులను కొందరు వీసీలు అమ్ముకోవాలని చూస్తున్నారని విమర్శించారు. ఎంతోమంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన అధ్యాపకుల సేవలను గుర్తించి వారిని రెగ్యులర్ చేయాలని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. ఈ సమావేశంలో అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్స్ డా. కరుణాకర్ రావు, డా. ధర్మతేజ, జనరల్ సెక్రటరీ డా. బి. నిరంజన్, ఉపాధ్యక్షులు డా. భూమయ్య, డా. డి. తిరుపతి, డా. వినీత పాండే, డా. విజయేందర్ రెడ్డి,కార్యదర్శులు డా. టి. శ్రీశైలం, డా. శివ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

ప్రజాస్వామ్యంలో గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

బీజేపీ నాయకులు బొంగు రఘు గౌడ్

హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 30:
ఎన్నికల్లో గెలిస్తే ప్రజాస్వామ్య విజయం... ఓడిపోతే ఈవీఎంలపై అనుమానాలా? ఇదేనా ప్రజాస్వామ్యంపై మీకున్న గౌరవం? భారతదేశంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ విధానం అమల్లోకి వచ్చినప్పటి నుంచి అనేక ఎన్నికలు ఈవీఎంల ద్వారానే జరిగాయి. 2004, 2009 సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ కూటమి ఈవీఎంలుల ద్వారానే విజయం సాధించి పదేళ్లపాటు కేంద్రంలో అధికారాన్ని అనుభవించింది. 2014 ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ అధికారంలో ఉండగానే ఈవీఎంల ద్వారా ఎన్నికలను ఎదుర్కొని ఓటమి పాలైంది. అప్పుడు ఈవీఎంలు నమ్మదగినవే... ఇప్పుడు మాత్రం నమ్మదగినవి కావా?
ఒక రాజకీయ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు దేశంలోని ఎన్నికల వ్యవస్థలు, రాజ్యాంగబద్ధ సంస్థలు సక్రమంగా పనిచేస్తున్నాయని చెప్పడం, అధికారం కోల్పోయినప్పుడు అవే వ్యవస్థలపై అనుమానాలు వ్యక్తం చేయడం ఎంతవరకు సమంజసం?ప్రజాస్వామ్యం అంటే మనకు అనుకూలమైన ఫలితం వచ్చినప్పుడు మాత్రమే అంగీకరించడం కాదు. మనకు వ్యతిరేకంగా వచ్చిన ప్రజాతీర్పును కూడా గౌరవించడం.
కొన్ని ముఖ్యమైన ప్రశ్నలు...ఈవీఎంలుద్వారా గెలిచినప్పుడు ప్రజల తీర్పు అని సంబరాలు చేసుకుని, ఓడిపోయినప్పుడు మాత్రం ఈవీఎంలుపై ఆరోపణలు చేయడం ద్వంద్వ వైఖరి కాదా? ఈవీఎంలపై నిజంగా సాంకేతికపరమైన అనుమానాలు ఉంటే, వాటిని నిరూపించడానికి రాజ్యాంగబద్ధమైన, చట్టబద్ధమైన మార్గాలు ఉన్నాయి కదా? వాటిని ఎందుకు సమర్థంగా వినియోగించుకోకూడదు?ఎన్నికల సంఘం వంటి స్వతంత్ర రాజ్యాంగ సంస్థలపై ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం ద్వారా ప్రజల్లో అనవసరమైన అపోహలు సృష్టించడం ఎంతవరకు బాధ్యతాయుతమైన రాజకీయమవుతుంది?ఎన్నికల్లో ఓటమికి గల కారణాలను విశ్లేషించుకోవడం, ప్రజల విశ్వాసాన్ని తిరిగి పొందడం మానేసి, ఎన్నికల విధానంపైనే నిందలు వేయడం వల్ల పార్టీకి ఏమి ప్రయోజనం? బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు జరిగితేనే ప్రజాస్వామ్యం బతుకుతుందా? ఈవీఎంలతో ఎన్నికలు జరిగితే ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుందా?బ్యాలెట్ ఎన్నికల ఫలితాలు ఏం చెబుతున్నాయి?ఇటీవల అక్టోబర్ 23న ఉత్తరప్రదేశ్, బీహార్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో జరిగిన 28 ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలు బ్యాలెట్ పేపర్ల ద్వారానే జరిగాయి.అక్టోబర్ 29న వెలువడిన ఫలితాల్లో ఎన్డీఏ కూటమి 16 స్థానాలు గెలుచుకోగా, బీజేపీ ఒక్కటే 13 స్థానాలను కైవసం చేసుకుంది. కాంగ్రెస్‌కు మొత్తం నాలుగు రాష్ట్రాల్లో ఒక స్థానం మాత్రమే దక్కింది. ముఖ్యంగా కాంగ్రెస్ అధికారంలో ఉన్న కర్ణాటకలో నాలుగు స్థానాలనూ బీజేపీ--కేడీఎస్ కూటమి గెలుచుకుని కాంగ్రెస్‌కు ఒక్క స్థానం కూడా దక్కకుండా చేసింది. ఈ ఫలితాలు ఒక విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. బ్యాలెట్ పద్ధతిలోనూ ప్రజల మద్దతు పొందినవారే విజయం సాధిస్తారు. ఈవీఎంలుఅయినా బ్యాలెట్ అయినా ప్రజల తీర్పు కీలకం. అయితే ఈ 28 స్థానాలు ఉపాధ్యాయులు, పట్టభద్రుల ప్రత్యేక నియోజకవర్గాలకు సంబంధించినవని కూడా గుర్తుంచుకోవాలి. ఇవి సాధారణ అసెంబ్లీ లేదా లోక్‌సభ ఎన్నికలు కావు.ప్రజాస్వామ్యంలో బాధ్యతాయుతమైన ప్రతిపక్షం అవసరంప్రజాస్వామ్యంలో అధికార పక్షానికి ఎంత బాధ్యత ఉందో ప్రతిపక్షానికీ అంతే బాధ్యత ఉంటుంది. ప్రభుత్వ తప్పులను ప్రశ్నించడం ప్రతిపక్షాల హక్కు మాత్రమే కాదు, బాధ్యత కూడా. కానీ ప్రతి ఓటమికీ వ్యవస్థలను నిందించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం.ఎన్నికల విధానంలో నిజంగా లోపాలు ఉంటే వాటిని ఆధారాలతో బయటపెట్టాలి. పారదర్శకత కోసం సూచనలు చేయాలి. అవసరమైతే చట్టబద్ధంగా పోరాడాలి. లోపాలను సరిదిద్దాలని కోరాలి. కానీ ప్రజాస్వామ్య సంస్థలపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని దెబ్బతీసేలా దుష్ప్రచారం చేయకూడదు.రాజ్యాంగం, ఎన్నికల సంఘం, న్యాయవ్యవస్థ వంటి సంస్థలు ఏ ఒక్క రాజకీయ పార్టీకి చెందినవి కావు. అవి దేశ ప్రజాస్వామ్యానికి సంబంధించినవి. ప్రభుత్వాలు మారవచ్చు, పార్టీలు గెలవవచ్చు, ఓడిపోవచ్చు. కానీ వ్యవస్థలపై ప్రజల విశ్వాసం మాత్రం నిలబడాలి.చివరిగా ఒక్క మాట...ఎన్నికల్లో గెలవాలంటే ప్రజల మనసులు గెలవాలి. ఓడిపోతే ఆత్మపరిశీలన చేసుకోవాలి. ప్రజల తీర్పును గౌరవించాలి. ప్రజాస్వామ్యంలో అధికారమే శాశ్వతం కాదు... ప్రజలే శాశ్వతం.ఈవీఎంలైనా... బ్యాలెట్ పేపర్లైనా... ఓటు వేసేది ప్రజలే, తీర్పు ఇచ్చేది ప్రజలే! ప్రజాస్వామ్యాన్ని గౌరవిద్దాం రాజ్యాంగ వ్యవస్థలను కాపాడుకుందాం ప్రజల తీర్పును శిరసావహిద్దాం!

స్వెటర్ల వ్యాపారులకు అండగా నిలిచిన కార్పొరేటర్ కెఎపిపి చంద్ర (టింకు)

- ఉన్ని దుస్తుల విక్రయాలకు మేయర్, కమిషనర్‌లతో మాట్లాడి అనుమతి ఇప్పించిన కార్పొరేటర్ టింకు..

కరీంనగర్ వెలుతురు అక్టోబర్ 30:
చలికాలంలో తెలంగాణ అమరవీరుల స్తూపం పక్కన, పాత మున్సిపల్ గెస్ట్ హౌజ్ వద్ద, ఐడిసిసి గోడను ఆనుకొని స్వెటర్లు, టోపీలు, బ్లాంకెట్లు అమ్ముకునే చిన్న తరహా వ్యాపారులకు 37వ డివిజన్ కార్పొరేటర్ కెఎపిపి చంద్ర (టింకు) అండగా నిలిచారు. 37, 38వ డివిజన్లకు చెందిన జాకీర్ ఖాన్‌తో పాటు పలువురు రిటైల్ ఉన్ని దుస్తుల వ్యాపారులు తమకు క్రయవిక్రయాలు చేసుకునేందుకు అనుమతి ఇప్పించాలని కార్పొరేటర్ టింకును అభ్యర్థించారు. వ్యాపారులలో అధిక శాతం మంది తమ డివిజన్ల వారే కావడంతో స్పందించిన ఆయన, వెంటనే మేయర్ కొలగాని శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్‌లతో మాట్లాడారు. చలికాలం ముగిసేంత వరకు వ్యాపారులు పాత మున్సిపల్ గెస్ట్ హౌస్ వద్ద ఎప్పటిలాగే వ్యాపారం చేసుకునేందుకు వెసులుబాటు కల్పించాలని విన్నవించారు. కార్పొరేటర్ అభ్యర్థనకు సానుకూలంగా స్పందించిన అధికారులు మున్సిపల్ శాఖ ద్వారా వ్యాపారాలకు అనుమతి మంజూరు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ టింకు మాట్లాడుతూ.. మున్సిపల్ శాఖ నుండి తాము కష్టపడి అనుమతి ఇప్పిస్తే, కొందరు ఎంఐఎం నాయకులు సోషల్ మీడియా వేదికగా తామే ఈ అనుమతులు ఇప్పించామని డబ్బా కొట్టుకోవడం సరికాదన్నారు. ఎంఐఎం నేతలకు, కార్పొరేటర్లకు అబద్ధాలు చెప్పడం అలవాటుగా మారిందని విమర్శించారు. డివిజన్ ప్రజల సంక్షేమం, శ్రేయస్సు కోసం తాను అహర్నిశలు కృషి చేస్తున్నానని, ప్రజలు ఎల్లప్పుడూ అభివృద్ధి వైపే నిలుస్తారు తప్ప అసత్య ప్రచారాలను నమ్మరని ఎంఐఎం నాయకులకు హితవు పలికారు. మేయర్, కమిషనర్ కలిసిన వారిలో బిజెపి మైనార్టీ మోర్చా రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ఎండి ముజీబ్ , పో ఆప్షన్ సభ్యులు బల్వీర్ సింగ్ , పలువురు మైనార్టీ నేతలు ఉన్నారు.

రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం: రాష్ట్ర ప్రభుత్వ విప్

ఎలినో పరిస్థితులను ఎదుర్కునేందుకు రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమ ధ్యేయంగా చిత్తశుద్ధితో కార్యాచరణ రూపొందిస్తోందని రాష్ట్ర ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావు అన్నారు. చిన్నకల్వల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం చిన్న బొంకూర్, పేరుకపల్లి, రెబ్బల్దేవ్ పల్లి గ్రామాలలో వడ్ల కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత పరిస్థితుల్లో వడ్లకు ఉన్న డిమాండ్ ను ఆసరా చేసుకొని మధ్య దళారులు రైతులను మోసం చేసే అవకాశాలు ఉన్నాయని, అందువల్ల రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. గోటీ పేరిట రైతులను మోసం చేస్తే సహించేది లేదన్నారు. అలాగే వ్యాపారులు, దళారులు సిండికేట్ గా మారి వడ్ల ధర తగ్గించేందుకు కుట్రలు పన్నుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందని, ఇలాంటి ప్రయత్నాలను దళారులు మానుకోవాలని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వ వడ్ల కొనుగోలు సెంటర్లలో మద్దతు ధరతో పాటు రూ. 500 బోనస్ వెంటనే చెల్లించడం జరుగుతుందన్నారు. ఇంతకంటే ఎక్కువ రేటు లభిస్తే రైతులు అవకాశాలను వదులుకోవద్దని ఆయన సూచించారు. అయితే వెంటనే నగదు అందజేస్తేనే వడ్లు లోడ్ చేయాలని ఆయన అన్నారు. వచ్చే యాసంగి పంట కాలానికి ఎట్టి పరిస్థితుల్లోనూ వరి పంట వేయవద్దని కోరారు. కేవలం తాగునీటి అవసరాలకే ఎస్సారెస్పీ నీటిని వినియోగించడం జరుగుతుందన్నారు. ఆరుతడి పంటలు వేసుకునే రైతులందరికీ తమ ప్రభుత్వం అండగా ఉంటుందని, అవసరమైన సహాయ సహకారాల తోపాటు పంటలకు మద్దతు ధర చెల్లించడం జరుగుతుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రకాష్ రావు, సింగిల్ విండో చైర్మన్ గౌరవెల్లి మురళీధర్ రావు, మండల పార్టీ అధ్యక్షులు చిలుక సతీష్, సింగిల్ విండో డైరెక్టర్లు, కార్యదర్శి, సర్పంచులు, మాజీ సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటర్ల నమోదు పారదర్శకంగా చేపట్టాలి

పట్టభద్రుల ఓటర్ల నమోదు ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని, ఓటరు నమోదుకు తప్పుడు ధృవపత్రాలు సమర్పించిన వారి పై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం అల్వాల్ మున్సిపల్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ మను చౌదరి, అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డితో కలిసి పట్టభద్రుల ఓటర్ల నమోదు ప్రక్రియ పై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నమోదు ప్రక్రియ పురోగతిని, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) నమోదు సమయంలో ఏవైనా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారా అని ఆరా తీశారు.ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ పట్టభద్రుల ఓటర్ల నమోదు ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. దరఖాస్తుదారులు సమర్పించిన ఫారం-18, డిగ్రీ సర్టిఫికెట్లు, ఇతర సంబంధిత ధృవపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే ఓటరుగా అర్హతను నిర్ధారించాలని సూచించారు. నమోదు ప్రక్రియలో పారదర్శకత, నిబంధనల అమలుకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ సమీక్ష సమావేశంలో మల్కాజిగిరి ఆర్డీఓ శ్యాంప్రకాష్, అల్వాల్ ఎంఆర్ఓ రాములు, డిప్యూటీ కమిషనర్ జోగేశ్వర్లు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

జోగిపేట చేనేత సహకార సంఘం పునరుద్ధరణకు కృషి

జోగిపేట వెలుతురు అక్టోబర్ 30:
చేనేత రంగాన్ని ఆదుకోవడంతో పాటు చేనేత సహకార సంఘం బలోపేతం చేసేందుకు తన వంతుగా కృషి చేస్తానని రాష్ట్ర జౌళి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రవీణ్ తెలిపారు. చేనేత సహకార సంఘం పరిధిలోని కార్మికుల స్థితిగతులు, బట్టల ఉత్పత్తి, సంఘం పనితీరును జోగిపేట చేనేత సహకార సంఘం చైర్మన్ పడిగే సత్యం, డైరెక్టర్లతో కలిసి పరిశీలించారు. అనంతరం అసిస్టెంట్ డైరెక్టర్ ప్రవీణ్ మాట్లాడుతూ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నామని, సంఘం అభివృద్ధికి అవసరమైన చర్యలపై పాలకవర్గంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. సంఘం అభివృద్ధికి నిధుల మంజూరు అంశాన్ని కూడా పరిశీలించేందుకు ప్రయత్నిస్తామన్నారు. అలాగే కొంతమంది కార్మికులకు చేనేత బీమా రెన్యువల్ కాలేదని వచ్చిన ప్రశ్నకు స్పందిస్తూ, ఇటీవలే బాధ్యతలు స్వీకరించినందున సమస్యను పూర్తిస్థాయిలో పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. జోగిపేట చేనేత సహకార సంఘాన్ని తిరిగి పూర్వ వైభవానికి తీసుకువచ్చేందుకు తన వంతు ప్రయత్నం చేయనున్నట్లు తెలిపారు.
జోగిపేట చేనేత సహకార సంఘం చైర్మన్ పడిగే సత్యం మాట్లాడుతూ చరిత్ర కలిగిన జోగిపేట చేనేత సహకార సంఘాన్ని తిరిగి పూర్వ వైభవానికి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని సంఘం అధ్యక్షుడు పడిగే సత్యం తెలిపారు. సంఘం బాధ్యతలు చేపట్టిన సమయంలో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందుల్లో ఉందని, ఒక్క మగ్గం మాత్రమే పనిచేసే పరిస్థితి ఉండేదని చెప్పారు. గోదాములో నూలు, ముడిసరుకు కూడా లేకపోవడంతో కార్మికులకు ఉపాధి కల్పించడం కష్టంగా మారిందన్నారు. వైద్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సహకారంతో తమ కమిటీని ఏకగ్రీవంగా నియమించారని, సంఘాన్ని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో బాధ్యతలు స్వీకరించామని పేర్కొన్నారు. ప్రారంభంలో మాజీ చైర్మన్ అభినవ్ రూ.లక్ష విరాళంగా ఇవ్వగా, తాను మరో రూ.50 వేల ఇచ్చి అత్యవసరంగా నూలు కొనుగోలు చేశామని వివరించారు. ప్రస్తుతం తువ్వాళ్లు, లుంగీలు తదితర వస్త్రాలను తయారు చేయిస్తూ కార్మికులకు నెలనెలా కూలి చెల్లిస్తున్నామని తెలిపారు.
గతంలో సంఘంలో 60 మంది వరకు కార్మికులు పనిచేసేవారని, క్రమంగా ఉపాధి లేకపోవడంతో వారి సంఖ్య తగ్గిపోయిందన్నారు. ప్రస్తుతం సుమారు 15 మంది కార్మికులు పనిచేస్తున్నారని చెప్పారు. ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన చేనేత కార్మికులు తిరిగి రావాలని, పని తెలిసిన వారికి సంఘంలో ఉపాధి కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. పాత మగ్గాలపై పనిచేయడం వల్ల కార్మికులపై శారీరక ఒత్తిడి పెరుగుతోందని, ఆధునిక మగ్గాలు అందుబాటులోకి వస్తే ఉత్పత్తి పెరుగుతుందని చెప్పారు. కొత్త మగ్గాలు, ప్రత్యేక షెడ్డు ఏర్పాటు కోసం సుమారు రూ.కోటి నుంచి రూ.రెండు కోట్ల వరకు నిధులు అవసరమని తెలిపారు. సుమారు 40 మంది నేత కార్మికులతోపాటు నూలు చుట్టడం, ఇతర అనుబంధ పనుల కోసం మరో 30 మంది కార్మికులకు ఉపాధి కల్పించవచ్చన్నారు. గత రెండు, మూడేళ్లుగా సంఘానికి నూలు కొనుగోలుపై సబ్సిడీ అందడం లేదని, దీనిపై ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయనున్నట్లు చెప్పారు. ప్రస్తుతం సంఘం ఆర్థిక పరిస్థితి బలహీనంగా ఉందని, నిధులు సమకూర్చడం, ఉత్పత్తి చేసిన వస్త్రాలకు మార్కెటింగ్ సదుపాయం కల్పించడం ప్రధాన సవాళ్లుగా ఉన్నాయని వివరించారు.సంఘం అభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తామని మంత్రి దామోదర రాజనర్సింహ హామీ ఇచ్చారని, ఆయన ప్రోత్సాహంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. జోగిపేటకే పరిమితం కాకుండా నియోజకవర్గంలోని గ్రామాల చేనేత కార్మికులకు కూడా ఉపాధి కల్పించాలన్నదే తమ లక్ష్యమని పడిగే సత్యం పేర్కొన్నారు.

వాకిటి పిలుపు.. లేదిక అలుపు

- ఓట్ బచావో - దేశ్ బచావో సభకు మక్తల్ నుంచి కాంగ్రెస్ శ్రేణుల తరలింపు
- కార్యకర్తల్లో ఉత్సాహం నింపుతూ బస్సులో ప్రయాణించిన మంత్రి వాకిటి శ్రీహరి

మక్తల్, వెలుతురు అక్టోబర్ 30: ఓట్ బచావో -- దేశ్ బచావో కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ నవంబర్ 1న ఢిల్లీలో నిర్వహించనున్న భారీ నిరసన సభకు మంత్రి వాకిటి శ్రీహరి ఇచ్చిన పిలుపు మేరకు మక్తల్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో బయలుదేరారు. మక్తల్ నుంచి ఢిల్లీకి వెళ్లేందుకు ఏర్పాటు చేసిన బస్సులను మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి స్వయంగా కార్యకర్తలతో కలిసి బస్సులో ప్రయాణిస్తూ నినాదాలు చేశారు. పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపుతూ వారిలో జోష్ పెంచారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు సంరక్షణ లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఈ ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది అని, ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ఢిల్లీ నిరసన సభను విజయవంతం చేసేందుకు మక్తల్ నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా తరలివెళ్లారు.

ఓట్ చోరీ వ్యతిరేక నిరసనకు
ములుగు నుంచి భారీగా కాంగ్రెస్ శ్రేణులు

- నవంబర్ 1న ఢిల్లీలోని రాంలీలా మైదానంలో కార్యక్రమం
- మీడియాతో మంత్రి సీతక్క

ములుగు, వెలుతురు అక్టోబర్ 30 : ఓట్ చోరీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఇచ్చిన పిలుపు మేరకు నవంబర్ 1న ఢిల్లీలోని రాంలీలా మైదానంలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమానికి ములుగు జిల్లా, నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్తున్నట్లు మంత్రి సీతక్క తెలిపారు. శుక్రవారం ములుగు జిల్లా కేంద్రంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు పవిత్రతను కాపాడటమే ఈ నిరసన లక్ష్యమన్నారు. తెలంగాణ నుంచి కాంగ్రెస్ శ్రేణులు బస్సులు, రైళ్లు, విమానాల ద్వారా ఢిల్లీ చేరుకుని నిరసనలో పాల్గొంటారని వెల్లడించారు. ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడి ఓటు అత్యంత విలువైనదని, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, నిష్పక్షపాతత్వం ఉండాలని సీతక్క పేర్కొన్నారు. ఓటర్ల జాబితాలు, ఎన్నికల ప్రక్రియలో అక్రమాలకు తావుండకూడదని, ఓటు చోరీ ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంబంధిత వ్యవహారాల్లో బాధ్యత వహించిన అధికారులకు పదవీ విరమణ అనంతరం కూడా రక్షణ కల్పిస్తున్నారనే విమర్శలపై కేంద్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. ప్రజల రాజ్యాంగ హక్కులను కాపాడటం ప్రభుత్వాల బాధ్యతని, ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కల్పించాలని అన్నారు. ప్రజాస్వామ్య విలువలు, ఓటు హక్కు పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని పేర్కొన్నారు. ఢిల్లీలో జరిగే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగా కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

టీజీఎస్‌ఆర్టీసీ నర్సింగ్ కళాశాలలో
బీఎస్సీ నర్సింగ్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 30: తార్నాకలోని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ ఆర్టీసీ) నర్సింగ్ కళాశాలలో 2026--27 విద్యా సంవత్సరానికి బీఎస్సీ (నర్సింగ్) కోర్సులో ప్రవేశాల కోసం మేనేజ్‌మెంట్ కోటా కింద దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. కాళోజీ నారాయణరావు ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం అనుబంధంతో కొనసాగుతున్న ఈ కళాశాలలో మొత్తం 100 సీట్లు అందుబాటులో ఉన్నాయి. వీటిలో 60 సీట్లు కన్వీనర్ కోటా కాగా, మిగిలిన 40 సీట్లు మేనేజ్‌మెంట్ కోటా కింద భర్తీ చేయనున్నారు.

ప్రవేశానికి అర్హతలు

ఇంటర్మీడియట్ (10+2)లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ సబ్జెక్టులతో కనీసం 45 శాతం మార్కులు సాధించి ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. ఇంగ్లీష్ తప్పనిసరి సబ్జెక్టుగా చదివి ఉండాలి. ఇంటర్మీడియట్ వృత్తి విద్య అభ్యసించిన అభ్యర్థులు బయాలజికల్, ఫిజికల్ సైన్స్ సబ్జెక్టులకు సంబంధించిన నిర్దేశిత బ్రిడ్జి కోర్సును పూర్తి చేసి ఉండాలి. ప్రవేశ నిబంధనల ప్రకారం నీట్/టీజీ ఈసెట్ పరీక్షకు హాజరై ఉండాలి.

క్లినికల్ శిక్షణకు ప్రత్యేక అవకాశం

కళాశాల ప్రాంగణంలోనే 200 పడకల టీజీఎస్ ఆర్టీసీ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి అందుబాటులో ఉండటం విద్యార్థులకు ప్రత్యేక ప్రయోజనంగా నిలవనుంది. ఆసుపత్రిలో ప్రత్యక్ష పర్యవేక్షణలో క్లినికల్ శిక్షణ పొందడంతో పాటు ప్రాక్టికల్ పరిజ్ఞానాన్ని పెంపొందించుకునే అవకాశం కల్పిస్తున్నారు. అనుభవజ్ఞులైన అర్హత కలిగిన అధ్యాపకులు, ఆధునిక పరికరాలతో కూడిన ప్రయోగశాలలు, మెరుగైన క్లినికల్ సదుపాయాలతో పాటు నర్సింగ్ వృత్తిలో రాణించేందుకు అవసరమైన మార్గదర్శకత్వం అందించనున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు. ప్రవేశాలు, దరఖాస్తులు, ఇతర వివరాల కోసం కళాశాల ప్రిన్సిపాల్‌ను నేరుగా సంప్రదించవచ్చు. అలాగే అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌ను 7075009463 నంబర్‌లో లేదా tsrtc.con @g-mail. com ఈమెయిల్ ద్వారా లేదా టీజీఎస్‌ఆర్టీసీ నర్సింగ్ కళాశాల, టీజీఎస్‌ఆర్టీసీ హాస్పిటల్ క్యాంపస్, తార్నాక సంప్రదించాలని సూచించారు.

ముఖ్యమంత్రి చొరవ వల్లే
జలమండలి ఉద్యోగులకు ప్రమోషన్లు

-జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు మొగుళ్ళ రాజి రెడ్డి

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 30 : దశలవారీగా జలమండలి ఉద్యోగుల సమస్యలను ప్రత్యేక చొరవ తీసుకొని పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు సుదీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న ప్రమోషన్లు నేడు జలమండలి ఉద్యోగులకు దక్కాయని ఐ.ఎన్.టి. యు.సి రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షులు, జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు మొగుళ్ళ రాజి రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి కి, జలమండలి ఎండి అశోక్ రెడ్డికు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్, ఖైరతాబాద్, జలమండలి కేంద్ర కార్యాలయంలో శుక్రవారం జలమండలి పిడిఏ లోని 36 మంది ఉద్యోగులకు అసిస్టెంట్ నుంచి సీనియర్ అసిస్టెంట్ లుగా ప్రమోషన్లు ఇస్తూ పత్రాలను జె.ఏం.ఈ.యు గౌరవ సలహాదారు, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, మొగుళ్ళ రాజిరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా మొగుళ్ళ రాజిరెడ్డి మాట్లాడుతూ 36 మందికి ఒకేసారి ప్రమోషన్లు దక్కడం జలమండలి చరిత్రలో మొదటిసారని, ఉద్యోగుల సమస్యలను అర్థం చేసుకుని, సంబంధిత అధికారులతో నిరంతరం చర్చిస్తూ, ప్రమోషన్ల ప్రక్రియ సజావుగా పూర్తయ్యే వరకు ఉద్యోగుల పక్షాన నిలబడి జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ కృషి చేయడం జరిగిందన్నారు. ప్రమోషన్లు, హక్కులు, సంక్షేమం ఇతర సమస్యలపై దశలవారీగా ప్రత్యేక చొరవ తీసుకొని పరిష్కర్తానికి కృషి చేస్తూ ఉద్యోగ, కార్మికులకు అండగా ఉంటామని మొగుళ్ళ రాజిరెడ్డి తెలిపారు. బొంతు రామ్మోహన్ మాట్లాడుతూ జలమండలి ఉద్యోగుల సమస్యల అంశంలో "ఉద్యోగుల సమస్యే మన సమస్య" అనే భావనతో జె.ఏం.ఈ.యు నిరంతరం కృషి చేస్తూ, సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ప్రతి సందర్భంలో ఉద్యోగులకు అండగా ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న మొగుళ్ళ రాజిరెడ్డి నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జలమండలి డైరెక్టర్ పర్సనల్ ఖాదర్, జె.ఏం.ఈ.యు ప్రధాన కార్యదర్శి టి.పి. రాఘవేంద్ర రాజ్, అసోసియేట్ ప్రెసిడెంట్ అల్లి శ్రవాన్ కుమార్, ఈ. చంద్రశేఖర్, సైద్ అక్తర్ అలీ, బి.జైరాజ్, కె ఆనంద్ రెడ్డి, బి.నర్సింగ్ రావు, లక్ష్మణ్ యాదవ్, సైద్ హాసిం, గౌస్ పాషా, బి.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

జలమండలి యాజమాన్యంతో సంప్రదింపులకు వర్కింగ్ కమిటీ ఏర్పాటు

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడానికి జలమండలి యాజమాన్యంతో సంప్రదింపులకు 9 మంది తోకూడిన వర్కింగ్ కమిటీ ఏర్పాటు చేశామని మొగుళ్ళ రాజిరెడ్డి ప్రకటించారు. ఇందులో సభ్యులుగా బొంతు రామ్మోహన్, మొగుళ్ళ రాజిరెడ్డి, టి.పి. రాఘవేంద్ర రాజ్, అల్లి శ్రావణ్ కుమార్, ఎండి. జహంగీర్, చంద్రశేఖర్, అక్తర్ అలీ, బి. జైరాజ్, శంకర్ ప్రకాష్ లు సభ్యులుగా ఉంటూ జలమండలి యాజమాన్యంతో సమన్వయం, సంప్రదింపులు జరిపి ఉద్యోగ, కార్మికుల సమస్యల పరిష్కరానికి కృషి చేస్తారని తెలిపారు.



ప్రజా సమస్యలను గాలికొదిలేసి ఢిల్లీ బాట పడతారా?

- కరువుతో రైతులు అల్లాడుతుంటే ఆదుకునే సోయి లేదా?
- కాంగ్రెస్ నేతలపై కేంద్ర మంత్రి బండి సంజయ్ ఫైర్
- బండి సంజయ్ సమక్షంలో బీజేపీలో చేరిన కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు

రాజేంద్రనగర్, వెలుతురు, అక్టోబర్ 30 : రాష్ట్రంలో కరువు, నిత్యావసర ధరల పెరుగుదల, నీటి ఎద్దడి, విద్యుత్ కోతలతో ప్రజలు అల్లాడుతుంటే పట్టించుకోకుండా సీఎం, మంత్రులు ఢిల్లీకి వెళ్లి రాజకీయాలు చేయడం సిగ్గుచేటని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ విమర్శించారు. ప్రజా సమస్యలను గాలికొదిలేసి 'సర్' పేరుతో ప్రజల దృష్టి మళ్లించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. రాజేంద్రనగర్‌లో బండి సంజయ్ సమక్షంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు బీజేపీలో చేరారు. వారికి కాషాయ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. స్థానిక యూత్

ప్రెసిడెంట్ దేశపాగా కిరోసిన్ రాజు, కరణం నారాయణ ముదిరాజ్, వేముల శ్రీనివాస్, కోరణి శ్యామ్ కుమార్, ఆనంద్ శర్మ, శశిధర్, వినోద్, నరేందర్, శ్రీనివాస్, గౌతమ్, శ్రీకర్ తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. తెలంగాణలో బీఆర్ఎస్ పాలనకు చరమగీతం పాడిన ప్రజలు కాంగ్రెస్‌కు అధికారం అప్పగిస్తే ఆ పార్టీ కూడా అదే బాటలో నడుస్తోందని విమర్శించారు. ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా అవినీతి, భూదోపిడీకి పాల్పడుతోందని ఆరోపించారు. రాష్ట్రంలో పంటలు ఎండిపోయి రైతులు నష్టపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. రైతులకు పెట్టుబడి సాయం, పంట నష్టపరిహారం ఎప్పుడు అందిస్తారని ప్రశ్నించారు. ప్రత్యామ్నాయ పంటలకు ప్రోత్సాహం, తాగు, సాగునీటి సమస్యల పరిష్కారానికి కార్యాచరణ ఏమిటని నిలదీశారు. రైతులకు మొసలి కన్నీళ్లు కాదు.. పంటలకు

నీరు, పెట్టుబడికి సాయం, నష్టానికి పరిహారం కావాలని పేర్కొన్నారు. నిత్యావసర ధరల పెరుగుదలతో సామాన్యులు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. ప్రజా సమస్యలను పక్కనపెట్టి రాజకీయాలకే ప్రాధాన్యమిస్తే కాంగ్రెస్ నేతలకు ప్రజాక్షేత్రంలో గుణపాఠం తప్పదని బండి సంజయ్ హెచ్చరించారు.

ఛాతీలో గ్యాస్ సమస్య లక్షణాలు, చికిత్స

-డా. డి.సి. తిరుపతిరావు ఎండి
సీనియర్ వైద్యులు : చైతన్య హాస్పిటల్

కరీంనగర్, వెలుతురు అక్టోబర్ 30: ఛాతీలో నొప్పి, బిగుతు, మంట, ఒత్తిడి లేదా ఏదో గాలి చిక్కుకున్నట్లుగా అనిపించడం చాలామందిలో కనిపించే సమస్య. ఇలాంటి లక్షణాలు కనిపించినప్పుడు చాలామంది గ్యాస్ సమస్య లేదా అసిడిటీ అని భావిస్తారు. నిజంగానే జీర్ణక్రియకు సంబంధించిన సమస్యలు కొన్నిసార్లు ఛాతీ ప్రాంతంలో అసౌకర్యాన్ని కలిగిస్తాయి. అయితే, ప్రతి ఛాతీ నొప్పినీ గ్యాస్ సమస్యగా భావించడం ప్రమాదకరం. గుండెపోటు వంటి అత్యవసర పరిస్థితులు కూడా కొన్నిసార్లు గ్యాస్, అసిడిటీ లక్షణాలను పోలి ఉంటా యి. కాబట్టి ఛాతీలో అసౌకర్యం ఎందుకు వస్తుంది, దాని లక్షణాలు ఏమిటి, ఎలాంటి ఆహారపు అలవా ట్లు దీనికి కారణమవుతాయి, ఇంట్లో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ఎప్పుడు వైద్య సహా యం పొందాలి అనే విషయా లను ప్రతి ఒక్క రూ తెలుసుకోవాలి. ముఖ్యంగా వృద్ధులు, మధు మేహం, అధిక రక్తపో టు, అధిక కొల స్ట్రాల్ ఉన్నవారు ఛాతీ నొప్పి ని నిర్లక్ష్యం చేయకూడదు. ఛాతీలో గ్యాస్ సమస్య అంటే ఏమిటి? గ్యాస్ సమస్య సాధార ణంగా కడుపు లేదా పేగుల్లో గాలి, వాయువులు

పేరుకు పోవడం వల్ల ఏర్పడుతుంది. ఇవి ఛాతీ ప్రాంతంలో ఒత్తిడి లేదా అసౌకర్యంగా అనిపించవచ్చు. ఛాతీకి, కడుపుకు మధ్య డయాఫ్రాగమ్ అనే కండరం ఉం టుంది. కడుపు ఉబ్బరంగా మారినప్పుడు కొంద రికి పై కడుపు భాగంలో ఒత్తిడి, నిండుగా ఉన్న భావన కలగ వచ్చు.. అసిడిటీ లేదా గ్యాస్ట్రో ఈసోఫేజియల్ రిఫ్ల క్స్ వ్యాధి జిఈ ఆర్ డి ఇందులో కడుపులోని ఆ మ్లం ఆహార నాళంలోకి తిరిగి రా వడం వల్ల ఛాతీ మధ్యలో మంట, గొంతులో పుల్లటి రుచి, తిన్న తర్వాత అసౌకర్యం కలగవచ్చు. తేన్పులు వచ్చినప్పుడు లేదా గ్యాస్ బయటకు వెళ్లినప్పుడు కొంత ఉపశమనం కలగవచ్చు.

జర్మనీతో తెలంగాణ బంధం
మరింత బలోపేతం కావాలి

- అంతర్జాతీయ పెట్టుబడులు, పర్యాటకం, సాంకేతిక రంగాల్లో అపార అవకాశాలు
- జర్మన్ ఐక్యతా దినోత్సవ వేడుకల్లో మంత్రి వాకిటి శ్రీహరి

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 30: భారత్, జర్మనీ దేశాల మధ్య 75 ఏళ్లుగా కొనసాగుతున్న స్నేహ సంబంధాలు భవిష్యత్తులో మరింత బలో పేతం కావాలని రాష్ట్ర క్రీడా, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఆకాంక్షించారు. వాణి జ్యం, పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం, పర్యాట కం, సాంస్కృతిక మార్పిడి రంగాల్లో ఇరు దేశాల మధ్య పరస్పర సహకారాన్ని మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ హోటల్‌లో జరిగిన జర్మన్ ఐక్యతా దినోత్సవ వేడుకల్లో మంత్రి పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా జర్మనీ కాన్సుల్ జనరల్ మైఖేల్ హాస్పర్‌కు, జర్మనీ ప్రభుత్వానికి, ప్రజలకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. ఐక్యత, పరస్పర అవగాహన, ఉమ్మడి భవిష్యత్తు కోసం కలిసి పనిచేయాలనే సందేశాన్ని జర్మన్ ఐక్యతా దినోత్సవం ప్రపంచానికి అందిస్తోందన్నారు. భారత్‌కు జర్మనీ ముఖ్యమైన ఆర్థిక భాగస్వామ్య దేశమని, ఇంజినీరింగ్, ఆటోమొబైల్ తయారీ, ఐటీ, పరిశోధన, పునరుత్పాదక ఇంధన రంగాల్లో ఇరు దేశాల మధ్య మంచి సహకారం కొనసాగుతోందన్నారు. 2024లో ఇరు దేశాల మధ్య వస్తువులు, సేవల వాణిజ్యం 50 బిలియన్ అమెరికన్ డాలర్లను దాటిందని పేర్కొన్నారు.

ప్రపంచ పెట్టుబడులకు తెలంగాణ గమ్యస్థానం

నైపుణ్యం కలిగిన మానవ వనరులు, బలమైన సాంకేతిక వ్యవస్థలతో హైదరాబాద్ అంతర్జాతీయ కంపెనీలకు ప్రధాన గమ్యస్థానంగా ఎదిగిందని మంత్రి తెలిపారు. హైదరాబాద్‌లో డాయిష్ బోర్స్ సంస్థ కార్యకలాపాలు నిర్వహించడం అంతర్జాతీయ సంస్థలకు నగరంపై ఉన్న నమ్మకానికి నిదర్శనమన్నారు. ప్రపంచ పెట్టుబడులను ఆకర్షించడం, అంతర్జాతీయ వ్యాపార భాగస్వామ్యాలను పెంపొందించడం రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. డిసెంబర్‌లో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ద్వారా రాష్ట్రంలోని పెట్టుబడి అవకాశాలను ప్రపంచ పారిశ్రామికవేత్తలకు పరిచయం చేయనున్నట్లు తెలిపారు. అధునాతన తయారీ, ఆటోమొబైల్ ఇంజినీరింగ్, ఐటీ, లైఫ్ సైన్సెస్, పునరుత్పాదక ఇంధనం, ఆధునిక సాంకేతిక రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు జర్మనీ కంపెనీలను తెలంగాణకు ఆహ్వానించారు. జర్మనీలోని థ్యూరింగియా రాష్ట్రంతో నైపుణ్యాభివృద్ధి, సాంకేతిక పరిజ్ఞానం, స్టార్టప్‌లు, లైఫ్ సైన్సెస్ రంగాల్లో సహకారం పెరుగుతోందని వివరించారు. తెలంగాణకు గొప్ప చరిత్ర, విశిష్టమైన సాంస్కృతిక వారసత్వం ఉందని మంత్రి పేర్కొన్నారు. కాకతీయుల నిర్మాణ వైభవం, యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం, హైదరాబాద్ చారిత్రక కట్టడాలు రాష్ట్ర పర్యాటక ప్రత్యేకతను చాటుతున్నాయన్నారు.

50 వేల కోట్ల పర్యాటక పెట్టుబడులే లక్ష్యం

తెలంగాణ టూరిజం పాలసీ 2025--2030 ద్వారా ఐదేళ్లలో రూ.50 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించడం, ఐదు లక్షల ఉద్యోగ అవకాశాలను కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు.

రూ.10వేల కోట్ల వ్యాపారం ప్రమాదంలో పడుతుంది

- చలో ఢిల్లీ' ర్యాలీని వాయిదా వేయాలని సోనియాకు వ్యాపారుల లేఖ

న్యూఢిల్లీ, వెలుతురు అక్టోబర్ 30 : నవంబర్ 1న రామ్‌లీలా మైదానంలో ఇండియా కూటమి తలపెట్టిన 'చలో ఢిల్లీ' ర్యాలీని వాయిదా వేయాలని ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ(సీటీఐ) గురువారం కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీకి లేఖ రాసింది. పండుగల సీజన్ వ్యాపారాలకు అత్యంత కీలకమైన సమయం కాబట్టి,

ఈ సమయంలో ర్యాలీ నిర్వహించడం వల్ల తమకు తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ మెగా ర్యాలీకి పది లక్షల మంది ప్రజలు, 15000-20000 వాహనాలు సెంట్రల్ ఢిల్లీలోకి రావడం వల్ల ఇరవైకు పైగా మార్కెట్లలో తీవ్రమైన ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుందని హెచ్చరించింది. ఈ ర్యాలీ వల్ల రూ.10,000 కోట్ల విలువైన వ్యాపార లావాదేవీలు ప్రమాదంలో పడతాయని పేర్కొంది.

'మేము ఈ ర్యాలీని వ్యతిరేకించడం లేదు'

"నవంబర్ 1న పది లక్షల మందితో జరగబోయే మెగా ర్యాలీని దీపావళి తర్వాతి తేదీకి వాయిదా వేయాలని కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీని కోరుతున్నాం. ఈ ర్యాలీ వల్ల 15,000- 20,000 వాహనాలకు పార్కింగ్ సౌకర్యం లేకపోవడం వల్ల ఢిల్లీలో పూర్తిస్థాయి ట్రాఫిక్ జామ్ ఏర్పడవచ్చు. ఢిల్లీ వాణిజ్య వ్యవస్థకు ఇది చాలా కీలక (పండగల) సమయం. నవంబర్ 6న ధంతేరస్, నవంబర్ 8న దీపావళి పండగ ఉంది. అయితే నవంబరు 1న ర్యాలీ ఉండడంతో వ్యాపారుల సరకుల రవాణాకు, కొనుగోలుదారుల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతాయి. దీంతో వ్యాపారాల యజమానులు తీవ్ర భయాందోళనలను ఎదుర్కొంటున్నారు. మా విజ్ఞప్తి రాజకీయాలకు సంబంధించినది కాదు. కేవలం మా వ్యాపార మనుగడ కోసం చేస్తున్నదే. మేము ఈ ర్యాలీని వ్యతిరేకించడం లేదు. దీపావళి పండగ సమయంలో మా జీవనోపాధిని కాపాడుకోవాలని హృదయ పూర్వకంగా విజ్ఞప్తి చేస్తున్నాం." అని సోనియా గాంధీకి రాసిన లేఖలో సీటీఐ ఛైర్మన్ థర్మన్ బ్రిజేష్ గోయల్ పేర్కొన్నారు.

నవంబర్14 వరకు సౌదీకి ఎయిరిండియా విమానాలు రద్దు

- జెడ్డా, రియాద్, దమ్మామ్ సేవలకు తాత్కాలిక విరామం
- పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో నిర్ణయం
- ప్రయాణికులకు ఉచితంగా మరోసారి టికెట్ మార్పు లేదా పూర్తి నగదు వాపసు

న్యూఢిల్లీ, వెలుతురు అక్టోబర్ 30 : పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఎయిరిండియా, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ కీలక నిర్ణయం తీసుకున్నాయి. సౌదీ అరేబియాలోని జెడ్డా, రియాద్, దమ్మామ్ నగరాలకు రాకపోకలు సాగించే తమ విమాన సర్వీసులను నవంబరు 14వ తేదీ వరకు రద్దు చేస్తున్నట్లు శుక్రవారం ప్రకటించాయి. ప్రాంతీయ భద్రతా పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించాయి. గతంలో రియాద్, దమ్మామ్ నగరాలకు విమాన సర్వీసులను నవంబరు

7 వరకు, జెడ్డాకు అక్టోబరు 31 వరకు నిలిపివేస్తున్నట్లు ప్రకటించిన సంస్థలు.. తాజాగా ఆ గడువును నవంబరు 14 వరకు పొడిగించాయి. సౌదీ అరేబియాలోని విమానాశ్రయాలు సహా కీలక మౌలిక సదుపాయాలపై దాడులు, పశ్చిమాసియాలో పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు విమానయాన రంగంపై ప్రభావం చూపుతున్నాయి.

ప్రయాణికులకు వెసులుబాటు

అక్టోబరు 30వ తేదీ లేదా అంతకంటే ముందుగా టికెట్లు కొనుగోలు చేసి, నవంబరు 14వ తేదీలోపు ప్రయాణించాల్సిన వారు ఒకసారి ఉచితంగా ప్రయాణ తేదీని మార్చుకునే అవకాశం కల్పించారు. అందుబాటును బట్టి నవంబరు 29వ తేదీలోపు ప్రయాణించేలా కొత్త టికెట్ పొందవచ్చు. ప్రయాణాన్ని రద్దు చేసుకునే వారు పూర్తి నగదు వాపసు పొందవచ్చని సంస్థలు స్పష్టం చేశాయి. ఎయిరిండియా ప్రయాణికులు సౌదీ అరేబియాలో సంస్థ సేవలు అందిస్తున్న ఇతర విమానాశ్రయాలకు వెళ్లేలా టికెట్లు మార్చుకోవచ్చు. ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ ప్రయాణికులకు సౌదీ అరేబియాతోపాటు బహ్రెయిన్‌లోని సంస్థ సేవలు అందిస్తున్న విమానాశ్రయాలకు వెసులుబాటు కల్పించారు.

ఇతర విమాన సంస్థలపైనా ప్రభావం

సౌదీ అరేబియాకు విమాన సర్వీసులను నిలిపివేసిన సంస్థల్లో ఇండిగో, ఆకాసా ఎయిర్ కూడా ఉన్నాయి. ఇండిగో జెడ్డా, దమ్మామ్, మదీనా నగరాలకు నవంబరు 14 వరకు విమానాలను రద్దు చేయగా, ఆకాసా ఎయిర్ రియాద్ సర్వీసులను నవంబరు 30 వరకు, జెడ్డా సర్వీసులను నవంబరు 10 వరకు నిలిపివేసింది. దీంతో సౌదీ అరేబియా వెళ్లే, అక్కడి నుంచి భారత్‌కు తిరిగి వచ్చే ప్రయాణికులు తమ విమాన టికెట్ల స్థితిగతులను సంబంధిత సంస్థల ద్వారా ముందుగానే తెలుసుకోవాలని సూచించారు.

భద్రాచలం ఆలయ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

- కలెక్టర్ అంకిత్
పనుల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారిగా డీఆర్ఓ పద్మావతి నియామకం

భద్రాద్రి కొత్తగూడెం. వెలుతురు అక్టోబర్ 30: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ అభివృద్ధి పనుల పురోగతి, వివిధ శాఖల అనుమతులు, గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ అంకిత్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠతో కలిసి శుక్రవారం ఐడీఓసీ కార్యాలయంలో సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధి పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ, వివిధ శాఖల మధ్య సమన్వయం సాధించేందుకు ప్రత్యేక అధికారిగా జిల్లా రెవెన్యూ అధికారి పద్మావతిని నియమిస్తున్నట్లు తెలిపారు. నిర్దేశించిన లక్ష్యాల మేరకు పనులను వేగవంతం చేయాలని, అవసరమైన ప్రతిపాదనలు, అనుమతులను సంబంధిత శాఖల నుంచి త్వరితగతిన పొందాలని ఆదేశించారు. ఆలయ పునరుద్ధరణ, అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. చేపట్టిన పనుల పురోగతి, ఎదురవుతున్న సమస్యలు, నిధులు, అనుమతుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పుష్కరాల నేపథ్యంలో ముందస్తు ప్రణాళికలు: గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని భద్రాచలంలోని పుష్కర ఘాట్ల అభివృద్ధి, విస్తరణతో పాటు భక్తులకు కల్పించాల్సిన సదుపాయాలపై సమీక్షించారు. పుష్కరాల సమయంలో పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున స్నానపు ప్రదేశాలు, రాకపోకలకు అనువైన మార్గాలు, భద్రత, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్ వంటి సదుపాయాలపై ముందస్తు ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ఘాట్ల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన పనులను గుర్తించి సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. రామాలయం నుంచి పుష్కర ఘాట్‌కు వెళ్లే మార్గంలో ఉన్న 47 ఇళ్ల తొలగింపునకు సంబంధించిన అంశాన్ని సమీక్షిస్తూ, ఆయా నిర్మాణాల వివరాలు, విలువ అంచనాలు, నిర్వాసితులకు కల్పించాల్సిన పునరావాసం, పరిహారం (ఆర్ అండ్ ఆర్)పై చర్చించారు. బాధితులకు నిబంధనల ప్రకారం పునరావాసం, పరిహారం అందించేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం: భద్రాచలం బ్రిడ్జి నుండి పుష్కర ఘాట్ లకు రహదారి విస్తరణకు అవసరమైన భూమి, నిర్మాణాలు, భూసేకరణ అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సమగ్ర నివేదిక రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. పుష్కర ఘాట్‌కు అనుసంధానంగా నాలుగు వరుసల రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. పుష్కరాల సమయంలో భక్తులు, యాత్రికుల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. భద్రాచలంలో వీఐపీ, వీవీఐపీ అతిథి గృహాల నిర్మాణానికి అనువైన స్థలాలను గుర్తించాలని సూచించారు. అన్ని వసతులతో ఆరు సూట్లతో కూడిన అతిథి గృహ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, అధికారులు క్షేత్రస్థాయిలో స్థలాలను పరిశీలించి తగిన ప్రదేశాన్ని ఎంపిక చేయాలని తెలిపారు. అవసరమైన భూసేకరణ ప్రక్రియను ప్రారంభించి, సంబంధిత శాఖల అనుమతులతో ప్రతిపాదనలను త్వరితగతిన ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించారు. సమన్వయంతో గడువులోగా పనులు పూర్తి: గోదావరి పుష్కరాల నాటికి ఆలయం, ఘాట్లు, పట్టణ పరిసర ప్రాంతాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేసేలా శాఖల వారీగా కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ తెలిపారు. గత సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలు, అధికారులకు అప్పగించిన బాధ్యతలు, పనుల పురోగతికి సంబంధించిన మినిట్స్‌ను తప్పనిసరిగా నమోదు చేయాలని, తదుపరి సమీక్షలో వాటి ఆధారంగా పురోగతిని పరిశీలిస్తామని స్పష్టం చేశారు. పనుల అమలులో ఎదురయ్యే సమస్యలను వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి (సీపీఓ) సునీత, జిల్లా పంచాయతీ అధికారి అనూష, భద్రాచలం దేవస్థానం ఈఓ దామోదర్ రావు, ఆర్ అండ్ బి ఈఈ నాగేశ్వరరావు, భద్రాచలం తహసీల్దార్ రామ్ కుమార్, దుమ్ముగూడెం తహసీల్దార్ భగవాన్ రెడ్డి, ఇరిగేషన్ శాఖ అధికారులు, వివిధ శాఖల ఇంజినీరింగ్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

'పట్టభద్రులందరూ ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలి'

మాల్, వెలుతురు అక్టోబర్ 30: గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పట్టభద్రులందరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ నాయకుడు నట్వ గిరిధర్ కోరారు. శుక్రవారం చింతపల్లి మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గిరిధర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వరంగల్?ఖమ్మం?నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధిలో ఓటు హక్కు పొందేందుకు అర్హత కలిగిన పట్టభద్రులు తమ పేర్లను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. చింతపల్లి మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న అర్హులైన పట్టభద్రులకు ఎమ్మెల్సీ ఓటు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించడంతో పాటు, ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు అయ్యేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని తెలిపారు. పట్టభద్రుల సౌకర్యార్థం చింతపల్లి మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఉచితంగా ఓటరు నమోదు కార్యక్రమం చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు లింగంపల్లి భాస్కర్, కొలుకులపల్లి కొండల్, నల్ల శంకర్, ఎండీ ఫయాజ్, సిద్ధే స్వామి, సల్మాన్ పాల్గొన్నారు.

మద్దూరును
కరువు మండలంగా ప్రకటించాలి

మండల సభను బహిష్కరించిన సర్పంచులు

మద్దూరు (ధూళిమిట్ట)వెలుతురు అక్టోబర్ 30: : సిద్దిపేట జిల్లా మద్దూరు మండలాన్ని ప్రభుత్వం కరువు మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ వివిధ గ్రామాల సర్పంచులు మండల సభను బహిష్కరించారు. సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షుడు శనిగరం సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం ఎదుట సర్పంచులు బైఠాయించి నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచులు మాట్లాడుతూ మండల అధికారుల నిర్లక్ష్యం వల్లనే మద్దూరును కరువు మండలంగా ప్రకటించలేదని విమర్శిం చారు. దీనికి అధికారులే బాధ్యత వహించాలని కోరారు. తీవ్ర వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్న మద్దూరు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించకపోవడం శోచనీయం అన్నారు. గ్రామాల్లో చెరువులు కుంటలు పూర్తిస్థాయిలో ఎండిపోవడం వల్ల నీళ్లు లేక సరిగా కరెంటు రాక పంటలు ఎండిపోయాయని తెలిపారు. పంటలు ఎండిపోవడంతో రైతులు ఆర్థికంగా నష్టపోయి అప్పుల పాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. మద్దూరు మండలాన్ని కరువు మండలం గా ప్రకటించినం తవరకు ప్రభుత్వ కార్యక్రమాలకు సర్పంచులమంతా దూరంగా ఉంటామన్నారు. అదేవిధంగా కరువు మండలంగా ప్రకటించేంత వం-కు వివిధ రూపాలలో ఆందోళన కార్యక్రమాలను చేపడతా మని హెచ్చరించారు. అనంతరం ఆందోళన చేస్తున్న సర్పంచులకు ఎస్సై మమ్మద్ ఆసిఫ్ నచ్చజెప్పి విరమిం పజేశారు.

అదేవిధంగా ఎంపీడీవో శ్రీనివాస్ ఆందోళన విరమించాలని సర్పంచులకు విజ్ఞప్తి చేశారు. దీంతో సర్పంచులు తమ ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు దామెర మల్లేశం, నీరటి శ్రీనివాస్, ఇట్టబోయిన కనకచంద్రం, కాసర్ల రేణుక కనకరాజు, గడిపే మౌనిక అనిల్ కుమార్, జక్కుల లింగమ్మ కనకయ్య, కర్నె సునీత మనోహర్, బీజేపీ మండల అధ్యక్షుడు మోకు ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

బంధం బెడిసికొట్టిన తర్వాత అత్యాచారం కేసు పెట్టలేరు

- విఫలమైన ప్రేమ బంధాన్ని అత్యాచారంగా చిత్రీకరించలేరు
- విడిపోయినంత మాత్రాన మోసం చేసినట్లు కాదు
- సమ్మతితో కూడిన బంధానికి అదే వర్తిస్తుంది
- సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, వెలుతురు అక్టోబర్ 30:

ప్రేమ లేదా పరస్పర అంగీకారంతో కూడిన సంబంధాలు విఫలమైన తర్వాత, గతంలో సమ్మతితోనే జరిగిన శారీరక సంబంధాన్ని ఆ తర్వాత అత్యాచారంగా పరిగణించలేమని సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. సంబంధాలు బెడిసికొట్టిన తర్వాత వాటిని క్రిమినల్ కేసులుగా మార్చే ధోరణి పెరుగుతోందని ఈ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం ఆందోళన వ్యక్తం చేసింది. నిజంగా అత్యాచారం, బలవంతం లేదా మోసంతో సమ్మతి పొందిన సందర్భాల్లోనే అత్యాచారం ఆరోపణను పరిశీలించాలని స్పష్టం చేసింది. ఈ వ్యాఖ్యలు చేస్తూ కేరళకు చెందిన ఓ వ్యక్తిపై నమోదైన అత్యాచారం, మోసం అభియోగాల నుంచి సుప్రీం కోర్టు విముక్తి కల్పించింది.

సంబంధం విఫలమైతే అత్యాచారం కేసు పెట్టలేరు

జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఆర్. మహదేవన్‌తో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది. పరస్పర అంగీకారంతో కొనసాగిన సంబంధంలో శారీరక సాన్నిహిత్యం ఏర్పడిన తర్వాత, ఆ సంబంధం విఫలమైందనే కారణంతో దానిని అత్యాచారంగా చిత్రీకరించలేమని ధర్మాసనం పేర్కొంది. ఇలాంటి కేసుల్ని తాము పదే పదే చూస్తున్నామని, విఫలమైన సంబంధాలు ఆ తర్వాత క్రిమినల్ కేసులుగా మారుతున్న ఈ ధోరణి సమాజంలో పెరిగిపోతోందని, ఇది ఆందోళనకరం అని వ్యాఖ్యానించింది. అత్యాచారం, మోసం అనే రెండు ఆరోపణల మధ్య తేడాను స్పష్టంగా గుర్తించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. అత్యాచారం తీవ్రమైన నేరం అని, కానీ ఇలాంటి కేసుల వల్ల నిజంగా లైంగిక వేధింపులు, అత్యాచారానికి గురైన బాధితుల కేసుల తీవ్రత తగ్గిపోతోందని కోర్టు హెచ్చరించింది. గతంలో అంగీకారంతో జరిగిన సంబంధాన్ని, తర్వాత విడిపోయారనే కారణంతో నేరంగా మార్చడం సరికాదని స్పష్టం చేసింది.

పురుషుడికి సంబంధం నుంచి వైదొలిగే హక్కు లేదా?

విడిపోయిన తర్వాత ఒకరి కోపం కారణంగా మరొకరిని నేరస్థుడిగా చిత్రీకరించలేమని ధర్మాసనం ఈ సందర్భంగా అభిప్రాయపడింది. అలాంటి విధానం నిందితుడి వ్యక్తిగత స్వేచ్ఛతో పాటు ప్రతిష్ఠకు కూడా భంగం కలిగిస్తుందని పేర్కొంది. సమ్మతితో కూడిన బంధంలో ఒకసారి భాగస్వామి అయినంత మాత్రాన, తర్వాతి కాలంలో అత్యాచారం ఆరోపణలు వస్తాయనే భయంతో ఆ పురుషుడు ఆ బంధానికే జీవితాంతం కట్టుబడి ఉండాలని భావించడం సమంజసం కాదని సుప్రీం కోర్టు ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. 'ఇలాంటి పరిస్థితుల్లో ఆ బంధం నుంచి బయటకు వచ్చే హక్కు పురుషుడికి ఉండదా?' ఆ నిర్ణయాన్ని మోసంగా ఎలా పరిగణిస్తారు? కచ్చితంగా అది మోసం కాదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. పరస్పర అంగీకారంతో కొనసాగిన ప్రతి సంబంధం విఫలమైనప్పుడు దానిని అత్యాచారం ఆరోపణగా మార్చితే, ఆ నేరం తీవ్రత తగ్గిపోతుందని కూడా పేర్కొంది.

హైస్పీడ్ రైల్ల మార్గాల పనులు వేగవంతం చేయండి

- నూతన రైలు మార్గాల మంజూరుకు అనుమతులు ఇవ్వండి
- అనంతారంలో మెగా ఫ్రైట్ మెయింటెనెన్స్ డిపో ఏర్పాటు చేయండి
- రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినతి

ఢిల్లీ, వెలుతురు అక్టోబర్ 30:

తెలంగాణకు ప్రకటించిన హైస్పీడ్ రైల్ల పనులు వేగవంతం చేయాలని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ – పుణె, హైదరాబాద్ – బెంగళూరు, హైదరాబాద్ – చెన్నై కారిడార్లకు సంబంధించి, కేంద్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలపై రాష్ట్ర ప్రభుత్వం సమీక్షించి, కొన్ని మార్పులను సూచిస్తూ కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిందని సీఎం తెలిపారు. ఈ మూడు కారిడార్లకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి భూ సేకరణ ప్రక్రియను ప్రారంభించలేదని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

కేంద్ర ప్రభుత్వం అలైన్‌మెంట్ ఆమోదించిన తర్వాత భూ సేకరణను ప్రారంభిస్తామని సీఎం స్పష్టం చేశారు. సాధ్యమైనంత త్వరగా అలైన్‌మెంట్ ప్రక్రియను పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ రైలు భవన్‌లో రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో ముఖ్యమంత్రి శుక్రవారం సాయంత్రం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ అభివృద్ధికి అవసరమైన కీలక రైలు ప్రాజెక్టులపై కేంద్ర మంత్రితో సీఎం చర్చించారు. వికారాబాద్ – కృష్ణా కొత్త రైలు మార్గాన్ని (130 కి.మీ.) వెంటనే మంజూరు చేయాలని సీఎం కోరారు. వికారాబాద్ జిల్లా టేకల్‌కోడ్ పరిసరాల్లో భారీ సున్నపురాయి నిక్షేపాలు బయటపడ్డాయని, దీంతో ఈ ప్రాంతాన్ని సిమెంట్, టెక్స్‌టైల్ హబ్‌గా మార్చేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందని కేంద్ర మంత్రికి తెలియజేశారు.

హైదరాబాద్ చుట్టూ సుమారు 360 కి.మీ మేర నిర్మిస్తున్న రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) పక్కనే రీజినల్ రింగ్ రైలును అలైన్‌మెంట్ చేయాలని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను సీఎం కోరారు. రీజినల్ రింగు రైలుతో పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. డోర్నకల్– గద్వాల్, కల్వకుర్తి – మాచర్ల, కాచిగూడ కాచిగూడ –జగ్గయ్యపేట (250 కి.మీ.), పటాన్‌చెరు – ఆదిలాబాద్ (320 కి.మీ.), బోధన్ – లాతూర్ (175 కి.మీ.), అక్కన్నపేట బైపాస్ లైన్ (8 కి.మీ.) మార్గాలను వెంటనే మంజూరు చేయాలని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు.

దక్షిణ మధ్య రైల్వే ప్రతిష్టాత్మకంగా చేపట్టదలచిన మెగా కోచింగ్, ఫ్రైట్ మెయింటెనెన్స్ డిపోను మహబూబాబాద్ సమీప అనంతారం గ్రామంలో ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రి కోరారు. ఈ డిపో ఏర్పాటుకు అవసరమైన 409 ఎకరాల 1 గుంట భూమిని రైల్వే శాఖకు అప్పగించేందుకు ఇప్పటికే అంగీకరించిన విషయాన్ని ముఖ్యమంత్రి కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మెగా ఫ్రైట్ మెయింటెనెన్స్ డిపోకు త్వరగా అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు.

ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎంపీలు డాక్టర్ మల్లు రవి, వేం నరేందర్ రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, బలరాం నాయక్, గడ్డం వంశీకృష్ణ, అనిల్ కుమార్ యాదవ్, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ అద్వైత్ కుమార్ సింగ్ పాల్గొన్నారు.

ఆ 550 ఎకరాలను కొట్టేసేందుకు కేసీఆర్ ప్రయత్నించారు

(మొదటిపేజీ తరువాయి)

ఈ భూములను వేలం వేసి దళిత, బహుజనుల కోసం ఖర్చు చేస్తామని ప్రకటించారు.

కక్షతో జైలుకు పంపారు

గతంలో తాను ఎంపీగా ఉన్నప్పుడు భూ కబ్జా వ్యవహారాలపై పోరాడితే, జైలుకు పంపారని సీఎం రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. భూములను విక్రయించి నీటిపారుదల, విద్యా, వైద్యం వంటి తదితర రంగాలకు కేటాయిస్తామన్నారు. ఈ అంశంపై క్యాబినెట్‌లో చర్చిస్తామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ. 1.50 లక్షల కోట్ల విలువైన భూములు రక్షించినట్లు వెల్లడించారు.

ఎమ్మెల్యేకు నజరానాగా అప్పగిస్తే

బీఆర్ఎస్ నాయకులు కంచె గచ్చిబౌలి, మామిడిపల్లి భూములను కొట్టేసేందుకు ప్రయత్నిస్తే న్యాయ పోరాటంలో గెలిచామని సీఎం అన్నారు. గుర్రంగూడలో అటవీ భూములను కేటీఆర్ అనుచరులు కబ్జాకు ప్రయత్నిస్తే సుప్రీం కోర్టుకు వెళ్లి కాపాడినట్లు తెలిపారు. మంచిరేవులలో 143 ఎకరాల భూమిని కేటీఆర్ రాయలసీమ బిల్డర్స్‌తో కలిసి కబ్జాకు ప్రయత్నిస్తే దానిని రక్షించామన్నారు. అందులో ప్రస్తుతం పోలీసుల పిల్లల కోసం స్కూల్ నిర్మించినట్లు తెలిపారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 400 ఎకరాల అటవీ భూమిని బీఆర్ఎస్లోకి ఫిరాయించిన ఎమ్మెల్యేకు నజరానాగా అప్పగిస్తే స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

హరీశ్ రావు మామ కబ్జా

మాజీమంత్రి హరీశ్ రావు మామ హనుమంత రావు కబ్జా పెట్టిన భూములను అధికారులు సర్వే చేయకుండా అడ్డుకుంటున్నారని చెప్పారు. పైగా కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నారని సీఎం రేవంత్ చెప్పారు. భూముల ఆక్రమణపై బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వంపై అనేక తప్పుడు ఆరోపణలు చేశారని ధ్వజమెత్తారు. శాసనసభలో చర్చ పెట్టి చర్యలకు దిగితే తేలు కుట్టిన దొంగల్లా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మియాపూర్ భూములపై ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వస్తే ఎందుకు బీఆర్ఎస్ నాయకులు స్పందించడం లేదని ప్రశ్నించారు. కనీసం రెవెన్యూ అధికారులను ఎందుకు బీఆర్ ఎస్ నాయకులు అభినందించడం లేదని అన్నారు.

పద్మాలయ స్టూడియో, ల్యాంకో భూములపై కేసులు

ఉమ్మడి రాష్ట్రంలో పద్మాలయ స్టూడియో, ల్యాంకో భూములపై కేసులు వేసిన కేసీఆర్, హరీశ్ రావు అధికారంలోకి వచ్చిన తర్వాత ఎందుకు వాటిని స్వాధీనం చేసుకోలేదని సీఎం ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఎవరిపై కేసులు వేశారో వారితోనే కేసీఆర్, హరీశ్ రావు లాలూచీ పడ్డట్లు తెలిపారు. మియాపూర్ భూములపై ఇప్పటికైనా కుట్రలు మానుకోవాలని సూచించారు. బీఆర్ఎస్ నేతలు భూ ఆక్రమణలపై చర్చించేందుకు అసెంబ్లీకి రావాలని సీఎం సవాల్ విసిరారు. ఎల్బీనగర్‌లో 150 ఎకరాలను అటవీ ప్రాంతంగా మార్చామన్న సీఎం ఈ మూడేళ్లలో రూ.లక్షా 50 వేల కోట్ల విలువైన భూములను కబ్జా చెర నుంచి కాపాడినట్లు వెల్లడించారు. భూములను ఇలాగే వదిలేస్తే కేసీఆర్ ముఠా మళ్లీ కబ్జా చేస్తుందని అన్నారు. మియాపూర్ భూములను ప్రజా ప్రయోజనాలకే ఉపయోగిస్తామని స్పష్టం చేశారు. భూ కబ్జాకు యత్నిస్తే ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందన్న ఆయన ఉన్నది లేనట్టుగా లేనిది ఉన్నట్టుగా కాంగ్రెస్ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్కు చెందిన వార్తా పత్రికలు, టీవీల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై బురద జల్లుతున్నారని ఆక్షేపించారు.

సీఎం సూచనలతోనే విలువైన భూములు కాపాడాం

సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం మేరకు మియాపూర్ భూములను రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి పరిశీలించారు. సర్వే నంబర్ 100,101 భూములను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఆ భూములు హెచ్ఎండీఏ అధీనంలోనే ఉన్నాయని తెలిపారు. 400 ఎకరాల భూమికి ఫెన్సింగ్ వేశామన్న ఆయన మరికొంత భూమికి ఫెన్సింగ్ త్వరలో పూర్తి చేస్తామని చెప్పారు. సెటిల్‌మెంట్ రికార్డులో ప్రభుత్వ భూమిగా ఉందని, మియాపూర్ భూమి 1949లోనే జాగీర్దార్ నుంచి ప్రభుత్వ పరమైందన్నారు. 1995లో ప్రారంభమైన వివాదం 23ఏళ్ల పాటు కోర్టులో నడిచిందని వివరించారు. కోర్టుకు అన్ని రికార్డులు సమర్పించడం వల్లే భూమి దక్కింద న్నారు. సీఎం సూచనలతో విలువైన భూములు కాపాడామని కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. ఈ సర్వే నంబర్లలో ఉన్న నిర్మాణాల జోలికి వెళ్లడం లేదని స్పష్టం చేశారు.

ప్రభుత్వ హాస్పిటల్స్‌లో పీపీపీ మోడ్‌లో ఎంఆర్ఐ సేవలు

- మహబూబ్‌నగర్ జీజీహెచ్‌లో పైలట్ ప్రాజెక్ట్
- పేషెంట్లకు ఉచితంగానే కొనసాగనున్న ఎంఆర్ఐ సేవలు
- ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో మంత్రి దామోదర్ రాజనర్సింహ సమీక్ష
- రెండేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జీజీహెచ్‌లలో ఎంఆర్ఐ సేవలు

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 30:

రాష్ట్రంలోని ప్రభుత్వ హాస్పిటల్స్‌లో ఎంఆర్ఐ సేవలను విస్తరించేందుకు పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) విధానాన్ని అమలు చేయాలని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. తొలుత మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లో పైలట్ ప్రాజెక్టుగా ఈ విధానాన్ని ప్రారంభించి, ఆ తర్వాత రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్స్‌కు విస్తరించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. పీపీపీ విధానంలో ఎంఆర్ఐ సేవలు అందుబాటులోకి వచ్చినప్పటికీ ప్రభుత్వ హాస్పిటల్స్‌కు వచ్చే పేషెంట్లకు ఈ పరీక్షలు పూర్తిగా ఉచితంగా అందుతాయని మంత్రి స్పష్టం చేశారు.

శుక్రవారం కోఠిలోని టీజీఎంఎస్ఐడీసీ కార్యాలయంలో ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఇతర రాష్ట్రాల్లో ఎంఆర్ఐ సేవల నిర్వహణకు అనుసరిస్తున్న విధానాలపై డాక్టర్లు, అధికారుల బృందం ఇతర రాష్ట్రాల్లో పర్యటించి, అక్కడ అవలంభిస్తున్న పద్ధతులపై స్టడీ చేసింది. ఆ స్టడీ వివరాలు, పీపీపీ విధానంతో పేషెంట్లకు కలిగే ప్రయోజనం, రాష్ట్రవ్యాప్తంగా ఈ సేవలను విస్తరించే అవకాశాలపై చర్చించారు. ప్రస్తుతం అమలవుతున్న విధానంతో పోలిస్తే పీపీపీ విధానంలో ప్రభుత్వానికి సుమారు 20 శాతం మేర ఖర్చు తగ్గుతుందని అధికారులు మంత్రికి వివరించారు. ఈ విధానం ద్వారా ఎంఆర్ఐ యంత్రాల నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలను అధిగమించడంతో పాటు పేషెంట్లకు ఎలాంటి అంతరాయం లేకుండా సేవలు అందించవచ్చని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో హైదరాబాద్‌లోని గాంధీ, ఉస్మానియా, నిమ్స్, డాక్టర్ మర్రి చెన్నారెడ్డి టిమ్స్, ఎంఎన్‌జే కేన్సర్ హాస్పిటల్‌తో పాటు వరంగల్‌లోని ఎంజీఎం, ఆదిలాబాద్ రిమ్స్, భూపాలపల్లి జీజీహెచ్‌లలో మాత్రమే ఎంఆర్ఐ సేవలు అందుబాటులో ఉన్నాయి. కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్, నల్గొండ వంటి ఉమ్మడి జిల్లా కేంద్రాల్లోని ప్రభుత్వ హాస్పిటల్స్‌లో ఈ సదుపాయం లేదు. మరోవైపు, ఎంఆర్ఐ యంత్రాల కొనుగోలు, నిర్వహణకు అధిక వ్యయం కావడం, సాంకేతిక సమస్యలు తలెత్తడం వల్ల ఇప్పటికే ఈ సేవలు అందుబాటులో ఉన్న హాస్పిటల్స్‌లోనూ అప్పుడప్పుడు అంతరాయం ఏర్పడుతోంది. ఫలితంగా పేషెంట్లు ప్రైవేటు హాస్పిటల్స్‌ను ఆశ్రయించాల్సి వస్తోంది.

ఈ పరిస్థితిని అధిగమించేందుకు ఇతర రాష్ట్రాల్లో అనుసరిస్తున్న విధానాలపై వైద్యులు, ఆరోగ్యశాఖ అధికారులతో కూడిన ప్రత్యేక బృందం అధ్యయనం చేసింది. తమిళనాడు సహా పలు రాష్ట్రాల్లో విజయవంతంగా అమలవుతున్న పీపీపీ విధానాలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. ఈ విధానాన్ని అమలు చేయడం ద్వారా యంత్రాల కొనుగోలు, నిర్వహణకు సంబంధించి ప్రభుత్వంపై ఉన్న ఆర్థిక, నిర్వహణపరమైన భారం సుమారు 20 శాతం తగ్గడంతో పాటు ప్రభుత్వ హాస్పిటల్స్‌లో ఎంఆర్ఐ సేవలు నిరంతరం అందుబాటులో ఉంటాయని అధికారులు వివరించారు.

ఈ వివరాలను పరిశీలించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ, ప్రభుత్వ హాస్పిటల్స్‌కు వచ్చే పేషెంట్లకు అత్యాధునిక వైద్య పరీక్షలు అందుబాటులో ఉండాలని, ఆర్థిక కారణాలతో ఎవరూ వైద్య పరీక్షలకు దూరం కాకూడదని పేర్కొన్నారు. పీపీపీ విధానంలో సేవల నిర్వహణ బాధ్యతలు ప్రైవేటు భాగస్వామ్య సంస్థలకు అప్పగించినప్పటికీ, ప్రభుత్వ హాస్పిటల్స్‌లో వైద్యులు సూచించిన పేషెంట్లకు ఎంఆర్ఐ పరీక్షలు పూర్తి ఉచితంగా అందేలా ఒప్పందాలు, విధివిధానాలు రూపొందించాలని అధికారులకు సూచించారు. మహబూబ్‌నగర్ జీజీహెచ్‌లో పైలట్ ప్రాజెక్టు అమలుకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టి, దాని ఫలితాలను బట్టి రాష్ట్రవ్యాప్తంగా విస్తరణకు చర్యలు తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. రెండేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జీజీహెచ్‌లలో ఎంఆర్ఐ సేవలను అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి సూచించారు. ఈ సమీక్షలో ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తు, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ గౌరవ్ ఉప్పల్, డాక్టర్ మర్రి చెన్నారెడ్డి టిమ్స్ డైరెక్టర్ నరేంద్ర కుమార్, డీఎంఈ వాణితో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మినీ ట్యాంక్ బండ్‌గా ఫాక్స్ సాగర్

- ఏడాదిలో పనులు పూర్తి చేస్తామన్న హైడ్రా కమిషనర్
- 129 ఏళ్ల చరిత్రకు మళ్లీ జీవం పోసే పనిలో హైడ్రా
- త్వరలో సీఎం చేతుల మీదుగా పనులు ప్రారంభం
- ఆక్రమణలు తొలగించి పూర్తి స్థాయిలో అభివృద్ధికి చర్యలు



హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 30:

లేక్ సిటీగా పేరుగాంచిన హైదరాబాద్‌లో మరో చారిత్రక చెరువును పూర్తి స్థాయిలో పునరుద్ధరించేందుకు హైడ్రా రంగంలోకి దిగింది. జీడిమెట్లలోని ఫాక్స్ సాగర్ చెరువును మినిట్యాంక్ బండ్‌గా తీర్చిదిద్దాలని హైడ్రా అడుగులు వేస్తోంది. 129 ఏళ్ల చరిత్ర ఉన్నఈ చెరువును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. త్వరలో గౌరవ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ చెరువు పునరుద్ధరణ పనులు ప్రారంభించ నున్న నేపథ్యంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ శుక్రవారం ఫాక్స్ సాగర్‌ను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. హైడ్రా అదనపు కమిషనర్ డి. ఆనంద్‌కుమార్, ఏసీపీ పి. తిరుమల్ కమిషనర్ వెంట ఉన్నారు. చెరువు ప్రస్తుత పరిస్థితిని క్షేత్ర స్థాయిలో హైడ్రా కమిషనర్ పరిశీలించారు. ఆరో నిజాం మీర్ మహబూబ్ అలీ ఖాన్ (అసఫ్ జాVI) హయాంలో 1897లో నిర్మించిన చారిత్రక ఫాక్స్ సాగర్ చెరువు ఉత్తర హైదరాబాద్, సికింద్రాబాద్ ప్రాంతాల ప్రజల తాగునీటి అవసరాలను తీర్చడంతో పాటు వ్యవసాయానికి ప్రధాన ఆధారంగా నిలిచేదని ఇంతటి ప్రాధాన్యం ఉన్న ఈ చెరువు కాలుష్య జలాలతో నిండిపోవడమే కాకుండా.. కబ్జాలకు గురైందని హైడ్రా కమిషనర్ చెప్పారు. దాదాపు 490 ఎకరాల ఈ చెరువు పరిధి ఉండగా.. 150 ఎకరాల మేర ఆక్రమణలకు గురైనట్టు తెలుస్తోందని.. కబ్జాలను తొలగిస్తామన్నారు.

మినీ ట్యాంక్‌బండ్.. ప్రభుత్వ లక్ష్యం

జీడిమెట్లలోని ఫాక్స్ సాగర్ ను మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్దేశించారని.. ఏడాదిలో ఈ చెరువు పనులు పూర్తి చేస్తామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. సుమారు 150 ఎకరాల మేర ఆక్రమణలు జరిగినట్లు అంచనా వేస్తున్నామని.. రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలతో కలిసి ఆక్రమణలను తొలగించి చెరువును అభివృద్ధి చేస్తామన్నారు. ఎవరివైనా పట్టా భూములుంటే.. చట్ట ప్రకారం వారికి టీడీఆర్ వస్తుందని తెలిపారు. దాదాపు 47 కిలోమీటర్ల నుంచి ఈ చెరువుకు వరద నీరు వచ్చి చేరేదని.. 2000 సంవత్సరంలో కట్ట కొట్టుకుపోవాల్సినంత వరద వచ్చి చేరిందని అన్నారు. అందుకే ఈ చెరువును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తే చాలా వరకూ తాగునీటి సమస్యలు కూడా పరిష్కారమౌతాయన్నారు. చెరువు సహజలక్షణాలన్నీ మళ్లీ సమకూరుస్తామని.. ఇన్‌లెట్లు, ఔట్‌లెట్లను అభివృద్ధి చేస్తామన్నారు. తొలిదశ పనులను రూ. 75 కోట్లతో చేపడుతున్నట్టు తెలిపారు.

చరిత్ర ఎంతో ఘనం.. పునరుద్ధరణకు హైడ్రా సిద్ధం

జీడిమెట్లలోని ఫాక్స్ సాగర్ చెరువు చరిత్ర ఎంతో ఘనం.. నాటి నిజాం పాలకుల దూరదృష్టికి, ఇంజినీరింగ్ నైపుణ్యానికి ప్రతీకగా నిలిచిన ఈ చెరువును 1897లో ఆరో నిజాం మీర్ మహబూబ్ అలీ ఖాన్ పాలనాకాలంలో నిర్మించారు. అప్పట్లో సికింద్రాబాద్ ప్రాంతంలో అతిపెద్ద నీటి వనరుల్లో ఇది ఒకటిగా ఉండేది. ఒకప్పుడు ఈ చెరువు నుంచి నీటిని పంపింగ్‌చేసి పైపుల ద్వారా ప్రజలకు సరఫరా చేసేవారు. ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్ వంటి ప్రధాన జలాశయాలు నిర్మించకముందే ఫాక్స్ సాగర్ నగర నీటి అవసరాలకు సేవలందించడం విశేషం. ఈ చెరువు కట్టపై నిర్మించిన పురాతన రాతి పంప్ హౌస్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. దానిపై ఫాక్స్ సాగర్ 1897' అని చెక్కి ఉండటం ఆనాటి చరిత్రకు ప్రత్యక్ష ఆధారంగా ఉంది. ఫాక్స్ సాగర్ కేవలం నీటి నిల్వ కేంద్రం మాత్రమే కాదు. జీవవైవిధ్యానికి కూడా ముఖ్యమైన ప్రాంతం. బుల్బుల్, కింగ్‌ఫిషర్, కొంగలు, వీవర్ పక్షులు, ఇతర స్థానిక, వలస పక్షులకు ఈ చెరువు ఆవాసంగా నిలుస్తోంది. చెరువులో చేపల వేట ద్వారా స్థానిక మత్స్యకారులకు జీవనోపాధి లభిస్తోంది. వర్షపు నీటిని నిల్వ చేయడం, భూగర్భ జలాలను పెంపొందించడం, పరిసర ప్రాంతాల పర్యావరణ సమతుల్యతను కాపాడటంలోనూ ఈ జలాశయం కీలక పాత్ర పోషిస్తోంది. ఇంతటి ప్రాధాన్యతతో పాటు చారిత్రక నేపథ్యం ఉన్న ఈ చెరువును పునరుద్ధరించి.. భావితరాలకు భద్రంగా అందించాలని హైడ్రా నిర్ణయించింది.

తెలంగాణ ప్రభుత్వం మరో మానవీయ నిర్ణయం

- ఇక అన్ని ప్రధాన సామాజిక భద్రతా పింఛన్లలోనూ ఇన్‌స్టంట్ పెన్షన్ సదుపాయం
- మంత్రి సీతక్క ఆదేశాలతో దివ్యాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, డయాలసిస్, హెచ్ఐవీ, ఫైలేరియా బాధితుల కుటుంబాలకు ఊరట

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 30: సామాజిక భద్రతకు పెద్దపీట వేస్తూ తెలంగాణ ప్రభుత్వం మరో మానవీయ నిర్ణయం తీసుకుంది. పింఛన్‌దారులైన భర్తలు మరణించిన సందర్భాల్లో వారి భార్యలకు తక్షణమే సామాజిక భద్రతా పింఛన్ మంజూరు చేసే ఇన్‌స్టంట్ పెన్షన్ సదుపాయాన్ని మరిన్ని కేటగిరీలకు విస్తరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మంత్రి సీతక్క ఆదేశాలతో తీసుకున్న ఈ నిర్ణయం ద్వారా దివ్యాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, డయాలసిస్, హెచ్ఐవీ బాధితులు, ఫైలేరియా బాధితుల కుటుంబాలకు ప్రయోజనం కలగనుంది.

ఇప్పటివరకు వృద్ధాప్య పింఛన్ పొందుతున్న భర్త మరణించిన సందర్భంలో ఆయన భార్యకు ఇన్‌స్టంట్ పెన్షన్ మంజూరు చేసే సదుపాయం అమల్లో ఉంది. తాజాగా ప్రభుత్వం ఈ సదుపాయాన్ని ఇతర పింఛన్ కేటగిరీలకు కూడా విస్తరించింది. దీనికి సంబంధించి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మార్గదర్శకాలను జారీ చేసింది.

జీవిత భాగస్వామిని కోల్పోయిన మహిళ ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా అండగా నిలవాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఈ విధానాన్ని రూపొందించింది. మరణించిన పురుష పింఛన్‌దారుడి భార్య వయస్సు 57 సంవత్సరాల కంటే తక్కువగా ఉంటే వితంతు పింఛన్, 57 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ ఉంటే వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ కార్యదర్శికి, పట్టణ ప్రాంతాల్లో బిల్ కలెక్టర్‌కు దరఖాస్తుతో పాటు భార్య ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్ మొదటి పేజీ, మరణించిన పింఛన్‌దారుడి ఆధార్ కార్డు, మరణ ధ్రువీకరణ పత్రం సమర్పించాలి. సంబంధిత అధికారులు పత్రాలను పరిశీలించి, చేయూత పోర్టల్‌లో వివరాలు నమోదు చేసి అర్హత ధ్రువీకరించుకున్న తర్వాత పెన్షన్ మంజూరు చేయనున్నారు. భర్తను కోల్పోయిన మహిళలకు ఆర్థిక భరోసా కల్పించడం, కుటుంబానికి అందుతున్న సామాజిక భద్రతా సహాయం కొనసాగాలని ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

కృష్ణ-గోదావరి బేసిన్ వివాదంపై సుప్రీం కీలక నిర్ణయం

- మధ్యవర్తిగా జస్టిస్ రంజనా ప్రకాశ్ నియామకం
- ప్రకటించిన సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం

న్యూఢిల్లీ, వెలుతురు అక్టోబర్ 30:

కృష్ణా–గోదావరి (కేజీ) బేసిన్ గ్యాస్ వివాదానికి సంబంధించి దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. రిలయన్స్ ఇండస్ట్రీస్, ఇతరుల మధ్య ఉన్న కేజీ బేసిన్ గ్యాస్ తరలింపు వివాదానికి సంబంధించి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ రంజనా ప్రకాశ్ దేశాయ్‌ను ఏకైక మధ్యవర్తిగా నియమించింది. ఈ మధ్యవర్తిత్వానికి అన్ని పక్షాలు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చాయని వెల్లడించింది. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, ఇతర న్యాయమూర్తులు జస్టిస్ జోయ్మాల్య బాగ్చీ, జస్టిస్ విపుల్ ఎమ్. పంచోలిలతో కూడిన సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం ఈ నియామకాన్ని ప్రకటించింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జోయ్మాల్య బాగ్చీ, జస్టిస్ విపుల్ ఎం పంచోలీలతో కూడిన ధర్మాసనం ముందుకు కేజీ బేసిన్ గ్యాస్ తరలింపు కేసు విచారణకు వచ్చింది. ఈ వివాదానికి సంబంధించి అన్ని పక్షాలు ఒక ఆచరణాత్మక పరిష్కారాన్ని కనుగొనలేకపోయాయన్న సమాచారం ధర్మాసనం దృష్టికి చేరింది. ఈ కేసులో రిలయన్స్ ఇండస్ట్రీస్ తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ సుప్రీంకోర్టు ధర్మాసనం ఎదుట వాదనలు వినిపించారు. 'ఈ వివాదాన్ని కోర్టు వెలుపల పరిష్కరించుకోగలమేమో చూద్దాం. ఈ కేసులో మీరు (సుప్రీంకోర్టునుద్దేశించి) ఎవరిని మధ్యవర్తిగా నియమించాలనుకుంటే వారిని నియమించండి' అని సిబల్ అన్నారు. ఈ వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు ధర్మాసనం స్పందించింది. కేజీ బేసిన్ వివాదానికి సంబంధించి మధ్యవర్తిగా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ రంజనా ప్రకాశ్ దేశాయ్ పేరును ప్రతిపాదించింది. ఆమెకు ఉన్న కమర్షియల్ లిటిగేషన్ బ్యాక్‌గ్రౌండ్, పరిజ్ఞానాన్ని దృష్టిలో ఉంచుకుని ఇరు పక్షాలు పరిష్కారం కోసం ప్రయత్నించాలని పిలుపునిచ్చింది. అలాగే ఇరుపక్షాలు సూచించిన ఇద్దరు నిపుణుల సహాయాన్ని తీసుకోవాలని మధ్యవర్తిని కోరతామని పేర్కొంది.

సేవాభావం, క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసమే

స్కౌట్స్ అండ్ గైడ్స్ లక్ష్యం

- ఇతరులకు ఉపయోగపడేలా మనల్ని మనం సిద్ధం చేసుకోవాలి
- నాయకత్వమంటే పదవి కాదు.. ఎంతమందికి సేవ చేయగలమన్నదే ముఖ్యం: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ పాఠశాల అభివృద్ధికి సింగరేణి నుంచి రూ.2.5 కోట్ల సాయం

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 30 :

విద్యార్థుల్లో క్రమశిక్షణ, సమయపాలన, సేవాభావం, నాయకత్వ లక్షణాలతో పాటు నైతిక విలువలను పెంపొందించడంలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కీలక పాత్ర పోషిస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. జీవితంలో వ్యక్తిగత విజయాలు సాధించడంతోపాటు ఇతరులకు ఉపయోగపడేలా తమను తాము తీర్చిదిద్దుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. నాయకత్వమంటే ఎంతమంది మనకు సేవ చేస్తున్నారనేది కాదని, మనం ఎంతమందికి సేవ చేయడానికి సిద్ధంగా ఉన్నామనేదే అసలైన నాయకత్వ లక్షణమని పేర్కొన్నారు.

దోమలగూడలోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ మోడల్ హైస్కూల్ నవీకరణ పనుల శంకుస్థాపన కార్యక్రమానికి శుక్రవారం రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లతో కలిసి హాజరైన ఉప ముఖ్యమంత్రి మాట్లాడారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ నినాదమైన 'ఎప్పుడూ సిద్ధంగా ఉండండి' అనే రెండు పదాల వెనుక గొప్ప జీవిత తత్వం దాగి ఉందన్నారు. పరీక్షలు, ఉద్యోగాలు, పదోన్నతులు, వ్యక్తిగత విజయాల కోసం సిద్ధమవడం కంటే కష్టాల్లో ఉన్నవారికి సహాయం చేయడానికి సిద్ధంగా ఉండటమే గొప్ప లక్షణమని చెప్పారు.

ప్రస్తుత కాలంలో కృత్రిమ మేధస్సు, సాంకేతిక పరిజ్ఞానం ఎన్నో ప్రశ్నలకు సమాధానాలు అందిస్తున్నాయని, అయితే మనం ఎలాంటి మనుషులుగా ఎదగాలనే ప్రశ్నకు మాత్రం సాంకేతికత సమాధానం చెప్పలేదన్నారు. విద్య జ్ఞానాన్ని అందిస్తే, శీలం ఆ జ్ఞానాన్ని సద్వినియోగం చేసుకునే అర్హతను కల్పిస్తుందని పేర్కొన్నారు. నాయకత్వంతోపాటు ఇతరులను అనుసరించడం, పోటీపడటంతోపాటు సహకరించడం, స్వతంత్రంగా ఉంటూనే సమాజం పట్ల బాధ్యతతో వ్యవహరించడం స్కౌట్స్ అండ్ గైడ్స్ నేర్పించే గొప్ప పాఠాలని వివరించారు. మహాత్మా గాంధీ పదవులు, అధికారంతో కాకుండా తన ఆచరణ, వ్యక్తిత్వం ద్వారా లక్షలాది మందికి నాయకత్వం వహించారని గుర్తుచేశారు. దేశానికి అవసరమైన నాయకత్వం కూడా అలాంటిదేనని అన్నారు.

గాంధేయ సిద్ధాంతాల పట్ల నిబద్ధతతో పాటు పాఠశాలలు, స్కౌట్స్ అండ్ గైడ్స్ సంస్థల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న గవర్నర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, గవర్నర్ కార్యదర్శి దాన కిషోర్, విద్యా శాఖ కార్యదర్శి యోగితారాణా తదితరులు పాల్గొన్నారు.

70 వేల మందికి చేరువైన స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉద్యమం

గవర్నర్ మార్గదర్శకత్వంలో తెలంగాణలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉద్యమం గణనీయంగా అభివృద్ధి చెందుతోందని తెలిపారు. ఏడాది కాలంలో సభ్యుల సంఖ్య దాదాపు 70 వేల స్థాయికి చేరిందని చెప్పారు. ఈ కార్యక్రమాలను 3,200కు పైగా ప్రభుత్వ పాఠశాలలకు విస్తరించి, సుమారు 1.3 లక్షల మంది విద్యార్థులకు చేరువ చేయాలని ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందన్నారు. విద్యార్థులు మరింత ధైర్యవంతులు, దయగలవారు, బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగడమే ఈ ఉద్యమం సాధించిన అసలైన విజయమని పేర్కొన్నారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ మోడల్ హైస్కూల్ పునరుద్ధరణ, అభివృద్ధి పనుల కోసం సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్) కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద రూ. 2.5 కోట్లు అందించడం అభినందనీయమని అన్నారు. విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన బొగ్గును వెలికితీసే సింగరేణి సంస్థ, ఇప్పుడు పిల్లల్లోని ప్రతిభను వెలికితీసి వారి భవిష్యత్తును ప్రకాశవంతం చేసేందుకు తోడ్పడటం సంతోషకరమని పేర్కొన్నారు. తరగతి గదులు, క్రీడా సౌకర్యాలు, కంప్యూటర్లు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధితో విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం అందుబాటులోకి వస్తుందని తెలిపారు.

దుబాయ్‌లో చిక్కుకుపోయిన తెలంగాణ వాసి

సీఎం ప్రజావాణి చొరవతో సురక్షితంగా స్వదేశానికి

గద్వాల్ విజయలక్ష్మికి ధన్యవాదాలు తెలిపిన బాధితులు

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 30:

సీఎం ప్రజావాణి ద్వారా తెలంగాణకు చెందిన మరో ప్రవాసి కార్మికుడు సురక్షితంగా స్వదేశానికి తిరిగి వచ్చారు. నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండలం, బినోలా గ్రామానికి చెందిన బుద్ధ పెంటాజీ ఉపాధి నిమిత్తం దుబాయ్‌లోని అరోమా ఇంటర్నేషనల్ బిల్డింగ్ కాంట్రాక్టింగ్ సంస్థలో భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నారు. సరైన శిక్షణ, అనుభవం లేకుండా కఠినమైన పనులు చేయాల్సి రావడంతో పాటు, అధిక పని గంటల కారణంగా ఆయన తీవ్ర అనారోగ్య సమస్యలు, నీరసం, అధిక చెమటతో బాధపడుతూ ఉద్యోగం కొనసాగించలేని పరిస్థితి ఏర్పడింది.

అంతేకాకుండా, స్వదేశానికి తిరిగి రావడానికి రూ. 90,000కు పైగా ఖర్చు అవుతుందని తెలియడంతో, ఆర్థికంగా వెనుకబడిన ఆయన కుటుంబం ఆ మొత్తాన్ని భరించలేక ఇబ్బందులు ఎదుర్కొంది. ఈ నేపథ్యంలో, ఆయన భార్య బుద్ధ పుష్ప 2026 అక్టోబర్ 9న సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్ పర్సన్ గద్వాల్ విజయలక్ష్మిని ఆశ్రయించి, తన భర్తను సురక్షితంగా స్వదేశానికి తీసుకురావాలని కోరారు. ఈ ఫిర్యాదుపై విజయలక్ష్మి ప్రత్యేక చొరవ తీసుకుని, తెలంగాణ ఎన్ఆర్ఐ విభాగం, దుబాయ్‌లోని భారత కాన్సులేట్ సహకారంతో అవసరమైన చర్యలు చేపట్టారు. వారి సమన్వయంతో బుద్ధ పెంటాజీ 2026 అక్టోబర్ 23న సురక్షితంగా హైదరాబాద్‌కు చేరుకున్నారు.

సీఎం ప్రవాసి ప్రజావాణి ద్వారా విదేశాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్న తెలంగాణ ప్రవాసులకు ప్రభుత్వం అందిస్తున్న సహాయానికి ఈ ఘటన ఒక విజయవంతమైన ఉదాహరణగా నిలిచింది. తమ సమస్యను పరిష్కరించి తన భర్తను సురక్షితంగా స్వదేశానికి తీసుకురావడంలో సహకరించిన ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డికి, సీఎం ప్రజావాణి స్టేట్ ఇంచార్జ్ గద్వాల్ విజయలక్ష్మి, అధికారులకు, ఎన్ఆర్ఐ విభాగానికి, దుబాయ్‌లోని భారత కాన్సులేట్‌కు బుద్ధ పుష్ప, పెంటాజీ కృతజ్ఞతలు తెలిపారు.

కాగా 265వ సీఎం ప్రజావాణిలో శుక్రవారం 105 దరఖాస్తులు అందాయి. స్టేట్ ఇంచార్జ్ గద్వాల్ విజయలక్ష్మి, స్టేట్ నోడల్ అధికారి కే. విద్యాసాగర్ దరఖాస్తులు స్వీకరించారు.

బీజేపీతో పొత్తుకు బీఆర్ఎస్ తహతహ

- చంద్రబాబుతో చీకటి ఒప్పందం
- ఎమ్మెల్సీ అభ్యర్థులను ప్రకటించే దమ్ముందా?
- మహేష్‌కుమార్ గౌడ్

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 30:

బీఆర్ఎస్ నేతలు బీజేపీతో పొత్తు కోసం తహతహలాడుతున్నారని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ విమర్శించారు. బావా బామ్మర్దులు చంద్రబాబు నాయుడును తెగ పొగుడుతున్నారని, గతంలో చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన నేతలే ఇప్పుడు ఆయనను ప్రసన్నం చేసుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీతో పొత్తులో భాగంగానే ఈ పరిణామాలు చోటుచేసుకుంటున్నాయని అన్నారు. కాంగ్రెస్‌పై నిరాధార ఆరోపణలతో యాగీ చేసే బీఆర్ఎస్ సోషల్ మీడియా, చంద్రబాబు, టీడీపీ, బీజేపీలపై మాత్రం విమర్శలు చేయకపోవడమే ఆ పార్టీల మధ్య ఉన్న చీకటి ఒప్పందానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. బీజేపీతో పొత్తుకు సిద్ధమవుతూ, చంద్రబాబుతో సయోధ్య కోసం బీఆర్ఎస్ నేతలు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. దమ్ముంటే ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ అభ్యర్థులను ప్రకటించాలని బీఆర్ఎస్ నేతలకు సవాల్ విసిరారు. బీజేపీకి సహకరించేందుకు మహబూబ్‌నగర్ స్థానాన్ని వదులుకునేలా, నల్గొండ ఎమ్మెల్సీ స్థానంలోనూ పరస్పర సహకారానికి వ్యూహాలు రచిస్తున్నారని ఆరోపించారు.

ప్రతి గ్రామానికి సమగ్ర అభివృద్ధి ప్రణాళిక

- దేశంలోనే తొలిసారిగా తెలంగాణలో జీపీఎస్‌పిపి-2026
- ఐదేళ్ల అభివృద్ధికి స్పష్టమైన కార్యాచరణ.. గ్రామాల వారీగా సమగ్ర డేటా
- పారదర్శకత, జవాబుదారీతనంతో ప్రణాళికాబద్ధమైన పాలనకు శ్రీకారం

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 30:

తెలంగాణలోని ప్రతి గ్రామపంచాయతీకి సమగ్ర అభివృద్ధి ప్రణాళిక రూపొందించేందుకు పంచాయతీరాజ్ శాఖ జీపీఎస్‌పిపి-2026ను అమలు చేయనుంది. దేశంలోనే తొలిసారిగా ప్రతి గ్రామానికి సమగ్ర డేటాను సేకరించి, రాబోయే మూడు నుంచి ఐదేళ్లలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలకు స్పష్టమైన కార్యాచరణ రూపొందించనున్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ఆలోచన, ఆదేశాల మేరకు ఈ ప్రణాళికను రూపొందించినట్లు అధికారులు తెలిపారు. ఇందుకు సంబంధించి పంచాయతీరాజ్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

గ్రామ సమగ్ర ప్రొఫైల్

జీపీఎస్‌పిపిలో భాగంగా ప్రతి గ్రామానికి సంబంధించిన సమగ్ర సమాచారాన్ని సేకరించనున్నారు. గ్రామ జనాభా, కుటుంబాల స్థితిగతులు, ఉపాధి, గృహవసతి, పశుసంపద, మౌలిక వసతులు, ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్న కుటుంబాలు తదితర వివరాలతో గ్రామ ప్రొఫైల్ రూపొందించనున్నారు. ఈ డేటా ఆధారంగా గ్రామానికి అవసరమైన అభివృద్ధి పనులను ప్రాధాన్యత క్రమంలో గుర్తిస్తారు.

ఐదేళ్ల ప్రణాళిక.. ఏటా కార్యాచరణ

గ్రామ అవసరాలు, ప్రజల ప్రాధాన్యతలను పరిగణనలోకి తీసుకుని మూడు నుంచి ఐదేళ్ల అభివృద్ధి ప్రణాళికను సిద్ధం చేస్తారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన పనులకు ప్రత్యేక వార్షిక కార్యాచరణ రూపొందిస్తారు. తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, విద్య, ఆరోగ్యం, ఉపాధి, వ్యవసాయం, పశుసంపద తదితర రంగాల్లో అవసరమైన పనులను గుర్తించి అమలు చేయనున్నారు. వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయంతో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లనున్నారు.

వెబ్‌సైట్.. డాష్‌బోర్డు

ప్రతి గ్రామపంచాయతీకి ప్రత్యేక వెబ్‌సైట్ ఏర్పాటు చేయడం, అభివృద్ధి పనుల పురోగతిని ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు డాష్‌బోర్డు అందుబాటులోకి తీసుకురావడం జీపీఎస్‌పిపి లక్ష్యాల్లో ఉన్నాయి. ప్రతి నెలా నిర్వహించే గ్రామపంచాయతీ సమావేశంలో జీపీఎస్‌పిపి అమలుపై సమీక్ష నిర్వహించనున్నారు. చేపట్టిన పనుల పురోగతి, పెండింగ్‌లో ఉన్న పనులు, తదుపరి కార్యాచరణపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుంది.

అధికారులకు బాధ్యతలు

జీపీఎస్‌పిపి అమలులో గ్రామపంచాయతీ కార్యదర్శి నుంచి జిల్లా కలెక్టర్ వరకు వివిధ స్థాయిల అధికారులకు బాధ్యతలు అప్పగించనున్నారు. గ్రామాల నుంచి సరైన సమాచారం సేకరించడం, డేటాను నవీకరించడం, ప్రణాళిక ప్రకారం పనులు జరిగేలా చూడటం అధికారుల బాధ్యతగా ఉంటుంది. సమాచారం ఇవ్వడంలో నిర్లక్ష్యం వహించినా, తప్పుడు సమాచారం అందించినా సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోనున్నట్లు పంచాయతీరాజ్ శాఖ స్పష్టం చేసింది.

'తెలంగాణ రైజింగ్-2047' లక్ష్యాలకు అనుగుణంగా గ్రామాల అభివృద్ధి, పారదర్శకత, జవాబుదారీతనంతో ప్రణాళికాబద్ధమైన పాలన అందించడమే జీపీఎస్‌పిపి-2026 ప్రధాన ఉద్దేశ్యమని అధికారులు పేర్కొన్నారు.

మియాపూర్ భూములను కాపాడింది బీఆర్ఎస్

అమ్మేందుకు చూస్తోంది కాంగ్రెస్

సుప్రీంకోర్టులో ఎనిమిదేళ్ల పాటు న్యాయపోరాటం చేశాం

రూ.60 వేల కోట్ల విలువైన 550 ఎకరాల భూమిపై ప్రభుత్వ కుట్ర: హరీశ్ రావు

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 30:

మియాపూర్‌లోని 550 ఎకరాల విలువైన ప్రభుత్వ భూములను బీఆర్ఎస్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో పోరాడి కాపాడిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని విక్రయించేందుకు ప్రయత్నిస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ఆరోపించారు. మియాపూర్ భూములపై సుప్రీంకోర్టు తీర్పు అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు వాస్తవాలకు విరుద్ధంగా ఉన్నాయని విమర్శించారు.

2003లోనే సుప్రీంకోర్టుకు చేరిన ఈ భూ వివాదంలో 2015లో నాటి కేసీఆర్ ప్రభుత్వం సీనియర్ న్యాయవాది సీ.ఎస్. వైద్యనాథన్‌ను నియమించిందని తెలిపారు. 2015 నుంచి 2023 వరకు దాదాపు ఎనిమిదేళ్ల పాటు తెలంగాణ ప్రభుత్వం తరఫున ఆయన న్యాయపోరాటం చేశారని పేర్కొన్నారు. మియాపూర్ భూముల పరిరక్షణకు సంబంధించిన పిటిషన్లు, అఫిడవిట్లు, ఆధారాలను సుప్రీంకోర్టుకు సమర్పించింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనన్నారు.

2023 జూన్ 15న గోల్డ్‌స్టోన్ ప్రసాద్‌కు సంబంధించిన ట్రినిటీ ఇన్‌ఫ్రావెంచర్స్ కేసులో తెలంగాణ ప్రభుత్వం సాధించిన విజయం, మియాపూర్ భూముల తుది తీర్పునకు కీలక ఆధారంగా నిలిచిందని వివరించారు. ఈ విషయాలన్నీ సుప్రీంకోర్టు రికార్డుల్లో ఉన్నాయని తెలిపారు. మియాపూర్‌లోని 550 ఎకరాల భూముల విలువ రూ. 60వేల కోట్లకుపైగా ఉంటుందని ముఖ్యమంత్రే ప్రకటించారని గుర్తుచేస్తూ, ప్రజల భవిష్యత్తు అవసరాలకు ఉపయోగపడాల్సిన విలువైన ప్రభుత్వ భూములను విక్రయించేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని హరీశ్ రావు ఆరోపించారు.

ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడటమే కాంగ్రెస్ లక్ష్యం

మంత్రి పొన్నం ప్రభాకర్

- హైదరాబాద్‌లో నిరసన చేపట్టే ముందు అమిత్ షా తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలి
- ప్రజాస్వామ్య వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరిపై పోరాటం తప్పదు
- జాతీయ జనగణనలో వెంటనే బీసీ కులగణనను చేర్చాలి
- ప్రభుత్వ భూముల పరిరక్షణ చారిత్రాత్మక విజయం

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 30

తెలంగాణ ప్రభుత్వ న్యాయ పోరాటం ఫలించి వేలాది కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా దక్కడంపై ముఖ్యమంత్రికి, న్యాయ వ్యవస్థకు మంత్రి పొన్నం ప్రభాకర్ గారు తెలంగాణ ప్రజల పక్షాన అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు.

గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడిన మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు 'ఓట్ బచావో - దేశ్ బచావో' నినాదంతో ఏఐసీసీ నాయకులు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ పెద్ద ఎత్తున పోరాటం చేస్తోందని పేర్కొన్నారు. ఈ నిరసన ప్రదర్శనలో పాల్గొనేందుకు తెలంగాణ కాంగ్రెస్ పార్టీ నుంచి మండల, బ్లాక్ అధ్యక్షులు, మార్కెట్ చైర్మన్లు, జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్లు సహా ముఖ్య నాయకులందరూ ఢిల్లీకి తరలివెళ్లారన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా హైదరాబాద్ పర్యటనపై స్పందిస్తూ దేశ హోంమంత్రిగా హైదరాబాద్‌కు ఎవరైనా రావచ్చు, అనుమతులు ఇస్తామని, కానీ రాజకీయంగా కొన్ని సూటి ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు పట్ల, తెలంగాణ అమరవీరుల త్యాగాల పట్ల గతంలో పార్లమెంటు సాక్షిగా అవమానకరంగా మాట్లాడినందుకు అమిత్ షా, ప్రధాని మోదీలు తెలంగాణ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని అన్నారు. 'ఓట్ చోర్ - గద్దీ చోడ్' అంటూ ప్రజాస్వామ్యాన్ని రక్షించాల్సిన అవసరం దేశవ్యాప్తంగా ఉందని చెప్పారు. మణిపూర్, ఈశాన్య రాష్ట్రాల్లో అల్లర్లు, చైనా సరిహద్దు సమస్యలు వంటి కీలక అంశాలను గాలికొదిలేసి, ప్రశాంతంగా ఉన్న తెలంగాణలో రాజకీయ లబ్ధి కోసం అమిత్ షా పర్యటిస్తున్నారని విమర్శించారు. తెలంగాణ బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా అధికారికంగా లేఖ రాస్తున్నట్లు వెల్లడించారు. బీసీల స్థితిగతులు మెరుగుపడాలన్నా, రిజర్వేషన్లు, సంక్షేమ పథకాలు సక్రమంగా అందాలన్నా కులాల వారీ గణాంకాలు తప్పనిసరి అని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా పశువులు, గొర్రెల లెక్కలు తీస్తున్న కేంద్రం, కోట్లాది మంది ఓబీసీల లెక్కలు ఎందుకు తీయడం లేదని నిలదీశారు.

తెలంగాణ బీజేపీ బీసీ నాయకులు లక్ష్మణ్, బండి సంజయ్, ఈటల రాజేందర్, ధర్మపురి అరవింద్ తదితరులు చిత్తశుద్ధి ఉంటే జనగణనలో కులగణన చేర్చాలని అమిత్ షాపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. బీజేపీ పాలనలో రాజ్యాంగబద్ధమైన స్వతంత్ర సంస్థలను నిర్వీర్యం చేస్తున్నారని, దేశవ్యాప్తంగా కుట్రపూరితంగా పేదల ఓట్లను తొలగిస్తున్నారని ఆరోపించారు. కేంద్ర ఎన్నికల సంఘం తీరుపై న్యాయస్థానాలు సైతం గతంలో అక్షింతలు వేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఓటు హక్కు ప్రజల ప్రాథమిక, ప్రజాస్వామిక హక్కు అని, దాన్ని హరించే ప్రయత్నాలను సహించేది లేదన్నారు. రాబోయే రోజుల్లో దేశ ప్రజలే బీజేపీకి తగిన గుణపాఠం చెబుతారని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

భక్తిశ్రద్ధలతో శ్రీ వెంకటేశ్వర స్వామి రథోత్సవం

- వైభవంగా సాగిన స్వామివారి రథయాత్ర..
- ప్రారంభించిన ఎమ్మెల్యే శంకర్

ఆదిలాబాద్, వెలుతురు అక్టోబర్ 30:

ఆదిలాబాద్ పట్టణంలోని శాస్త్రి మందిరం నుంచి శ్రీ వెంకటేశ్వర స్వామి రథోత్సవాన్ని శుక్రవారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఉత్సవ మూర్తిని రథంపై ప్రతిష్ఠించి పట్టణంలోని పురవీధుల గుండా ఊరేగించారు.

పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తుల గోవింద నామస్మరణతో రథోత్సవం భక్తిపారవశ్యంలో కన్నులపండువగా సాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ రథయాత్రను ప్రారంభించి, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ జోగు శైలజా రవి, రవికాంత్, మనోజ్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITOR G BAKKA YADAIAH, R.N.I. TEL TEL/2019/78609. Cell: 91773 87328, Email: velthurunewspaper@gmail.com